

మధుబాబు
2
RS
MVS
PUBLICATIONS

## గండుం చీమ

"పొరపాటు జరిగిందని వప్పుకో. ఇకముందు యిటువంటి మాటలను ఉచ్చరించనని లెంపలు వేసుకో," పిడికిలి బిగిస్తూ హెచ్చరించాడు మాధవుడు.

"ఎందుకు వేసుకోవాలి? వేదపాఠాలను పఠించటానికి బదులుగా అస్త్రశస్త్రాలను పట్టుకోలేదా మీ తండ్రి? యుద్ధాలు చేసి బ్రాహ్మణ కులగౌరవాన్ని మంటగలపలేదా? భార్యా పిల్లల్ని వదిలేసి దేశాలు పట్టుకొని పారిపోలేదా?" మొండిగా అన్నాడా బాలుడు.

ఫటామని శబ్దం వచ్చేలా అతని నోటిమీద కొట్టాడు మాధవుడు.

'అమ్మా!' అని అరుస్తూ నేలమీదపడ్డాడతను. పెదవులు తెగి రక్తం వెలువడటాన్ని చూసుకొని గోలుగోలున ఏడ్వటం ప్రారంభించాడు.

చుట్టూ నిలబడి వారి వాగ్వివాదాలను ఆలకిస్తున్న బాలురలో కొంతమంది పెద్దగా అరుస్తూ మాధవుడి మీద కలియబడ్డారు.

కొదమ సింగంలా గిర్రున తిరిగాడు మాధవుడు. కాళ్ళకు తగిలిన కర్రముక్క నొకదాన్ని చేతబట్టుకొని దొరికిన వారిని దొరికినట్లే మర్దించటం ప్రారంభించాడు.

వయసులో అతనికంటె పెద్దవాళ్లు వారందరూ. కాని, మాధవుడి వేగం ముందు వారి శక్తి సామర్థ్యాలు ఎందుకూ పనికిరాకుండా పోయాయి.

'అరివీర భయంకరుడని పేరు తెచ్చుకున్నాడు నా తండ్రి. కార్తికేయుడి పేరు చెప్పితే మాళవ యుద్ధ గజాలు నీళ్ళు కూడా త్రాగవు. మగధ సైనికులు ఆయుధాలు నేలకు వదిలి చేతులు జోడిస్తారు. నా తండ్రిని మించిన వీరుడు యీ భూ ప్రపంచంలో ఎవరూ లేరు. వప్పుకోండి. బ్రాహ్మణ కులానికి వన్నె తెచ్చిన సద్బ్రాహ్మణుడు నా తండ్రి అని ముమ్మారు పలకండి' అంటూ వారందర్నీ చిందర వందర చేశాడు మాధవుడు.

పారిపోగలిగిన వారు పారిపోయారు. పారిపోలేనివారు చేతులు జోడించి మాధవుడి తండ్రికి జయ జయ ధ్వానాలు చేశారు.

పారిపోయిన బాలురు-కొంతమంది పెద్దల్ని వెంటబెట్టుకొని రావటాన్ని గమనించాడు మాధవుడు. 'నా తండ్రిని గురించి యికముందు హీనంగా మాట్లాడారంటే మీ ఎముకల్ని చూర్ణం చేస్తాను, జాగ్రత్త' అని హెచ్చరిస్తూ వెనుతిరిగి ఒక్కసారిగా పరుగు అందుకున్నాడు.

'ఏడిరా వాడు? ఎక్కడరా ఆ ఆకతాయి?' అంటూ అక్కడికి వచ్చారు ఆ పెద్దలు. అప్పటికే వారి కంటపడకుండా తప్పించుకున్నాడు మాధవుడు.

* * *

సర్రున ప్రక్కకు తిరిగి ప్బ కొట్టాడు నాగేశు. పాదాలు



భూమిని తాకిన మరుక్షణం తారా జువ్వలా వచ్చి మాధవుడి మీద కలబడ్డాడు.

మోకాలిని నేలకు ఆనించి ఎడమచేత్తో అతని తొడల మీద కొట్టాడు మాధవుడు.

'తప్పు మాధవయ్యా! పోటుగాడు ఎదుట నిలబడినప్పుడు పొరపాటున కూడా క్రిందికి వంగకూడదు. నా కాళ్ళు మడత బడేలోగా, నీ మెడ ఎముకలు విరిగిపోతాయి' వెనక్కి తగ్గుతూ హెచ్చరించాడు నాగేశు.

'వామ హస్తాన్నే కదా నేను వుపయోగిస్తున్నది! నువ్వు ముష్టి ఘాతాన్ని వెలువరచదలచుకుంటే అడ్డుకోవటానికి సిద్ధంగానే వుంది నా దక్షిణ హస్తం,' కుడిచేతిని పైకి ఎత్తుతూ అన్నాడు మాధవుడు.

'ఎలా? చూపించు' అంటూ అతనిమీదికి లంఘించాడు దొమ్మరి నాగేశు. తన పిడికిళ్ళను గాలిలోకి ఎత్తి బలంగా దించాడు మాధవుడి మెడమీదికి.

ఎడమ చేత్తో అతని తొడల్ని గుద్ది కుడిచేతిని పైకి ఎత్తాడు మాధవుడు. నాగేశు పిడికిళ్ళను ప్రక్కకు తోస్తూ లేచి, అతని వక్షస్థలంమీద తన్నాడు.

మొదటి దెబ్బకే సగం మడతబడ్డాయి నాగేశు కాళ్ళు. గుండెలమీదపడిన దెబ్బకు పూర్తిగా తల్లక్రిందులై వెల్లకిలా పడిపోయాడు.

అంతవరకూ మౌనంగా నిలబడి, ఆపోరాటాన్ని పరికిస్తున్న నాగేశు భార్య గబగబా వచ్చి అతన్ని లేపి నిలబెట్టింది.

'చేప పిల్లకు యీత నేర్పటం అంటే యిలాగే

వుంటుంది. పోయిపోయి కార్తికేయుల వారి బిడ్డడికా నువ్వు మల్లయుద్ధం నేర్పేది!!' అన్నది మాధవుడివంక ఆప్యాయంగా చూస్తూ.

'అదేమీకాదు. నాకు దెబ్బ తగులుతుందని తటపటాయించాడు నాగేశు. లేకుంటే నా మెడ విరిగిపోయివుండేది,' వంటికి అంటిన మట్టిని దులుపుకుంటూ అన్నాడు మాధవుడు.

మాధవయ్యా! ప్రొద్దుపోతున్నది. మీయమ్మ ఎదురు చూస్తూ వుంటాది. బేగి యింటికి పోరాదా?' అన్నది తొంభై సంవత్సరాల వయసున్న నాగేశు తల్లి.

ఆ మాటతో ఒక్కసారిగా ప్రస్తుతంలోకి వచ్చాడు మాధవుడు. వెంటనే అతని కనులముందు ప్రత్యక్షమయ్యాడు తాత.

సోమశర్మ కుమారుణ్ణి తను కొట్టినట్లు యీసరికి ఆయనకు తెలిసి వుంటుంది. యమధర్మరాజులా ఎదురుచూస్తూ వుంటాడు తనకోసం.

మల్లయుద్ధాన్ని అభ్యసిస్తున్నానన్న సంతోషం ఒక్క క్షణంలో ఆవిరి అయిపోగా, బరువుగా నిట్టూరుస్తూ నాగేశు వైపు చూశాడు మాధవుడు.

'వస్తాను నాగేశూ! మళ్ళీ ఎప్పుడు కలుసుకోమంటావ్?' అంటూ పట్నంలోకి బయలుదేరాడు.

'ఎప్పుడైనా సరే. ఎవరూ చూడకుండా రా చిన్నయ్యా. నీకు మల్లయుద్ధం నేర్పుతున్నానని మీ తాతకు తెలిస్తే - నన్ను యీ వూళ్ళోవుండనీయడు' అంటూ దొమ్మరిగూడెపు పొలిమేరలదాకా వచ్చి వీడ్కోలిపాడు నాగేశు.

* * *



అర్ధరాత్రి అవుతుండగా యిల్లు చేరుకున్నాడు మాధవుడు. ఓరగా తెరిచివుంది ముఖద్వారం.

తలుపుల్ని తెరిచి నిశబ్దంగా లోపలకు అడుగుబెట్టబోతుండగా.- అలికిడి అయింది మధ్యగదిలో. గిరుక్కున వెనుతిరగబోయాడు.

'ఆగు!' అంటూ వినిపించింది ఉరుములాంటి గంభీర కంఠం.

పొడుగాటి చింత బరికెను పట్టుకొని ముందుకువస్తున్న తాతగారిని చూడగానే, శిలావిగ్రహంలా బిగుసుకుపోయాడు మాధవుడు.

'సోమశర్మ కుమారుణ్ణి కొట్టావా, లేదా?' చేతిలోని బరికెను పైకి ఎత్తుతూ ఒకే ఒక ప్రశ్న వేశాడాయన.

'కొట్టాను' తలవంచుకొనే సమాధానం యిచ్చాడు మాధవుడు.

మరుక్షణం అతనిమీద వాలిందా బరికె. బాధతో మాధవుడి కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి.

కొట్టి కొట్టి చేతులు నొప్పులు పుట్టి బరికెను విరిచి ముక్కలు చేస్తూ, విసురుగా వెళ్ళిపోయాడు మాధవుడి తాతగారు.

వంచిన తలను ఎత్తకుండా ఎలా వున్నవాడు అలాగే నిలబడిపోయాడు మాధవుడు. రెండు క్షణాల తరువాత ఒక మృదు హస్తం అతని చుబుకాన్ని పట్టుకొని పైకి ఎత్తింది.

కన్నీరు విడుస్తూ ఎదుట నిలబడిన మాతృదేవతను చూసేసరికి, కట్టలు తెంచుకొని పైకి వుబికింది మాధవుడి దుఃఖం.

'పద్దన్నకొద్దీ పోయి తగాదాల్లో తలదూర్చటం దేనికి? ఎంత చెప్పినా నీ దుడుకుతనాన్ని వదిలిపెట్టవుగదా!' అంటూ అతని శిరస్సును గుండెల్లో పొదవుకొని కన్నీరుమున్నీరైందామె.

* * *

సాయం సమయం కావస్తోంది. తాళపత్ర గ్రంథాలను ముందుపెట్టుకొని తదేక దీక్షగా శ్లోకాలను వల్లిస్తున్నాడు మాధవుడు.

ఉన్నట్లుండి ఒక చిన్న గులకరాయి వచ్చి అతనిమీద పడింది.

మెల్లగా లేచి, గవాక్షం దగ్గిరికి పోయాడు మాధవుడు. వీధి చివర నిలబడివున్న అతని స్నేహితుడొకడు-వెంటనే బయటికి రమ్మని సైగ చేశాడు.

'ఎక్కడికిరా? నిన్న చెప్పిన బుద్ధులన్నీ నిద్ర లేవగానే మరుపుకు వచ్చాయా?' తీవ్రంగా ప్రశ్నిస్తున్న మాతృదేవి మాటల్ని వినిపించుకోకుండా బయటికి పరుగుతీశాడు మాధవుడు.

'మాధవా! ఈ విషయం నీకు తెలుసా?' అతన్ని చూడగానే ఒకేసారి అన్నారు నలుగురు బాలురు.

'ఒకరొకరే చెప్పండి. ఏవిషయం?' కుతూహలంగా అడిగాడు మాధవుడు.

'మన పట్టణ కోశాధికారి వీరవర్మ-మీ దొమ్మరి నాగేశును కొరడాలతో కొట్టించాట్ట....'

ఆ కొరడా దెబ్బలు తనకు తగిలినట్లు విలవిలలాడి పోయింది మాధవుడి హృదయం.



'మేమూ వస్తున్నాం! ఆగు మాధవా!!' అని అరుస్తున్న స్నేహితులను గురించి పట్టించుకోకుండా, వింటినుంచి వెలువడిన బాణంలా దొమ్మరిగూడెం వైపు పరుగుతీశాడు.

గుడిశె ముందు భాగంలో నులకమంచంమీద పడివున్నాడు నాగేశు. ఎర్రటి వాతలతో, గడ్డకట్టిన రక్తంతో భయంకరంగా కనిపిస్తోంది అతని శరీరం.

'ఎందుకు కొట్టారు? ఏం తప్పుచేశావ్?' అడిగాడు మాధవుడు.

'ఏం చెప్పమంటావ్ మాధవయ్యా! వీరవర్మ తోటలో పళ్ళ చెట్లకు పాదులు చెయ్యటానికి పోయాడు. పని అయినాక నాలుగు జామ పళ్ళను యివ్వమని అడిగాట్ట. ఆ పిసినారి ఇవ్వను పొమ్మన్నాట్ట. తలవంచుకొని వచ్చేయకూడదా! రాలేదు యీ పెద్దమనిషి. చిలుకలు కొట్టి నేలపడిన పళ్ళను నాలుగింటిని ఏరి మడిలో మూటకట్టుకున్నాట్ట. అంతే. నాతోటలో దొంగతనం చేస్తావా అంటూ సైనికుల్ని పిలిపించి యీ శిక్షను విధింపించాడు' కన్నీరు విడుస్తూ చెప్పింది నాగేశు భార్య.

ఎర్రబడిన ముఖంతో నాగేశు బంధువులనందర్ని పరికించాడు మాధవుడు.

'మీరు యింతమంది వుండికూడా, యీ దురాగతాన్ని ఆపలేకపోయారు!!!' అన్నాడు వ్యంగ్యంగా.

'దొరబిడ్డవు. నీకు తెలియదు చిన్నయ్యా. కూటికి లేనోళ్ళం. మేము ఏపనిచేసినా యిప్పుడు తప్పుగానే కనిపిస్తుంది. వీరవర్మ అధికారానికి భయపడి ఆగాడు నాగేశు.

లేకపోతే యీపాటికి అతను వల్లకాటికిపోతూ వుండాల్సింది' అన్నాడు నాగేశు బావమరది.

గిర్రున వెనుతిరిగి పొలిమేరల దగ్గిరికి వచ్చేశాడు మాధవుడు. పరిగెత్తలేక పరుగెత్తుతూవచ్చి అతన్ని కలుసుకున్నారు అతని స్నేహితులందరూ.

'వీరవర్మ చేసిన పనికి ఎదురుపని చేయాలి. నాగేశును కొట్టినందుకు అతను రెట్టింపుగా నష్టపడాలి' అన్నాడు మాధవుడు.

'నువ్వు వూఁ అను మాధవా! వీరవర్మ పళ్ళతోటలో పనసు పిందెలు కూడా లేకుండా రాల్చేస్తాం' అన్నాడొక బాలుడు.

'భేష్! మంచియోచన చెప్పావ్‌రా....వీరవర్మ ప్రాణాలు పోవటానికి అకాస్తపని ఛాలు. మరి యింకా ఆలస్యం దేనికి? పదండి పోదాం' అంటూ పరుగు అందుకున్నాడు మాధవుడు.

పట్టణానికి ఉత్తరదిశలో వున్నది వీరవర్మ తోట.

తోటకు అడ్డుగా వున్న గోడలమీదినుంచి దుమికి, చెట్ల చాటుకు చేరుకున్నారు మాధవుడి మిత్రులందరూ. ఒకరొకరుగా వృక్షాలమీదికి ఎగబ్రాకి, పూవుల్ని కూడా వదిలిపెట్టకుండా నేల రాల్చటం ప్రారంభించారు.

మిగలపండి సువాసనలు వెదజల్లుతున్న ఫలాలతో కంటికి యింపుగా కనబడే ఆ తోట - క్షణాలమీద వట్టిపోయింది.

పెద్ద మారేడు చెట్టుమీదికి ఎక్కి, చిటారు కొమ్మల్లో వున్న మారేడు కాయల్ని విదిలిస్తున్నాడు మాధవుడు.



వీరవర్మ అనుచరులు కొంతమంది తోటవైపు రావటాన్ని గమనించి జర్రున క్రిందికి జారాడు.

అప్పటికే అక్కడి దమనకాండ వారి కళ్ళ పడింది.

'ఎవరది? ఎవర్రా చెట్లను నాశనం చేస్తోంది?' అని అరుస్తూ వేగంగా వచ్చారు తోటలోకి.

ఉరుతలకంటె వేగంగా క్రిందికి దూకారు మాధవుడి స్నేహితులు. కుందేళ్ళల్లా పోయి తోట అవరణను అధిగమించి మాయం అయిపోయారు—యిద్దరు తప్ప.

చెట్టుమీదినుంచి దూకటంతో కాలు మడతపడి బోర్లాపడిపోయాడొక బాలుడు. అవరణకేసి పోతున్న మాధవుడు అది గమనించి అతని దగ్గిరికి పరిగెత్తుకొచ్చాడు.

అతి సమీపంలోకి వచ్చేశారు వీరవర్మ అనుచరులు. 'పట్టుకోండి! వారిని పట్టుకోండి' అని అరుస్తూ వరలలో వున్న ఖడ్గాలను బయటికి లాగారు.

క్రిందపడిన స్నేహితుడికి చేతిని అందించి పైకి లేపాడు మాధవుడు. పారిపోయే అవకాశం చేజారిపోయింది. ఎంత వేగంగా పోయినా ఆవరణను దాటేలోపున పట్టుబడక తప్పదు.

బిత్తర చూపులు చూస్తున్న మిత్రున్ని అవరణ వైపు నెట్టి, క్రిందికి వంగివున్న చెట్టుకొమ్మ నొకదాన్ని మధ్యకు విరిచాడు మాధవుడు.

'నేను వీరిని ఆపుతాను. నువ్వు పారిపో' అని అతన్ని హెచ్చరిస్తూ, వీరవర్మ అనుచరులను ఎదుర్కున్నాడు చెట్టుకొమ్మతో.

దొమ్మరి నాగేశు నేర్పిన యుద్ధ విద్యలకు సార్థకత లభించింది ఆ క్షణంలో. కరవాలాలను పట్టుకొని ఎంతగా ప్రయత్నించినా, మాధవుడి చేతిలోని చెట్టుకొమ్మను ఎగర గొట్టలేకపోయారు వీరవర్మ అనుచరులు.

కంటికి కనిపించనంత వేగంగా కొమ్మను తిప్పుతూ, చల్లగా గోడలవైపు జరిగాడు మాధవుడు. ఉన్నట్టుండి కొమ్మను వారిమీదికి విసిరేసి, ఒక్క గంతులో గోడను అధిగమించాడు.

అతన్ని పట్టుకోవటానికి శక్తివంచన లేకుండా ప్రయత్నించారు వారు. ఫలితం లేకపోయింది. చుట్టుముట్టిన చీకట్లు మాధవుణ్ని తమలో దాచేసుకుంది. వారి ప్రయత్నాలకు విఘాతాలను కలిగించాయి.

*　　　*　　　*

మెుండి కైజారును గిరగిరా తిప్పుతూ, ఎదుట వున్న పూపొదను ఛిన్నాభిన్నం చేయటానికి ప్రయ్నత్నిస్తున్నాడు మాధవుడు.

అదే సమయంలో 'మాధవా! ఓ మాధవా!' అంటూ పెరటి తోటలోకి వచ్చింది అతని తల్లి.

'ఏం చేస్తున్నావురా? శరీరమంతా అలా స్వేదంతో నిండి వున్నదేమిటి ?' అతన్ని పట్టిపట్టి చూస్తూ ప్రశ్నించింది.

'పొదులు తవ్వుతున్నానమ్మా !' అన్నాడు మాధవుడు కైజారు ఆమె కళ్ళపడకుండా జాగ్రత్త పడుతూ.

'గొప్పపని చేస్తున్నావ్. పోయి తాతగారిని పిలుచుకురా. భోజన సమయం అవుతున్నది.'



అడ్డున్న పొదల మీదినుంచి చెంగున ఎగిరి ఆవతలకి దూకాడు మాధవుడు. అంత ఎత్తున్న ఆవరణను అవలీలగా అధిగమించి, ప్రక్క వీధిలోకి పరుగుతీశాడు.

క్రిందపడి కాళ్ళు చేతులు విరగగొట్టుకుంటాడేమో అన్న భయంతో విలవిలలాడి పోయింది అతని మాతృదేవి హృదయం.

"భగవంతుడా! తండ్రిపోలికల్ని పుణికి పుచ్చుకొని ఏపుగా ఎదుగుతున్నాడు నా చిట్టితండ్రి. మహావీరుడని పేరు తెచ్చుకోక పోయినా ఫరవాలేదు. కడుపులోని చల్ల కదలకుండా యింటిపట్టున హాయిగా జీవించేటట్లు దీవించు" మనసులో సర్వాంతర్యామిని ప్రార్థిస్తూ వెనుతిరిగిందామె.

*　　　*　　　*

రెండు వీధులను దాటి వేశ్యావాటికను సమీపించి ఆగి పోయాడు మాధవుడు.

వేశ్యావాటికలో బ్రాహ్మణులు అడుగు పెట్టరాదనే నిషేధం ఒకటి వున్నది. నిశీధి సమయాల్లో ఆ మాటకు అంతగా పట్టింపు లేకపోయినా, పగటి వేళల్లో మాత్రం మహా ఖచ్చితంగా పాటించబడుతుందది.

వేశ్యావాటికకు ఆవలి ప్రక్కన వుంది మహాభైరవాలయం. మాధవుడి తాత ఆ ఆలయాలకి ధర్మకర్త. పగటి సమయాలను అక్కడే గడుపుతూ వుంటాడాయన.

మరో రెండు వీధులను దాటి, అనవసరమైన శ్రమను పొందటం యిష్టంలేక, సూటిగానే పయనించాడు మాధవుడు.

పాతిక ధనువుల దూరం కూడా పోకముందే, ఒక సుందర గృహపు కవాటాలు తెరుచుకున్నాయి. 'మాధవా!

ఏమిటంత వేగంగా పరుగు తీస్తున్నావ్? శత్రుసేనలు మన పట్టణాన్ని ముట్టడిస్తున్నాయా?' అంటూ బయటికి వచ్చిందొక స్త్రీమూర్తి.

పరుగు ఆపి ఆమె వంక చూశాడు మాధవుడు.

'లోపలికి వచ్చి పోరాదా?' ఆహ్వానించిందామె.

'తాతగారిని పిలుచుకురావటానికి పోతున్నాను. భోజన సమయం మీరిపోతోంది' అన్నాడు మాధవుడు.

'భైరవాలయంలో యీరోజు పులికాపు నడుస్తోంది. సూర్యుడు పడమటి దిశకు మరలేదాకా మీ తాత నీతో మాట్లాడను కూడా మాట్లాడడు. నీకు యిష్టమైన అతిరసాలు చేశాను. కొంచెం రుచిచూసి పోదువుగాని రావయ్యా!' అన్నదామె.

అతిరసాల పేరు వినగానే మాధవుడి నోరు వూరింది. మరి బెట్టు చేయకుండా గడప ఎక్కి లోపలకు వెళ్ళాడు.

చందనపు పీటవేసి కూర్చోపెట్టిందామె. బంగారు పళ్ళెరం నిండా అతిరసాలను పేర్చి ముందుంచింది. వట్టివ్రేళ్ళతో చేసిన వింజామరను తీసుకొని అతని ప్రక్కనే ఆసీనురాలైంది.

వంచిన తలను ఎత్తకుండా అతిరసాల అంతు చూడటం ప్రారంభించాడు మాధవుడు.

'మాధవా! ఒకమాట అడుగుతాను. జవాబు యిస్తావా?' వింజామరతో విసురుతూ అడిగిందామె.

వెండి చెంబులోని నీటిని నోటిలోకి వంపుకుంటూ తల వూపాడు మాధవుడు.



'నీతోటి బాలురనందర్నీ కొట్టి నానా గోల చేస్తున్నావుట! నిజమేనా?'

'నా తండ్రిని అనరాని మాటలు అంటుంటే కొట్టక ఏం చేయమంటావ్? ముద్దుపెట్టుకోవాలా?'

చిరు దరహాస రేఖ ఒకటి ఆ స్త్రీమూర్తి వదనాన్ని మరింత సుందరంగా మార్చింది.

'మాధవా! రేపు మా కులదేవతకు అర్చన చేయిస్తున్నాను. వస్తావా?' పమిటి చెంగుతో అతని హస్తాలను తుడుస్తూ అడిగిందామె.

తటపటాయించాడు మాధవుడు. తిరిగి ఏమనుకున్నాడో ఏమో-తలవూపి బయటికి పరుగుతీశాడు.

అతను వీధి చివరికి పోయి, అదృశ్యం అయ్యేదాకా అలాగే చూస్తూ నిలబడిపోయిందా స్త్రీమూర్తి.

* * *

పూజలు పూర్తి అయినట్లున్నాయి-మాధవుడు అడుగు పెట్టేసరికి నిర్మానుష్యంగా వుంది భైరవాలయం. ఆలయ మంటపంలో కూర్చునివున్నాడు అతని తాత. ఆయన ప్రక్కనే నిలబడివున్న వినుత శర్మను చూడగానే-మాధవుడి అడుగుల వేగం మందగించింది.

పుల్లలు పెట్టటంలో మెలితిరిగిన చేయి ఆ వినుత శర్మది. అక్కడి వార్తలు యిక్కడికి, యిక్కడి వార్తలు అక్కడికి చేరవేయటంలో అతన్ని మించినవారు మరెవ్వరూ లేరు.

మాధవుడు భయపడినంతా జరిగింది. అతన్ని చూడగానే, 'రేయ్! వేశ్యా వాటికలోకి వెళ్ళవలసిన అవసరం నీకేం వచ్చిందిరా?' అని అడగనే అడిగాడు తాత.

'ఎవరు చెప్పారు?'

'ఎవరో చెప్పటం దేనికి? నేను కళ్ళారా చూశాను నువ్వు ఆ రంకులాడి వందన ఇంట్లోకి వెళ్ళలా?' వ్యంగ్యంగా అన్నాడు వినుత శర్మ.

'మర్యాదగా మాట్లాడటం నేర్చుకోండి. వందన యింట్లో వున్న చందనపు పీట విలువ చేయరు మీరు. అర్ధరాత్రిళ్ళు దొంగదారులవెంట జలజాక్షి మేడలో దూరే మీకు, మరొకరి అభిమానాన్ని గురించి ప్రసంగించే హక్కు లేదు. పిడికిళ్ళు బిగిస్తూ కోపంగా అన్నాడు మాధవుడు.

'చూశారా ! చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా ఎలా మాట్లాడుతున్నాడో! మీ మనవడు చెడిపోతున్నాడు. మీరు చూస్తూవుంటే యింకా చెడిపోతాడు. కావాల్సినవారు కాబట్టి యింతగా చెప్తున్నాను.. వస్తా. నాకు అవతల బోలెడు పనులున్నాయి.' జలజాక్షి పేరు వినగానే హడావుడిగా అవతలకు జారుకున్నాడు వినుత శర్మ.

'మాధవా! నీ నోటిని కొంచెం అదుపులో వుంచుకోవటం చాలా మంచిది' అంటూ లేచి నిలబడ్డాడు మాధవుడి తాత. ఆయన బుర్రమీసాల వెనుక సన్నటి చిరునవ్వు ఒకటి దాగుడుమూతలు ఆడుతూ వుండటాన్ని గమనించాడు మాధవుడు.

వందన యింటికి వెళ్ళినందుకు చివాట్లు తినవలసి వస్తుందని ఎదురు చూస్తున్నాడు మాధవుడు. ఆయన తిరిగి ఆ ప్రశ్నని ఎత్తకపోవటం అతనికి విపరీతమైన ఆశ్చర్యాన్ని కలుగచేసింది.

* * *



చదివిన శ్లోకాన్నే మరల చదువుతూ, చూసిన తాళపత్రాన్నే తిరిగిచూస్తూ, ముందు భాగంలో కూర్చునివున్న తాతగారిని ఓరగంట గమనిస్తున్నాడు మాధవుడు.

'మాధవా! చదివింది చాలుగాని, భోజనానికి దారా' అంటూ వినిపించింది మాతృదేవి పిలుపు.

''ఆకలి లేదమ్మా! కొంచెం ఆగి వస్తాను' అని సమాధానం యిచ్చి తాళపత్రాలమీద దృష్టిని లగ్నం చేశాడు మాధవుడు.

ఉన్నట్లుండి లేచి నిలబడ్డాడు మాధవుడి తాత. 'నేను ఆలయం దాకా పోయివస్తా. అమ్మతో చెప్పరా!' అంటూ పాదరక్షలను ధరించి వీధిలోకి వెళ్ళిపోయాడు.

చెంగున లేచాడు మాధవుడు. తాళ పత్రాలను కట్టకట్టి ఒక గూటిలోకి విసిరేశాడు. పిల్లిలా అడుగులు వేస్తూపోయి ముఖద్వారాలను బంధించాడు.

'మాధవా ! ఓ మాధవా !' ఎందుకో పిలిచింది అతని తల్లి.

సమాధానం యివ్వకుండా పెరటిలోకి పరిగెత్తాడు మాధవుడు. ఆవరణను దాటి వేశ్యావాటికవైపు అడుగులు వేశాడు.

* * *

వందన యింటిముందు నిలబడివున్న సైనికులను చూసేసరికి, వాటంతట అవే ఆగిపోయాయి మాధవుడి పాదాలు.

నిలువెత్తున్న జాతిగుర్రాలను పట్టుకొని నిలబడివున్నారా

సైనికులు. తమ యావలో తాముండి అతన్ని గురించి పట్టించుకోనేలేదు.

గడపదాటి లోపలకు పోయాడు మాధవుడు.

బంగారు దారాలతో అల్లిక పనులు చేయబడిన పట్టుతెర ఒకటి లోపలి ద్వారానికి అడ్డుగా వ్రేలాడుతున్నది. దాని వెనుకనుంచి వినవస్తోంది ఒక పురుష కంఠం.

"....ధనకనక వస్తువాహనాలు యిస్తాను. రాజమందిరాల్లో రాణీవాసభోగాలు అనుభవిద్దువుగాని వందనా! నా మాటను మన్నించి, నా కోరిక తీర్చు."

గిరుక్కున వెనుతిరిగాడు మాధవుడు. రాకూడని సమయంలో తను అక్కడికి వచ్చినట్లు గ్రహించటానికి అతనికి ఎంతో వ్యవధి అవసరం లేకపోయింది. రెండు అడుగులు కూడా వేయకముందే గంభీరంగా వినవచ్చింది వందన కంఠం.

"నా తనువు, మనస్సు రెంటినీ కలిపి ఏనాడో అర్పణ చేశాను ఒక మహావీరుడికి. ఆయన నీడతప్ప, మరొకరి ఛాయకూడా నా మందిర ద్వారాలను సోకటానికి వీలులేదు. దయచేసి వెళ్ళిపోండి."

'ఎవరా మహా....వీరుడు ...' కర్కశంగా వినవచ్చింది పురుష కంఠం.

"మాళవ మాగధుల దండయాత్రలను మూడుసార్లు త్రిప్పికొట్టిన వీరాధివీరుడు; శత్రువుల చేతికి చిక్కిన కాంచన చక్రవర్తిని ఒంటరిగాపోయి విడిపించుకు వచ్చిన సాహసమూర్తి కార్తికేయుడే నా ఆరాధ్యదైవం."



"అహ్హహ! ఎప్పుడో పది వసంతాలక్రితం దేశాలు పట్టుకుపోయిన కార్తికేయుణ్ణి నమ్ముకొని నీ పరువాన్ని వ్యర్థపరుచుకుంటున్నావా !! అతను యిక తిరిగి రాడు."

"వచ్చినా రాకపోయినా నాదైవం ఆయనే. మీరిక దయచేయవచ్చు."

"అఁయ్! రాజప్రతినిధినన్న మాట మరిచిపోయి ఇంత హీనంగా మాటాడతావా! నిన్నిప్పుడు బలవంతంగా అనుభవిస్తే నన్ను అడ్డుకునేది ఎవరు ?"

"భగవంతుడు. నా ప్రభువు కార్తికేయుడు ఉపాసించే మహాభైరవుడు నాకు రక్షణ కల్పించి తీరతాడు."

"చూస్తాను! నిన్ను యిప్పుడు ఏ మహాభైరవుడు రక్షిస్తాడో చూస్తాను" వికృతంగా నవ్విందా పురుషకంఠం.

కెవ్వున అరిచింది వందన, 'దుర్మార్గుడా! వదులు.... నన్ను వదులు' అంటూ.

తెరముందు నిలబడివున్న మాధవుడు వుద్విగ్నుడై వందన యింటికి వచ్చినందుకు తన తాతగారు ఏమీ అనకపోవటానికి కారణం యిదన్నమాట! తనను చూసినప్పుడల్లా పిలిచి, ముద్దుచేసే వందన తనకు మాతృసమానురాలు!!

ఆపైన ఆగలేకపోయాడు మాధవుడు. పట్టుతెరను ప్రక్కకు తొలగించి అభ్యంతర మందిరంలోనికి దుమికాడు.

'ఏది నీ మహాభైరవుడు! ఇంకా రాలేదే ?' అంటూ వందన చీరె చెంగును పట్టుకొని గుంజుతున్న రాజప్రతినిధి బుద్బుదరాయుడు-అతన్ని చూడగానే అదిరిపడి ఒరలోవున్న ఖడ్గంమీద చెయ్యివేశాడు.

ఆగ్రహావేశాంతో అవయవాలన్నీ కంపిస్తుండగా, కుప్పించి గాలిలోకి ఎగిరాడు మాధవుడు.

'ఎవరక్కడ! వీడిని బంధించండి!! నరికి ముక్కలు చేయండి' బిగ్గరగా అరిచాడు బుద్బుదరాయుడు. అరుపు అతని నోటినుంచి వెలువడుతున్న క్షణంలోనే పోయి నోటిమీద తగిలాయి మాధవుడి పాదాలు.

బాధతో మెలికలు తిరుగుతూ నేల కూలిపోయాడు బుద్బుదరాయుడు. వ్రేలెడంతకూడా లేని ఒక పసివాడి చేతిలో అలా దెబ్బతినటం తలుచుకున్నకొద్దీ అతని కోపానికి హద్దులేకుండా పోతోంది. కోపం హద్దులుమీరిన కొద్దీ అతని అవయవాలు విపరీతంగా కంపించటం ప్రారంభించాయి. పుట్టలోనుంచి వెలువడిన కోడెనాగులా కంటికి కనిపించనంత వేగంగా తిరుగుతూ, అతని ఒరలోని ఖడ్గాన్ని అవతలకు ఎగరగొట్టాడు మాధవుడు. ఉన్నట్లుండి ఎగిరి అతని రొమ్ములమీదికి దుమికాడు. మోకాళ్ళతో అతన్ని కదలకుండా నొక్కిపట్టి, దుస్తులచాటున వున్న తన మొండి కైజారును తీసి, గాలిలోకి ఎత్తాడు.

చటుక్కున ముందుకు వచ్చి అతని చేతిని పట్టుకుంది వందన. 'మాధవా! వద్దునాయనా!! ఈ నికృష్టుడి రక్తంతో నీ బంగారు చేతుల్ని మలినపరుచుకోవద్దు' అని బలవంతంగా కైజారును వశపరుచుకుంది.

ఆమె మృదుస్వరం మాధవుడి ఆవేశాన్ని అణిచివేసింది. బుద్బుదరాయుడి గుండెలమీది నుంచి లేచి యివతలకు వచ్చాడు.



'మహాభైరవుడు ఏదని ప్రశ్నించారుకదూ! బాగా చూడండి!! ఇకనైనా బుద్ధి తెచ్చుకొని గౌరవంగా మసలుకోండి....బుద్బుదరాయుడి ఖడ్గాన్ని అందుకొని అతని మీదికే విసిరేస్తూ అన్నది వందన.

అవమానంతో వికృత రూపాన్ని దాల్చింది అతని వదనం. "వందనా! అప్పుడే ఏమయింది? ముందుంది ముసళ్ళపండుగ. ఈ బుద్బుదరాయుడి ఆగ్రహం ఎలా వుంటుందో అతి త్వరలోనే రుచి చూడబోతున్నావ్.. " అంటూ లేచి బయటికి వెళ్ళిపోయాడు.

అతని మాటను విని ముందుకు దుముకబోయిన మాధవుణ్ని కదలకుండా పట్టుకొంది వందన.

'వాడి నాలుక చీలుస్తాను.. నన్ను వదులమ్మా!' ఆమె చేతుల్ని వదిలించుకోవటానికి విఫల ప్రయత్నం చేస్తూ అన్నాడు మాధవుడు.

అప్రయత్నంగా అతని నోటివెంట వెలువడిన ఆ పిలుపు వందన శరీరాన్ని పులకరింపచేసింది. ఆనందబాష్పాలు ఆమె కపోలాలను తడపటం ప్రారంభించాయి.

'ఏదీ మాధవా! ఇంకొక్కసారి అమ్మా అని పిలువ్ తండ్రీ!' అంటూ అతన్ని అక్కున చేర్చుకొని పరవశించిపోయిందామె.

* * *

"వందన కార్తికేయుడి ప్రియురాలని తెలిసిన మరుక్షణం వెనుతిరిగి రావాల్సింది. ఇప్పుడు ఈ వ్యవహారం బయటికి పొక్కితే ఏమౌతుందో ఆలోచించారా?" చేతులు వెనక్కి

కట్టుకొని అసహనంగా పచార్లు చేస్తున్న బుద్ధదరాయణ్ణి చూస్తూ అన్నాడు కోశాధికారి వీరవర్మ.

వందన అందం నన్ను పిచ్చివాణ్ణి చేసింది వీరవర్మా! నా చేతులు నాకే అర్థంకాకుండా పోయాయి. ఆ అచ్ఛకుడు వచ్చి అడ్డుపడ్డాడు. లేకుంటే వందన నా సొంతం అయి వుండేది యీపాటికి' అన్నాడు బుద్ధదరాయుడు.

"కాంచన చక్రవర్తికి కార్తికేయుడిమీద విపరీతమైన అభిమానం వుంది. అతని ప్రియురాలిని మీరు యిలా అవమాన పరిచారని ఆయన చెవికి చేరిన మరుక్షణం—"

'చాలు వీరవర్మా! ఇక చాలు.' బిగ్గరిగా అరిచాడు బుద్ధదరాయుడు.

"నానోరు మూయించగలరు కాని లోకుల నోళ్ళు బంధించగలరా! వెంటనే ఏదో ఒక విరుగుడు వేయటానికి ప్రయత్నించండి. లేకుంటే మీ మనుగడకే ముప్పు వాటిల్లుతుంది...." అంటూ లేచి నిలబడ్డాడు వీరవర్మ.

అదేసమయంలో ఆ మందిరంలోకి వచ్చాడొక సైనికుడు.

'ప్రభూ! ఆ వందన—' అనబోయి వీరవర్మను చూసి ఆగిపోయాడు.

'పరేం పరవాలేదు....చెప్పు....' అనుజ్ఞ యిచ్చాడు బుద్ధదరాయుడు.

వందన పట్టణం విడిచి వెళ్ళిపోతోంది. బంధువుల యింటికి వెళ్ళివస్తానని చెప్పిందట తనతోటి వారాంగనలతో.'

అతన్ని వెళ్ళిపొమ్మని సైగచేసి అయోమయంగా వీరవర్మ వైపు చూశాడు బుద్ధదరాయుడు.



చక్రవర్తి వద్ద అభియోగాన్ని తీసుకురావడానికి పోతున్నదా!!

నామాట వినటానికి అంటే—'యీ ముప్పు తప్పిపోవటానికి మార్గం చెపుతాను' సాలోచనగా అన్నాడు వీరవర్మ.

'వీరా! ఒకటికాదు వందమాటలైనా సరే పెదవి కదలించకుండా వింటాను. ముందు యీ ప్రమాదం నా తలను చుత్తరించకుండా వుంటే చాలు. ఏమిటది? చెప్పు....' తొందర చేశాడు బుద్ధదరాయుడు.

అతన్ని దగ్గరికి పిలిచి చెవిలో ఏదో చెప్పాడు వీరవర్మ!

బుద్ధదరాయుడి ముఖం వికసించింది. 'శహభాష్ వీరా. ఒకే దెబ్బకు రెండు పిట్టలు!! మన పథకం ఫలించిన మరుక్షణం నువ్వు యీ ప్రకీర్తి పట్టణ రాజప్రతినిధికి అమాత్యుడిగా నియమించబడతావ్' అన్నాడు వీరవర్మ భుజంచరుస్తూ.

ఉబ్బి తబ్బిబ్బైతూ తన మందిరానికి బయలుదేరాడు వీరవర్మ.

* * *

'లేదు మాధవా! నేను కొంతకాలంపాటు దూరంగానే వుండటం మంచిది' మాధవుడి మాటలకు అడ్డువస్తూ అన్నది వందన.

'ఎందుకు దూరంగా వుండాలి? బుద్ధదరాయుడికి భయపడాల్సిన అవసరం ఏముంది? తాతగారితో చెపితే అతని అంతు చూస్తారు.' ఆవేశంగా అన్నాడు మాధవుడు.

ముఖంమీదికి వాలుతున్న అతని ముంగురులను వెనక్కు తోసి, నుదుటిని చుంబించింది వందన. 'పిచ్చి మాధవా! నీ తండ్రికి నేను ప్రియురాలినని బహు కొద్దిమందికే తెలుసు.

మీ తండ్రిలేని యీ తరుణంలో నా విషయం వెల్లడి అయితే మీ కుటుంబ గౌరవం రచ్చకెక్కుతుంది. బుద్భదరాయుడు కట్లపామువంటి వ్యక్తి. ఎదుటపడి కక్ష తీర్చుకోవటం అతనికి చేతకాదు. అతను వక్రమార్గాలను అవలంబించి నా మూలకంగా నీకు, మీ కుటుంబానికి కష్టాలను కల్పించ గలడు. పసివాడవి! నీ పసిజీవితం యిప్పుడప్పుడే కష్టాలను చవిచూడకూడదు. నువ్వు పెద్దవాడివై తండ్రిని మించిన తనయుడవని పేరు తెచ్చుకొని, యీ ప్రపంచమంతా నీకు జయజయధ్వానాలు చేస్తున్న రోజున నేనే నీ పంచకువచ్చి నిలబడతాను. నీ పరాక్రమ గాథల్ని వింటూ నా శేష జీవితాన్ని ఆనందంగా గడిపేస్తాను' తల నిమురుతూ అన్నది గద్గదస్వరంతో.

ఏదో చెప్పాలని ప్రయత్నించాడు మాధవుడు-మాటలు రాలేదు.

'పొద్దు పడమరకు తిరుగుతున్నది. ఇక యింటికిపో మాధవా!' అంటూ శకట సారధికి సైగ చేసింది వందన.

కాళ్ళకు కట్టిన చిరు గంటల్ని గిలగిలలాడిస్తూ శకటాన్ని ముందుకు లాగాయి వృషభాలు.

చెమ్మగిల్లిన కళ్ళను పమిటె చెంగుతో వత్తుకుంటూ చేయి వూపింది వందన.

శిలా విగ్రహంలా నిలబడిపోయిన మాధవుడిలో చలనం వచ్చింది. శకటం కనుచూపు మేరను దాటిపోయేవరకూ హస్తాన్ని గాలిలో ఆడిస్తూ అలాగే నిలబడిపోయాడు.

* * *

'రావయ్యా మాధవా! నీకోసమే ఎదురుచూస్తున్నాను. మీ తాతగారు యిప్పుడే యింటికి వెళ్ళిపోయారు.' ఆలయ ద్వారంలో మాధవుణ్ని చూడగానే పాచికలపెట్టెను పట్టుకొని ఎదురువచ్చాడు భైరవాలయ పూజారి.



తీరిక సమయాల్లో మాధవుడితో పాచికలాడటం అతనికి అలవాటు. అన్యమనస్కంగా పాచికలను అందుకున్నాడు మాధవుడు.

పందెంమీద పందెం వేసి మహాదురుసుగా పావుల్ని కదిలించే మాధవుడు ఆ రోజు పరాకుగా వుండటాన్ని క్షణాలమీద పసికట్టేశాడు ఆలయ పూజారి.

"మాధవా! ఆలోచనలతో మనసును పాడుచేసుకునే వయస్సు నీకింకా రాలేదు. నీ సమస్య ఏమిటో నాకుచెప్పు.. రెండు క్షణాలలో పరిష్కరించేస్తాను" అతని భుజంమీద చెయ్యివేస్తూ సాదరంగా అన్నాడు.

ఒకటొకటిగా జరిగిన సంఘటనలన్నీ అతనికి వివరించాడు మాధవుడు.

అరుణకాంతుల్ని పులుముకున్నాయి-ఆలయ పూజారి నేత్రాలు.

"కార్తికేయులవారి ప్రియురాలమీదే చెయ్యి వేస్తాడా? ఈ బుద్బరాయుడికి అంత ధైర్యం వచ్చిందా? హరహర మహాభైరవ! శంభోశంకర!!" అని గర్జిస్తూ చెంగున లేచి ఆలయపు ముందు భాగంలో పాతివున్న త్రిశూలాన్ని పైకి లాగి పట్టుకున్నాడు.

ఎప్పుడు చూసినా చిరునవ్వులు చిందిస్తూ వుండే పూజారిలో వచ్చిన ఆ మార్పును చూసి బిత్తరపోయాడు మాధవుడు.

"మాధవా! నువ్వుపోయి మీ తాతగారిని పిలుచుకురా! ఈరోజుతో బుద్ధుదరాయుడి జీవితం జల బుద్బుదప్రాయం కావాల్సిందే...." అంటూ ఆలయ సింహద్వారంవైపు పరుగు తీశాడు పూజారి.

అదే సమయంలో ఆవరణ మీదినుంచి ఆలయంలోకి దూకారు పదిమంది దృఢకాయులు. కుబుసాలు విడిచిన తాచుపాముల్లా మిలమిల మెరిసిపోతున్నాయి వారి చేతుల్లోని కరవాలాలు.

"ఆలయద్వారాలు బంధించండి! ముందు ఆ పూజారిని వధించండి!!" కఠిన కంఠంతో ఆజ్ఞ యిచ్చాడొక దృఢకాయుడు.

త్రిశూలాన్ని పైకి ఎత్తి దిక్కులు దద్దరిల్లేలా సింహనాదం చేశాడు పూజారి.

"ఇంత కాలానికి నీకు రక్తంమీద మనసయిందా మహాభైరవా! కార్తికేయుల వారి అంతర్ధానంతో నిస్తేజమైపోయిన నా వీరత్వానికి పరీక్ష యిప్పుడు పెట్టాలని అనిపించిందా?" అని అరుస్తూ ఆ వ్యక్తులమీద కలబడ్డాడు.

త్రిశూలాన్ని గిరగిరా తిప్పుతూ....వున్నట్టుండి పొడిచేశాడు యిద్దరిని. మూడవ వ్యక్తి ముఖంమీద విభూది రేఖల్లా ప్రత్యక్షమయ్యాయి మూడుగాట్లు.

ఆ దృశ్యాన్ని చూసిన మరుక్షణం మాధవుడి రక్తం వేడి ఎక్కింది. సింహకిశోరంలా దాట్లు కొడుతూపోయి, ఆ దొమ్మిలో పాలు పంచుకున్నాడు.

మరో యిద్దర్ని మట్టి తినిపించాడు పూజారి. ఇంకో దృఢకాయుడి గుండెలమీద శక్తినంతా ప్రయోగించి



దించాడు త్రిశూలాన్ని. కండలను చీల్చుకుంటూపోయి, ఆ వ్యక్తి వెన్నుమీద ప్రత్యక్షమైనాయి దాని మొనలు.

అదే సమయంలో అతని తలమీద పడింది బలమైన దెబ్బ ఒకటి. పూజారి కళ్ళముందు నీలిరంగు మెరుపులు మెరిశాయి.

"హరహర మహాభైరవ! హరహర మహాభైరవ!!" అంటూ మొదలు నరికిన చెట్టులా నేల కూలిపోయాడు.

వెంటనే అతని గుండెలమీద కాలువేసి శిరస్సును ఛేదించటానికి ప్రయత్నించాడొక దృఢకాయుడు. అది గమనించి చెంగున అతనిమీదికి దూకాడు మాధవుడు.

బాధగా మూలుగుతూ నేలకు జారిపోయాడా దృఢకాయుడు. అతని కరవాలాన్ని వూడలాక్కుని మిగిలినవారివైపు తిరిగాడు మాధవుడు.

"చూస్తారేం! ఈ చేపపిల్లను పట్టుకోవటానికి యింతసేపా!!" అరిచాడొక వ్యక్తి.

ఉన్నట్టుండి వచ్చి మాధవుడిమీద పడింది ఒక మందపాటి శాలువా. ఉక్కిరిబిక్కిరై ముందుకు తూలాడు మాధవుడు. అంతలోనే శిరస్సుమీద పడింది ఒక ముష్టిఘాతం. కళ్ళుమూతలు పడగా పూజారి ప్రక్కనే వాలిపోయాడు....

"క్షణంలో ముగిసిపోవాల్సిన పనికి యింతసేపు పట్టింది! పూజారిపిశాచి చేతిలో నలుగురు హతం కావాల్సి వచ్చింది!! మిగిలిన పనినైనా త్వరగా పూర్తి చేయండి....చూస్తారేం, కదలండి!!" క్రింద పడివున్న పూజారిని పాద ప్రహారానికి గురిచేస్తూ ఆజ్ఞ యిచ్చాడు ఒక దృఢకాయుడు.

పెద్దపెద్ద అంగలతో గర్భగుడిలోకి పోయారు యిద్దరు ధృఢకాయులు. వజ్రకవచంతో, నవరత్న ఖచితమైన ఆభరణాలతో దగద్ధగాయమానంగా ప్రకాశిస్తోంది మహాభైరవుడి విగ్రహం.

తలపాగాను వూడ తీసి నేలమీద పరిచాడొక వ్యక్తి. మహాభైరవుడి ఆభరణాలన్నిటినీ వలిచి అందులో మూట కట్టాడు మరొకడు.

వారిద్దరూ ఆలయ ప్రాంగణంలోకి వచ్చేసరికి పూజారిని, మాధవుణ్ణి కాళ్ళుచేతులు బంధించి, శాలువామీద పడుకోబెడుతున్నారు వారి సహచరులు.

"అశ్వాలను సిద్ధం చేయండి! యిక యిక్కడ తామసించగూడదు...." ఆజ్ఞ యిచ్చాడు వారి నాయకుడు.

ఆలయ ప్రాంగణానికి వెనుక భాగంలోవున్న ద్వారాన్ని తెరచి బయటికి పరుగుతీశారు యిద్దరు వ్యక్తులు. రెండు నిముషాలలో అశ్వాలను పూన్చిన శకటం ఒకటి సిద్ధం అయింది.

మాధవుడిని పూజారిని శాలువాలో మూటకట్టి ఆ శకటం మీదికి చేర్చారు. నగల మూటను పట్టుకొని ముందు కూర్చున్నాడు దృఢకాయుల నాయకుడు. మిగిలిన వారు వెనుక వస్తుండగా, ముందుకు కదిలింది శకటం. చీకట్లు దట్టమయ్యేసరికి, పట్టణపు సరిహద్దులను దాటి, పొలిమేరలను ఆనుకొని వున్న చిట్టడవిలో ప్రవేశించింది.

* * *

'ఏమిటీ! నా మనవడు మహాభైరవుడి ఆభరణాలను దొంగిలించాడా? బుద్భదరాయా? వళ్ళుతెలిసే మాటాడు



తున్నావా?" ఆగ్రహావేశాలతో కంపించిపోతూ పెద్దపులిలా గర్జించాడు మాధవుడి తాతగారు.

"ఆలయంలోకి పోయి జరిగిన ఘోరాన్ని చూడండి. నిప్పులాంటి మీ కుటుంబంమీద అభాండాలను వేయటం నాకు యిష్టంలేదు. కాని కనిపిస్తున్న ఆధారాలు—అలా కాదని అనుకునేటందుకు వీలులేకుండా చేస్తున్నాయి' గంభీరంగా అన్నాడు బుద్భదరాయుడు.

ఛివాలున లేచి, భుజంమీద వుత్తరీయం లేదన్న సంగతిని కూడా పట్టించుకోకుండా భైరవాలయం దగ్గిరికి వెళ్ళాడు మాధవుడి తాత. రక్తపు మడుగులో తేలుతున్న శరీరాలను, ఆభరణాలను కోల్పోయిన మహాభైరవుడి విగ్రహాన్ని చూడగానే వికలమైపోయింది ఆయన మనస్సు.

అప్పటికే ప్రకీర్తి పట్టణమంతా ప్రాకిపోయిందా వార్త.

కార్తికేయులవారి పుత్రుడు మాధవుడు - పూజారిని మచ్చిక చేసుకొని మహాభైరవుడి ఆలయాన్ని కొల్లగొట్టాడు!! అడ్డుపడిన వీరవర్మ అనుచరులను హతమార్చి పారిపోయాడట!!!

'మాళవుల మీద ఘన విజయాన్ని సాధించిన సంతోషంలో - మాధవుడి తండ్రి మహాభైరవుడికి చేయించిన నగలవి. తండ్రి యిచ్చిన సొమ్మును కుమారుడు దొంగిలిస్తాడా? నా మనవడికి ఏం తక్కువయిందని దొంగతనాలకు పాల్పడాలి?' కండిస్తున్న కంఠంతో అడిగాడు మాధవుడి తాత.'

'మధువు, మదపతుల సహవాసం చేసినవారికి మంచీ చెడుల విచక్షణ నశిస్తుంది. మీ మాధవుడు యీమధ్య

ఆ రంకులాడి వందన యింటికి పోతున్నాడట!' అన్నాడు వీరవర్మ.

'వీరవర్మా!' ఆవేశం అదుపు తప్పగా ఆలయప్రాకారాలు దద్దరిల్లేటట్లు గర్జించాడు మాధవుడి తాత.' ఇంకొక్క వార్త నీ నోటివెంట వెలువడితే నాలుక తెగి నేల వాలుతుంది జాగ్రత్త. వందన మాధవుడికి మాతృసమానురాలు....'

హ్హ హ్హ హ్హ....మానాన్ని అమ్ముకుని బ్రతికే వెళియాలికి వావి వరుసల పట్టింపా? మీరు వట్టి అమాయకులు....ఇది ఆ వందన మూలంగా జరిగిన పనే. మాధవుడిని తెచ్చగొట్టి యిలా చేయించింది. గుట్టు చప్పుడు కాకుండా పట్టణాన్ని విడిచి వెళ్ళిపోయింది....' వ్యగ్యంగా అన్నాడు వీరవర్మ.

'మహాభైరవుడికి అపచారం చేసినవారిని సజీవంగా చిత్రవధ చేయాలి. ఉప్పుపాత్రలో పూర వేయాలి....చూడండిరా ఆ కార్తికేయులవారి పుత్రుడు ఎక్కడున్నాడో! వాడితో పాటు ఆ పూజారి పిశాచిని కూడా పట్టుకోండి....' ఆకాశం బ్రద్దలయ్యేటట్లు వినిపిస్తున్నాయి అరుపులు.

అలయంముందు గుమికూడిన ప్రజలు ఆగ్రహావేశాలతో కంపించిపోతున్నారు. ఆవరణను దాటి లోపలికి రావటానికి ప్రయత్నిస్తున్నారు.

అదే సమయంలో అక్కడికి వచ్చాడు ప్రకీర్తిపట్టణ న్యాయాధికారి.

'విచారణచేసి దోషులకు తగినశిక్ష విధిస్తాం. దయచేసి వెళ్ళిపొండి. మా విధులను మేము ప్రశాంతంగా నిర్వర్తించే అవకాశం కల్పించండి' చేతులు జోడించి ప్రజలను వేడుకున్నాడు.



"చేసే విచారణ ఏదో మాముందే చేయండి" ఆకాశం బ్రద్దలయ్యేలా అరిచారు వారందరూ-

ఆలయద్వారాలను తెరిపించి బుద్ధుదరాయుడినీ, వీరవర్మను ముందుకు రమ్మనమని సైగచేశాడు న్యాయాధికారి. త్రిశూలపు మొనలు తగిలి గాయపడిన వీరవర్మ అనుచరుడిని ప్రశ్నించి జరిగినదంతా విన్నాడు.

'వందన యింటికి తరుచుగా పోతున్నాడు మాధవుడు. ఆ విషయాన్ని అతని తాతగారికి చెపితే నవ్వి పూరుకున్నాడాయన....' అంటూ సాక్ష్యం యిచ్చాడు వినుతశర్మ.

'నా అనుచరులు వందన యింటిని పరిశీలించి వచ్చారు. ఈ రోజు మధ్యాహ్న సమయంలో పట్టణం వదిలి వెళ్ళిపోయిందామె. మాధవుడు ఆమెను అనుసరించి పొలిమేరల దాకా వెళ్ళాట్ట' అని చెప్పాడు వీరవర్మ.

సమావేశమైన పురప్రముఖులవంక చూశాడు న్యాయాధికారి.

'మాధవ, వందనలను, పూజారిని బంధించి తీసుకురావటానికి సైనికులను పంపించండి. జరిగినదంతా వెంటనే చక్రవర్తికి తెలియ చేయండి. ఈ క్షణంనుంచీ కార్తికేయుడి కుటుంబం మహాభైరవాలయపు గాలిగోపురాన్ని కూడా చూడటానికి వీలులేదు. మూడు పున్నమిలలోగా మహాభైరవుడి ఆభరణాలు మనకు లభించకపోతే వీరి ఆస్తిపాస్తులను వేలంవేసి క్రొత్త నగలను చేయించాలి..." ఏకగ్రీవంగా తీర్మానించారు వారందరూ.

గాఢంగా నిట్టూర్చి మాధవుడి తాతగారి వైపు చూశాడు న్యాయాధికారి.

నిద్రలో అడుగులు వేస్తున్నట్లు నిర్జీవంగా లేచి-ఆలయ ద్వారాన్ని అధిగమిస్తున్నాడాయన. గుంపుగా నిలబడిన పౌరులవంక చూడకుండా తలవంచుకొని తన యింటివైపు వెళ్ళిపోయాడు.

*   *   *

"భేష్ వీరవర్మా! నీ తెలివితేటల ముందు దేవ గురువు బృహస్పతి కూడా తలవంచ వలసిందే!" వీరవర్మ భుజం మీద చరుస్తూ ఆనందంగా అన్నాడు బుద్ధదరాయుడు.

కోరమీసాలు మెలివేస్తూ వంకరగా నవ్వాడు వీరవర్మ.

"పట్టణ పరిపాలనలో తోడుపడేటందుకు ఒక అమాత్యుడు కావాలని చక్రవర్తికి లేఖ వ్రాశాను. జవాబు రాగానే ప్రకీర్తి పట్టణానికి నీవు అమాత్యుడివి' అన్నాడు బుద్ధదరాయుడు.

'మరి నాకు సెలవు యిప్పించండి.' పూర్తిచేయవలసిన కార్యాలు యింకా కొన్ని మిగిలేవున్నాయి' అంటూ అశ్వాన్ని అధివశించి తన మందిరానికి తిరిగివచ్చాడు వీరవర్మ.

మందిరం ముందు భాగంలో అతనికోసం ఎదురుచూస్తున్నారు ముగ్గురు దృఢకాయులు. వారిలో ఒకణ్ని పిలిచాడు వీరవర్మ.

'దొరా చిట్టడవిలో దాగివుంది శకటం. ఇకముందు చేయాల్సిన కార్యమేమిటో తెలుసుకు రమ్మనమని శంభుడు నన్ను పంపించాడు' వినయంగా నమస్కరిస్తూ వెల్లడించాడు వ్యక్తి.

'మాధవ పూజారులను చంపి చిట్టడవిలో పారేయండి ఆభరణాలను తీసుకుపోయి కళింగదేశంలో విక్రయించండి



వచ్చిన ధనాన్ని మీరందరూ పంచుకోండి....ఆజ్ఞయిచ్చాడు వీరవర్మ.

ఆ దృఢకాయుడి ఆనందానికి అంతులేకపోయింది.సంతోషంగా వెనుతిరిగి చీకట్లలోకి పరుగుతీశాడు. మిగిలిన వారిద్దరినీ పిలిచాడు వీరవర్మ.

'వందన ఒక వృషభ శకటంలో ప్రయాణం చేస్తోంది. వేగవంతమైన అశ్వాలను అధివసించి ఆమెను వెంటాడండి. అదను చూసుకొని అపహరించాలి. ఎవరికీ తెలియని ఒక రహస్య ప్రదేశంలో దాచి వుంచాలి. నేను కబురు పంపే దాకా మీరు ఆమెదగ్గరే వుండాలి. జాగ్రత్త!"

'చిత్తందొరా! మీ ఆజను అక్షరాలా అమలు జరుపుతాం' అంటూ మందిరానికి ప్రక్కగా నిలబడివున్న తమ అశ్వాలను అధివసించి పట్టణ సరిహద్దులవైపు పరుగులు తీయించారు వారిద్దరూ.

*   *   *

పలుకురాతి ముక్కలతో ఎవరో తల పగులకొడుతున్నట్లు అనిపించి కళ్ళు తెరిచాడు మాధవుడు.

బంధింపబడివున్న అవయవాలను కదిలించటానికి విఫల ప్రయత్నం చేస్తూ, తలను అటూ యిటూ తిప్పాడు.

చిన్న చితుకులమంట ముందు కూర్చుని చలి కాచుకుంటున్నారు నలుగురు దృఢకాయులు. వారిని చూడగానే జరిగినదంతా మాధవుడి కళ్ళముందు మెదిలింది. వెంటనే పూజారికోసం వెతికాయి అతని నేత్రాలు.

చితుకుల మంటకు కొంచెం దూరంగా వుంది ఒక చింత

చెట్టు. దాని కొమ్మలకు వ్రేలాడ తీయబడి వున్నాడు పూజారి.

మాధవుడి కంఠంలో ఏదో రాయివంటిది అడ్డుపడినట్లు అయింది. ఎంత వద్దని అనుకున్నా ఆగకుండా బుగ్గలమీదికి జారింది కన్నీరు.

'దుగ్గడుపోయి చాలా సేపయింది! యింకా రాలేదేమిటి!!' అంటూ మంట ముందునుంచి లేచాడు దృఢకాయుల నాయకుడు.

'పదిక్రోసులుంది పట్టణం. పోయి రావటానికి చాలాసేపు పడుతుంది....' అన్నాడు మరో దృఢకాయుడు.

అదే సమయంలో దూరంనుంచి వినవచ్చింది ఒక అశ్వం పరుగెత్తుకొస్తున్న సవ్వడి.

'అడుగో! మాటల్లోనే వచ్చాడు దుగ్గడు....' అంటూ శబ్దం వినవచ్చిన దిశకు చూశారు వారందరూ. నురుగులు కక్కుతూ వచ్చిందా అశ్వం.

'దుగ్గా!' అని అరవబోయిన నాయకుడి వదనం, కత్తివాటుకు నెత్తురుబొట్టు లేనంతగా పాలిపోయింది.

పెద్దగా సకిలించి ముందుకాళ్ళను గాలిలోకి ఎత్తిందది. దాని జీనుమీద వున్న దుగ్గడి శవం క్రిందికి జారి చితుకుల మంటకు సమీపంలో పడింది.

'దొంగలు! బందిపోటు దొంగలు!!' అప్రయత్నంగా వెలువడ్డాయి, ఆ మాటలు నాయకుడి నోటివెంట. అవి పూర్తిగా వెలువడకముందే సర్రున వచ్చి అతని కాళ్ళముందు దిగబడింది పొడుగాటి బాణం ఒకటి.



మొదటి బాణంకంటే వేగంగా వచ్చాయి మరో రెండు. కెవ్వన అరిచి క్రిందపడిపోయాడు ఒక దృఢకాయుడు. అతని శరీరం నేలను తాకకముందే పొదలచాటునుంచి లేచి నిలబడ్డారు పదిమంది బందిపోటు దొంగలు.

కరవాలాన్ని ఒరలోనుంచి లాగి, వారిమీద కలబడ్డాడు దృఢకాయుల నాయకుడు. నిశ్శబ్దంగా వున్న ఆ ప్రదేశం ఒక్కసారిగా అరుపులతో కత్తుల మ్రోతలతో దద్దరిల్లిపోయింది.

తన మీదినుంచి అవతలకు గెంతుతున్న బందిపోట్లను పట్టించుకోకుండా, వేగంగా మంటలవైపు దొర్లాడు మాధవుడు. క్షణాలమీద కాలి మసి అయిపోయాయి అతని పాదాలను బిగించి వుంచిన త్రాళ్ళు. వెంటనే ప్రక్కకు తిరిగి బంధించివున్న చేతుల్ని మంటల్లోకి పోనిచ్చాడు.

బందిపోట్ల తాకిడికి మరో దృఢకాయుడు నేలకూలిపోయాడు. మిగిలిన ఇద్దరూ, ప్రాణాలమీద ఆశలను వదులుకొని పోరాటాన్ని కొనసాగిస్తున్నారు.

మాధవుడి హస్తాలను అదిమి వుంచిన త్రాళ్ళుకూడా తెగిపోయాయి. వెంటనే మంటలకు దగ్గరగా వున్న ఒక కరవాలాన్ని అందుకొని-చింతచెట్టు మీదికి ఎగబ్రాకాడు.

'మాధవా సాహసంలో నీ తండ్రినే మించిపోయావయ్యా! ఛేదించు నా బంధనాలను....' తన కాళ్ళక్రింద జరుగుతున్న పోరాటాన్ని మౌనంగా పరికిస్తున్న పూజారి ఆనందబాష్పాలను విడుస్తూ హెచ్చరించాడు.

ఒకే ఒక వ్రేటుతో అతని బంధనాలను తెగకొట్టాడు మాధవుడు.

'శరభ శరభ! హాళ్ళరభ శరభ!' అని అరుస్తూ క్రింద
పడ్డాడు పూజారి.

'అయ్యనాయనో! పూజారి!! భైరవాలయ పూజారి!!
పారిపోండిరో!!!' చెవులు చిల్లులు పడేటట్లు అరిచాడొక బంది
పోటు.

కుందేళ్ళమాదిరిగా పొదలవైపు పరిగెత్తారు బందిపోట్లు
అందరూ.

సందుచూసుకొని చింతచెట్టు క్రిందికి వచ్చారు దృఢ
కాయులు యిద్దరూ.

చిరుతపులి దూకినట్లు వారి తలలమీద దూకాడు
మాధవుడు.

శక్తినంతా ప్రయోగించి ఒక దృఢకాయుడి మెడమీ
దించాడు చేతిలోని కరవాలాన్ని.

'చచ్చాన్రోయ్!!' అని అరుస్తూ విరుచుకుపడిపోయాడు
ఆ దృఢకాయుడు.

చెంగున ప్రక్కకు దూకాడు ఆఖరి వ్యక్తి. చింత చెట్టు
మొదట్లో వున్న తొర్రలో చేయిపెట్టి పెద్దమూటను బయటి
లాగాడు.

'మాధవా! ఆపు!! అతన్ని ఆపు....' బందిపోట్లన
తరుముకుంటూ పోయిన పూజారి బిగ్గరిగా అరిచాడు తిరి
వస్తూ.

మూటను భుజాన వేసుకొని పొదలలోకి పరుగుతీశాడు
ధృఢకాయుడు. అతనికంటె వేగంగా కదిలి దారికి అడ్డ
నిలబడ్డాడు పూజారి. కంటికి కనిపించనంత వేగంగా లేచిం



దృఢకాయుడి కరవాలం. పూజారి కుడి భుజం సగంవరకూ
తెగి నేలమీదపడింది.

క్రిందపడిన మాధవుడు లేచి నిలబడేసరికి పొదలలోకి
పోయి మాయం అయిపోయాడు ఆ దృఢకాయుడు.

'మాధవా! మహాభైరవుడి ఆభరణాలు.... మనల్ని పడ
గొట్టి దేవాలయాన్ని కొల్లగొట్టారు వీళ్ళు. ప్రాణాలుపోయినా
సరే-ఆ నగల్ని మనం వశపరుచుకోవాలి. పో....ఆ దుర్మా
ర్గుణ్ణి వెంటాడు. నాకోసం చూడవద్దు. వెళ్ళు మాధవా!
వెళ్ళు!!' తెగిపోయిన భుజాన్ని ఎడమచేత్తో బిగించి పట్టు
కుంటూ ఆందోళనగా అన్నాడు పూజారి.

'మీ భుజం! మీ భుజానికి కట్టుకట్టి!!'- అనబోయాడు
మాధవుడు.

'వెళ్ళు మాధవా! వెళ్ళు!!' కనులు ఎర్రచేసి బిగ్గరిగా
అరిచాడు పూజారి. అంతటితో అతని శక్తి క్షీణించి
పోయింది. మొదలు నరికిన చెట్టులా విరుచుకు పడిపోయాడు.

* * *

ప్రొద్దు నడిమింటిని చేరుకోబోతుండగా, చిట్టడవిని దాటి
చిన్న సెలయేటిని సమీపించాడు మాధవుడు.

'పెద్దమూట నొకదాన్ని భుజాన పెట్టుకొని ఇటుగా వచ్చా
డొక దృఢకాయుడు. మీకు కనిపించాడా? ఎటు వెళ్ళాడో
చెప్పగలరా?' సెలయేటి పట్టునవున్న పశువుల కాపర్లను
ప్రశ్నించాడు.

'దృఢకాయుడా? అంటే అర్థం ఏమిటి?' తల బరు
క్కుంటూ అడిగాడొక పశువులకాపరి.

'లావుగా, ఎత్తుగా, మెలితిరిగిన కండలతో....' వివరిం చాడు మాధవుడు.

'ఆс! అవునవును. పొద్దు బారెడు ఎత్తుకు లేస్తుండగా ఒక మనిషిని చూశాం. అవునూ, అతను నిరాళ పర్వతాల వైపుగదా! పోయింది' అన్నాడు వెంటనే యింకొక కుర్రవాడు.

దూరంలో కనిపిస్తోంది నిరాళ పర్వత పంక్తి. ఆకాశాన్ని అంటుకునేటంత ఎత్తున్నాయి దాని శిఖరాలు. పచ్చగడ్డి అనేది కనిపించదక్కడ. ఎటుచూసినా ఎర్రటి బండరాళ్ళే దర్శన మిస్తాయి.

చీకట్లు-చుట్టుముట్టేసరికి ఆ పర్వత చెరియలను అధిగ మించి ఒక కొండదారిలోకి అడుగుపెట్టాడు మాధవుడు. ఎక్కడైనా కొద్దిసేపు ఆగి విశ్రాంతి తీసుకోవాలని అనిపిం సాగింది. కాని....తను కునికిపాట్లు పడుతున్న సమయంలో ఆ దొంగ మర్రింత దూరం వెళ్ళిపోతాడేమో అన్న ఆలోచన అతని అవయవాలకు నూతన శక్తిని ప్రసాదించింది.

మరునాడు మధ్యాహ్న సమయానికి ఆ కొండదారి అంతం అయిపోయింది. నురుగులు క్రక్కుతూ, సుడులు తిరుగుతూ ప్రవహిస్తున్న సరస్వతీ నది మాధవుడి ముందు ప్రత్యక్షం అయింది. కాంచనదేశపు సరిహద్దు అది. నదిని దాటితే కళింగ దేశంలో అడుగుపెట్టినట్లే లెక్క.

నది వద్దున వున్న చిన్న పాకను చూసి, అటుఅడుగుల వేశాడు మాధవుడు.

'ఎవరునాయనా నువ్వు? ఒంటరిగా తిరుగుతున్నావేమిటి ఈ పర్వతాల్లో!' మాధవుణ్ణి చూడగానే ప్రశ్నించింది పాకె ముందున్న వృద్ధురాలు.



'అవ్వా! పెద్ద మూటను పట్టుకొని ఇటుగా వచ్చాడొక దృఢకాయుడు. ఎటుపోయాడో చెప్పగలవా?' అడిగాడు మాధవుడు.

'నల్లగా....లావుగా వుంటాడు....కుడిచేతికి వెండి వుంగరం వుంటుంది?' సాలోచనగా అన్నదా వృద్ధురాలు.

వేగంగా కొట్టుకున్నాయి మాధవుడి గుండెలు. అవే! అవే పోలికలు!!

'కొంచెం ముందుగా రాకపోతివే నాయనా....ఇంతకు ముందేకదా నదినిదాటి సురపురంవైపు వెళ్లాడు....' జాలిగా అన్నదామె.

'వస్తానవ్వా! నీ ఋణం ఎన్నటికీ తీర్చుకోలేను....' అంటూపోయి తల్లక్రిందులుగా నదిలో దూకాడు మాధవుడు.

వేగంగా లేచి అతన్ని అల్లంతదూరానికి విసిరికొట్టిందొక అల. చేతిలోని కరవాలం జారి నదీగర్భంలోకి చేరుకుంది.

'అయ్యయ్యో! ఏతల్లి 'కన్నబిడ్డో....ఎ ం దు కి లా వచ్చాడో!!' నదివద్దున నిలబడి అతన్ని వెనక్కి పిలవ టానికి ప్రయత్నించి ప్రయత్నించి విసుగెత్తిన వృద్ధురాలు జాలిగా నిట్టూరుస్తూ వెనుతిరిగింది.

ఆవతలి వడ్డును చేరుకొని, ప్రయాణం ప్రారంభించాడు. మాధవుడు. చీకటిపడేవరకూ ఎక్కడా ఆగకుండా నడిచి- సురపురపు పొలిమేరలను సమీపించాడు సంధ్యవేళలో.

పొలిమేరలమీద కనిపించిన ఒక వ్యక్తి దగ్గిరికి పోయి తన వృత్తాంతాన్ని వినిపించాడు. 'నల్లగా! లావుగావుండే

మనిషా!! అటువంటివాళ్ళను చాలామందిని చూశాను..' అన్నాడతను.

పాము పడగ ఎత్తినట్లు రివ్వున లేచి మాధవుడి అంతరంగాన్ని ఆవరించుకున్నది నిరాశ. అయినా పట్టువదలకుండా సురపుర పట్టణం ద్వారాన్ని దాటి లోపలకు పోయాడు.

'పేరు తెలుసా? కొత్వాలు బావమరిది కూడా నువ్వు చెప్పినట్లే వుంటాడు....' అతని ప్రశ్నలను విని బదులు పలికాడు మరొక వ్యక్తి.

ఆపైన ప్రశ్నలు వేయటానికి భయపడ్డాడు మాధవుడు. తెలియదు పొమ్మంటారేమో! అసలు ఆ దొంగ సురపురమే వచ్చాడని నమ్మకం ఏమిటి ? మధ్యమార్గంలో మరో దిశకు ప్రయాణంచేసి వుంటే ??

రాత్రి మొదటిఝాము గడిచే సమయానికి మాధవుడి అంతరంగాన్ని పూర్తిగా ఆవరించుకున్నాయి నిరాశా నిస్పృహలు. వాటికి తోడై అతన్ని పూర్తిగా అశక్తుణ్ని చేశాయి ఆకలిదప్పులు. తడబడుతున్న అడుగులతో ఒక వీధి చివర వున్న చలివేంద్రాన్ని సమీపించి, మంచినీళ్ళ కుండల ప్రక్కన కూలబడ్డాడు. పాత్రతో నీటిని ముంచుకొని నోటికి ఆనించుకో బోతుండగా కనిపించాడు ఒక దృఢకాయుడు.

చేతిలోని పాత్రను అవతలికి విసిరికొట్టి 'ఆగు!!ఆగు!!' అని అరుస్తూ లేచాడు మాధవుడు.

అదిరిపడి అతనివంక చూశాడా దృఢకాయుడు. ఆశ్చర్యం



భయం....క్రోధం మొదలైన భావాలన్నీ ఒక్కసారిగా ప్రత్యక్షం అయ్యాయి అతని వదనంలో.

గిర్రున ప్రక్కకు తిరిగి పరుగు అందుకున్నాడు.

'పట్టుకోండి! దొంగ!! పారిపోతున్నాడు!!' అని అరుస్తూ అతన్ని వెంబడించాడు మాధవుడు. అతని కేకలు సురపుర పౌరుల్ని ఆకర్షించాయి. 'ఎవరూ? ఏమిటి ?' అంటూ ఇళ్ళలో నుంచి బయటికి వస్తున్నారు వారు.

ఒక వీధిలోనుంచి వచ్చి మాధవుడి చెయ్యి పట్టుకున్నాడొక వీరుడు.

'అయ్యా! దేవాలయాల్ని కొల్లగొట్టి పారిపోతున్నాడా దొంగ....ముందు అతన్ని పట్టుకోండి....' అ వీరుడి చేతిని వదిలించుకుంటూ అన్నాడు మాధవుడు. దేవాలయాన్ని కొల్లగొట్టాడా? అరేయ్! పట్టుకోండిరా వాడిని....బిగ్గరిగా అరుస్తూ ముందుకు దూకాడా వీరుడు.

ఒక మధుశాల ముందు నిలబడిన దృఢకాయుడి మీదికి మరలాయి సురపుర పౌరుల చూపులు. అది గమనించి అటూ యిటూ చూశాడా వ్యక్తి. ఉన్నట్లుండి అక్కడవున్న ఒక అశ్వంమీదికి ఎగిరి, కళ్ళేలను బిగించి పట్టుకున్నాడు.

పెద్దగా సకిలించి గాలిలోకి ఎగిరిందది. మాధవుడు మధుశాలను సమీపించేసరికి చీకట్లలోకి పోయి మాయం అయిపోయింది.

* * *

సురపురానికి పదునాలుగు యోజనాల దూరంలో వుంటుంది చెంగలువపురం. మాధవుడు ఆ పట్టణద్వారాలను

సమీపించేసరికి బాగా చీకటిపడిపోయింది. నగరవీధులన్నీ నిర్మానుష్యమై వున్నాయి.

వెలుగు వచ్చేవరకూ తను చేయగలిగింది ఏమీలేదని గ్రహించి, పట్టణ ద్వారానికి ఒక ప్రక్కగావున్న శివాలయపు మండపంలో పడుకున్నాడు మాధవుడు.

ఆకలిదప్పులు అతన్ని విపరీతంగా బాధిస్తున్నాయి. నోరు తెరిచి ఎవరినైనా అడగటానికి అభిమానం ఒకటి అడ్డువచ్చింది.

కడుపునిండా భోజనం చేసి ఎన్నిదినాలైందో లెక్కపెట్టటానికి ప్రయత్నిస్తూ, కనులు మూసుకున్నాడు. పట్టుమని పది నిమిషాలు కూడా గడవకముందే నిద్రాభంగం అయిందతనికి. మండపం దగ్గిరికి వస్తున్న నలుగురు దృఢకాయుల్ని చూసేసరికి అతని బడలిక మాయమైపోయింది.

'ఎలాగైనా సరే....ఆ కాలాశ్వాన్ని మనం అపహరించి తీరాలి. చందన నగర చక్రవర్తికి అశ్వాలంటే మహా మోజు. ఈ కాలాశ్వాన్ని చూశాడంటే అర్ధరాజ్యం యిస్తానన్నా మనం ఆశ్చర్యపడవలసిన పనిలేదు' అంటూ మండప సోపానాలమీద కూర్చున్నాడొక దృఢకాయుడు.

ఝల్లుమన్నది మాధవుడి దేహం. వేగంగా కొట్టుకుంటున్న గుండెలతో, ఒక స్తంభంచాటుకు జరిగి, వదిగి కూర్చున్నాడు.

'అశ్వాన్ని అపహరించాలన్న మాట బాగానేవుంది కాని దాని యజమాని చూస్తూ వూరుకుంటాడా? నిలబెట్టి నరకడూ మనల్ని?' సాలోచనగా తన అభిప్రాయాన్ని వెల్లడించాడు మరొక వ్యక్తి.



స్తంభం చాటున వున్న మాధవుడు సాధ్యమైనంత ముందుకు జరిగి, చెవులు రిక్కించి విన్నాడు. మొదట విన్న మాటలు తప్ప మరే విషయమూ అర్థంకాలేదతనికి.

చూస్తుండగానే నడిఝాము అయింది. ఉన్నట్లుండి లేచి నగర మధ్యంలోకి బయలుదేరారు వారందరూ.

రెండు క్షణాలపాటు యోచించాడు మాధవుడు. ఎవరిదో అశ్వాన్ని అపహరించటానికి పథకం వేస్తున్నారు ఆ దృఢ కాయులు. తనకెందుకులే అని చూస్తూ వూరుకోవటం బాగుంటుందా?

అప్రయత్నంగా కదిలాయి అతని పాదాలు. ఒకవీధి మలుపు తిరిగి దృష్టిపథం నుంచి దూరంకాబోతున్న ఆగంతకులను వదిలిపెట్టకుండా వెంటాడసాగాడు.

అటు తిరిగి యిటు తిరిగి ఒక ధర్మసత్రం దగ్గిరికి పోయారు వారు. ఇద్దరు సత్రపు మెట్లు ఎక్కి లోపలకు వెళ్ళారు. మరో యిద్దరు వెనుక భాగంలోవున్న అశ్వశాలను సమీపించారు.

ఒక చెట్టు చాటున నిలబడి వారి చర్యలను జాగ్రత్తగా గమనించసాగాడు మాధవుడు.

దట్టీలో దాచిన కొన్ని ఆకులను నలిపి వుండచేస్తూ అశ్వశాలలో వున్న ఒక కాలాశ్వం దగ్గిరికి పోయాడు ఒక ధృఢకాయుడు.

తన్ను సమీపిస్తున్న దృఢకాయుణ్ని చూడగానే పెద్దగా సకిలిస్తూ, చివ్వున తలఎత్తిందది.

నేర్పుగా ప్రక్కకు తప్పుకున్నా డతను. మెరుపులా

చేతిని ఎత్తి, దాని తలను బిగించి పట్టుకున్నాడు. వదిలించుకోవటానికి తీవ్రమైన ప్రయత్నం చేసిందా కాలాశ్వం. కాని ఆ వ్యక్తి చేతుల్లోని ఆకులు దాని మెదడును మొద్దుబారచేశాయి.

వెంటనే దాని మెడకువున్న త్రాటిని ఛేదించి బయటికి తీసుకు వచ్చాడా వ్యక్తి. అదే సమయంలో సత్రంలోనుంచి యివతలికి వచ్చారు అతని సహచరులు. వారి భుజాలమీద అచేతనంగా పడివున్నాడు ఒక యువకుడు.

'ఇతన్ని తీసుకుపోయి మరుద్వతీ నదిలో పడేద్దాం. మన పీడ విరగడైపోతుంది. పదండి....' కాలాశ్వాన్ని ముందుకు నడిపిస్తూ అన్నాడు మొదటి దృఢకాయుడు.

'శంభుణ్ని సత్రంలోనే వుండమని చెప్పాను. తెల్లవారగానే వచ్చి మనల్ని కలుసుకుంటాడు!' అన్నాడు యువకుణ్ని మోస్తున్న దృఢకాయుడు.

సత్రపు సోపానాలమీద నిలబడి వున్నాడు అతను అంటున్న ఆ శంభుడు.

చెట్టుచాటున వున్న మాధవుడు కొంచెం యివతలకి జరిగి అతనివైపు చూశాడు. ఆకాశంలో వున్న అర్ధ చంద్రుడి మసక వెలుగులో సైతం ఆ శంభుడి రూపం కొట్టవచ్చినట్లు కనిపించిందతనికి. వెంటనే అతని శరీరంలో వున్న రక్తమంతా ముఖంలోకి వచ్చేసింది.

శంభుడు ఎవరో కాదు. మహాభైరవుడి ఆభరణాలను అపహరించిన దృఢకాయుడే!!

పట్టరాని కోపంతో అటు దుముకబోయి-ఆఖరి క్షణంలో ఆగిపోయాడు మాధవుడు.



కాలాశ్వాన్ని పట్టణ సరిహద్దుల్లో వున్న మరుద్వతీ నది వైపు తీసుకుపోతున్నారు ఆగంతకులు. దాని యజమానిని నదిలో పడేసి హతమార్చబోతున్నారు.

ఎన్నడూ ఎరుగనటువంటి సంఘర్షణకు గురి అయింది మాధవుడి అంతరంగం.

'మహాభైరవుడి ఆభరణాలకోసం వచ్చావ్. వాటిని చేజిక్కించుకోకపోతే మీ వంశ ప్రతిష్ఠలు నడివీధికి ఎక్కుతాయి. ఇన్నిరోజులు పడిన కష్టానికి ప్రతిఫలం లేకుండా పోతుంది. పో....పోయి ఆ దుర్మార్గుణ్ని వధించైనా సరే-నగలను వశపరుచుకో....' కఠినకంఠంతో హెచ్చరించింది అతని మనస్సులోని ఒక భాగం.

'మాధవా! మహావీరుడు కార్తికేయుడి బిడ్డడివిరా నువ్వు. ఆర్తత్రాణ పరాయణుడైన ఆ తండ్రి రక్తం నీలో ప్రవహించటం లేదా? ఒక స్నేహితుడి కష్టాలను తొలగించటానికి భార్యాబిడ్డల్ని వదిలి దేశం కాని దేశం పోయాడు నీ తండ్రి. ఆయన సాహసంలో కనీసం గురివింద గింజెత్తు కూడా నీలో కనిపించదేం?' అంటూ ఎత్తి పొడిచింది మరొక భాగం. వెంటనే వెనుతిరిగి పట్టణద్వారం వైపు పరుగుతీశాడు మాధవుడు.

* * *

ఉన్నట్లుండి తల విదిలించింది కాలాశ్వం. కళ్ళను గుండ్రంగా తిప్పుతూ ఒక్కసారిగా ఎగిరింది గాలిలోకి.

తాము మోసుకు వచ్చిన యువకుడి మెడకు ఒక పెద్ద బండరాతిని బిగిస్తున్న ఆగంతకులు - అదిరిపడి తలలు ఎత్తారు.

భీకరంగా సకిలిస్తూ వారిమీదికి లంఘించింది ఆ కాలాశ్వం. వజ్రాయుధాలవంటి దాని గిట్టలు తగిలి వెల్లికిలా పడిపోయాడు ఒక ఆగంతకుడు.

మెడను ఆపరించుకున్న మత్తు వదిలిపోగా, ఆగ్రహంతో చిందులువేస్తోంది కాలాశ్వం. యజమాని ఆపదలో వున్నాడని అర్థం అయింది దానికి. పట్టుకోవటానికి వచ్చినవారిని విదిలించి కొట్టి - ఆ నదీతీరం ప్రతిధ్వనించేటట్లు పెద్దగా సకిలించింది.

'దీని అరుపులు ఎవరి చెవినైనా పడితే - మనమెడలకు వురితాళ్ళు తగుల్కొంటాయి. చంపండెహె.... చూస్తారేం?' అంటూ కత్తిని గిరగిరా తిప్పుతూ కాలాశ్వపు మెడను ఛేధించటానికి ప్రయత్నించాడొక ఆగంతకుడు.

'చంపటానికా యింత కష్టపడింది? ఆగరా....ఆగు!!!' అని అరుస్తూ అతని చేతిని పట్టుకున్నాడు మరొకడు.

గిర్రున వెనక్కి తిరిగి, లాగిపెట్టి వారి నడుముల మీద తన్నింది కాలాశ్వం. కెవ్వున అరిచి అల్లంత దూరంలో పడ్డారు వారిద్దరూ. పళ్ళు కొరుకుతూ లేచి నిలబడటానికి ప్రయత్నించేలోపున—రివ్వున వచ్చి వారి తలలమీద పడిందొక పలుకురాయి.

'దొంగలు! దొంగలు!! హంతకులు!!! రండి....అందరూ రండి....' చెవులు చిల్లులు పడేటట్లు వినిపించటం ప్రారంభించిందొక కంఠస్వరం. పొడుగాటి చెట్టుకొమ్మ నొకదాన్ని గిర గిరా తిప్పుతూ వారిముందు ప్రత్యక్షమయ్యాడు మాధవుడు.



'పానకంలో పుడక! వీడెవడురా!!' ఆశ్చర్యంగా అనబోయాడొక వ్యక్తి.

ఫెడీమని శబ్దంచేస్తూ అతని నోటిమీద పడింది చెట్టు కొమ్మ. గుక్క తిప్పుకునేలోగా వచ్చి పడ్డాయి మరో రెండు దెబ్బలు.

ఆలోచించే వ్యవధి వారెవరికీ లేకపోయింది. ఒకవైపు బుసలుకొడుతున్న కాలాశ్వం, మరొకవైపు చిచ్చర పిడుగు లాంటి కుర్రవాడు చేరి వారి దుమ్ము దులుపుతున్నారు.

కూడబలుక్కున్నట్లు ఒకేసారి వెనుతిరిగారు నలుగురూ. చెట్లచాటుకు వెళ్ళి, క్షణంలో అదృశ్యమైపోయారు.

చేతిలోని కొమ్మను నదిలోకి విసిరి, పడ్డమీద పడివున్న యువకుడి దగ్గిరికి పరుగుతీశాడు మాధవుడు.

అప్పుడే అటూ యిటూ కదులుతున్నాడతను. బాధగా నొసలు విరుస్తూ కనులు తెరిచాడు. అతని కరచరణాలను బంధించివున్న త్రాళ్ళను వూడతీసి, నదిలోని నీటిని తెచ్చి ముఖంమీద చిలకరించాడు మాధవుడు.

'ఏమిటిది? ఏమయింది??' అంటూ లేచి కూర్చున్నాడా యువకుడు.

ఆగంతకులను తరుముతూపోయిన కాలాశ్వం అతని కలతాన్ని విని ఆనందంగా సకిలిస్తూ అక్కడికి పరిగెత్తుకు వచ్చింది.

దాన్ని చూడగానే యువకుడి ముఖం జేవురించింది.

'దుర్మార్గులు... నన్ను చంపి నా అశ్వాన్ని అపహరిం

చాలని చూశారా? ఈ పింగళుడికి కోపంవస్తే ఎలావుంటుందో చూపిస్తాను' అంటూ లేచి నిలబడ్డాడు.

అతని ప్రక్కన నిలబడివున్న మాధవుడి ముఖంలో ముఖంపెట్టి చనువుగా సకిలించింది కాలాశ్వం. అది చూడ గానే ఆ యువకుడి ముఖంలో ఆశ్చర్యం పొడచూపింది.

'ఇంతవరకూ నన్ను తప్ప మరొకర్ని దగ్గిరకి రానీయ లేదీ అశ్వం. నీతో చెలిమి చేసిందంటే నమ్మబుద్ధి కావట లేదు. మిత్రమా! నా ప్రాణాలు కాపాడిన నీకు ఎలా తెలియ చేసుకోను నా కృతజ్ఞతలు?' మాధవుడి భుజాలమీద చేయి వేస్తూ ఆర్ద్రంగా అన్నాడు.

సిగ్గుతో తల ప్రక్కకు తిప్పుకున్నాడు మాధవుడు. ఉన్నట్లుండి సత్రంలో వున్న శంభుడు గుర్తుకువచ్చా డతనికి. తను వచ్చినపని దిగ్విజయంగా ముగిసింది. ఇక ఆలస్యం చేయటం అనవసరం.

మాధవుడిలో జనించిన ఆతృతను గుర్తించి, కాలాశ్వం మీదికి దూకాడా యువకుడు. చేతిని అందించి మాధవుణ్ణి వెనుక కూర్చోపెట్టుకున్నాడు.

'సత్రం దగ్గిర ఒక మనిషి వున్నాడు....మా మహా భైరవుడి ఆభరణాలను దొంగిలించుకు వచ్చాడు....' ముక్తసరిగా చెప్పాడు మాధవుడు.

అతని మాటలు ముగియక ముందే సుడిగాలికంటె వేగంగా పట్టణంలో ప్రవేశించింది కాలాశ్వం. పది క్షణాలలో వీధులను అధిగమించి సత్రంముందు ఆగింది.

* * *



సత్రపు వెనుక భాగంలోవున్న పూతోట దగ్గిర నిలబడి అసహనంగా దిక్కులుచూస్తున్నాడు శంభుడు. కాలాశ్వాన్ని అపహరించటంలో సహాయంచేస్తే, దాన్ని అమ్మగా వచ్చిన ధనంలో వాటా యిస్తామని అన్నారా ఆగంతకులు. ఎనిమిది సంవత్సరాలక్రితం వారితో కలిసి అటువంటి దోపిడీలలో పాల్గొనేవాడు శంభుడు. ఆ మాటను మనసులో వుంచుకొని యువకుణ్ని బంధించటంలో వారికి సహాయపడ్డాడు.

తనకు యివ్వాల్సిన వాటాను ఎగగొట్టి వారు కాలాశ్వంతో పారిపోతారేమో అన్న అనుమానం అతని హృదయంలో అడుగుపెట్టింది యిప్పుడు. వెంటనే అశ్వశాలలోకిపోయి సురపురంలో తను అపహరించుకు వచ్చిన అశ్వాన్ని ప్రయాణానికి సిద్ధం చేశాడు.

నగల మూటను జీను ప్రక్కన తగిలిస్తుండగా-వెనుక నుంచి వినవచ్చింది చిన్న నవ్వు. అదిరిపడి వెనుతిరిగి చూశాడు. వట్టి చేతులతో నిలబడివున్న తన స్నేహితులను గమనించేసరికి ఎందుకో ఒక విధమైన భయం అతన్ని ఆవరించుకుంది.

'ఏమయింది ? కాలాశ్వం ఎక్కడ ?' అన్నాడు తడబాటును కప్పిపుచ్చుకోవటానికి ప్రయత్నిస్తూ.

'మా పథకం మధ్యంలోనే బెడిసికొట్టింది. కాలాశ్వాన్ని అమ్మగా వచ్చిన ధనంతో హాయిగా జీవించవచ్చని అనుకున్నాం. ఇప్పుడు మా చేతిలో చిల్లిగవ్వకూడా లేదు....' అశ్వంమీది నగల మూటను చూస్తూ అన్నాడొక ఆగంతకుడు.

'అందుకు నన్నేం చేయమంటారు ? నా డబ్బు సంచీ కూడా ఖాళీ అయిపోయింది.'

'నీ దగ్గిరవున్న నగలమూట నిండుగానే వుందిగా! అంత ధనం నీకు అనవసరం. మాకుకూడా కొంచెం భాగం యివ్వు.'

పాలిపోయిన ముఖంతో వెనక్కి జరిగాడు శంభుడు. ఉన్నట్లుండి అశ్వంపైపు తిరిగి దాన్ని అధిరోహించటానికి ప్రయత్నించాడు.

సర్రున వరనుంచి బయటికి వచ్చింది ఆ ఆగంతకుడి ఖడ్గం. విసురుగా పైకిలేచి బలంగా వాలింది శంభుడి మెడ మీద.

'నగల మూటను తీసుకోండి....మరో మూడు అశ్వాలను సిద్ధం చేయండి....' మొదలు నరికిన చెట్టులా నేల కూలి పోతున్న శంభుణ్ని చూస్తూ అన్నాడా ఆగంతకుడు.

ఒకేసారి నగల మూటవైపు దుమికారు మిగిలిన ముగ్గురూ.

కంటికి కనిపించనంత వేగంగా పైకి లేచింది ఆగంత కుడి ఖడ్గం. తృటిలో తెగి నేలనపడ్డాయి యిద్దరి శిరస్సులు.

'వద్దురా...నీకు పుణ్యం వుంటుంది' నన్ను చంపకురా!! నగలన్నిటినీ నువ్వే తీసుకో!!' చేతులు గాలిలోకి ఎత్తి దీనంగా అంటూ వెనక్కి గెంతాడు మూడవ వ్యక్తి.

నిన్ను వదిలితే ఎలా? ఎప్పుడో ఒకప్పుడు నా రహస్యం బట్టబయలు చేయటానికా ? అదేం లాభంలేదు....' అంటూ మీదికి లంఘించి కత్తిని అతని గుండెల్లో దించాడు ఆ ఆగంతకుడు.



పెద్దగా అరుస్తూ క్రింద పడిపోయాడా వ్యక్తి. వెంటనే ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా శంభుడి అశ్వాన్ని వీధివైపు పోనిచ్చాడు ఆ ఆగంతకుడు.

పడిపోయిన అతని సహచరుడు గావుకేకలు పెడుతూనే వున్నాడు. అతని అరుపులకు నిద్రాభంగమైన సత్రపు అధికారి 'ఎవరది ?' అని ప్రశ్నిస్తూ లేచి యివతలకు వస్తున్నాడు.

వీధిలో నిలబడివున్న కాలాశ్వాన్ని చూడగానే ఆగంత కుడి గుండెలు వేగంగా కొట్టుకున్నాయి....అతను భయపడి నట్లే జరిగింది.

శంభుడి గుర్రాన్ని, దానిమీద వున్న వ్యక్తిని చూడగానే పెద్దగా సకిలించి, బాణంలా దూసుకు వచ్చింది-కాలాశ్వం.

వరలో వున్న ఖడ్గాన్ని బయటికి లాగుతూ, మడమలతో తన గుర్రాన్ని అదిలించాడా వ్యక్తి. తళతళలాడుతున్న కత్తిని చూడగానే మరింత బిగ్గరిగా సకిలించింది కాలాశ్వం.

* * *

తెరచి వున్న పెరటి ద్వారంగుండా అశ్వశాలలోకి పరుగుతీశారు మాధవ పింగళులు. నెత్తురు మడుగుల్లో తేలి యాడుతున్న శరీరాలను చూడగానే జరిగింది ఏమిటో వారికి అర్థం అయింది.

'భైరవుడు....నగలమూటతో పారిపోతున్నాడు...'వారిని చూడగానే పెద్దగా మూలిగి తల వాల్చేశాడు కత్తిపోటుతిన్న వ్యక్తి.

అదే సమయంలో ఆ నిశీధిని చీల్చుకుంటూ వినవచ్చింది కాలాశ్వపు సకిలింత.

లను అనుసరించారు వారిద్దరూ. చీకటిపడటం వల్ల ముందుకు సాగటం అసాధ్యమైంది.

నేలలో వున్న అడవి దుంపల్ని బయటికి లాగి మంటల్లోకి విసిరేశాడు పింగళుడు. వాటిని ఎలా కాల్చాలో మాధవుడికి వివరించాడు.

పొదల ప్రక్కన పెరిగిన పచ్చికను మేస్తోంది కాలాశ్వం. దుంపల వాసన తగలగానే చిన్నగా వారి ప్రక్కకు వచ్చి నిలబడింది. దాన్ని గమనించనట్లు, కాలిన దుంపల్ని మంటల్లో నుంచి తీసి, ఆరగించటం ప్రారంభించాడు పింగళుడు.

గిట్టలతో నేలను గీరింది కాలాశ్వం. అప్పటికీ అతను తనవంక చూడకపోవటంతో, తలవంచి అతని భుజాన్ని పొడిచింది.

నవ్వుతూ దాని తలమీద కొట్టాడు పింగళుడు. 'విశ్వాసపాత్రమైన ఒక అశ్వం అరివీర భయంకరులైన అరవై మంది స్నేహితులతో సమానం. నిన్ను నమ్మిన అశ్వం నీ తల్లికంటె ఎక్కువగా నిన్ను కాపాడుతుంది' అన్నాడు రెండు దుంపల్ని అందుకొని కాలాశ్వానికి అందిస్తూ.

అరణ్యంలో అడుగు పెట్టిన మరుక్షణం నుంచీ అతని మాటల్ని శ్రద్ధగా విని మనసులో భద్రపరుచుకుంటున్నాడు మాధవుడు.

చితుకుల మంటను మరికొంచెం పెద్దదిచేసి, దాని ప్రక్కనే మేను వాల్చాడు పింగళుడు. పడుకొన్నాడన్న మాటేగాని మాధవుడికి నిద్రరాలేదు. ప్రకీర్తి పట్టణంనుంచీ



తను బయలుదేరిన క్షణంనుంచీ ఎదురౌతున్న సంఘటనలను మననం చేసుకోసాగాడు.

క్రమంగా అడవి జంతువుల అరుపులు కూడా అణిగిపోయాయి. భయంకరమైన నిశబ్దం ఆ ప్రదేశాన్ని ఆవరించుకున్నది.

చితుకుల మంట చల్లారిపోతున్నట్లు గ్రహించి లేచి కూర్చున్నాడు మాధవుడు. అదే సమయంలో పొదప్రక్కన నిలబడివున్న కాలాశ్వం—చెవులు రిక్కించి తలను గాలిలోకి ఎత్తింది.

ఝల్లుమన్నది మాధవుడి హృదయం. కాలాశ్వం అలా ప్రవర్తించిందంటే ఏదో ప్రమాదం ఆ చుట్టుపట్ల పొంచివున్నట్లే లెక్క.

మంటకు కొంచెం యివతలగా పేర్చివుంచిన చితుకులను తీసి, మంటలో పడేస్తూ కను చివరలనుంచి చుట్టూ చూశాడు.

మంట పెద్దదయిన మరుక్షణం—తళుక్కుమని మెరిసింది ఒక మెరుపు. చిన్నగా సకిలిస్తూ మాధవుడివైపు చూసింది కాలాశ్వం.

పొదలకు ఆవతల కనిపిస్తున్న మెరుపుల్ని లెక్కబెడుతున్నాడు మాధవుడు. అతని లెక్క పూర్తికాక ముందే మరోసారి సకిలించింది కాలాశ్వం.

ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు పింగళుడు. క్షణంలో అర్థం అయిందతనికి కాలాశ్వపు సకిలింతలకు కారణం. మెరుపులా తన కత్తిని తీసుకొని చితుకుల మంటకు దూరంగా దొర్లాడు.

సర్ర్‌మని శబ్దంచేస్తూ వచ్చి అంతవరకూ అతను పడుకొనివున్న ప్రదేశంలో దిగబడింది మూడుమూరల పొడుగున్న యుద్ధం బాణం ఒకటి. దాన్ని చూడగానే పింగళుడు మంటకు దూరంగా ఎందుకు జరిగాడో మాధవుడికి అర్థం అయింది. వెంటనే తనుకూడా అవతలికి దొర్లి దుస్తుల చాటునవున్న పాత కైజారును బయటికి తీశాడు. భైరవాలయంలో బంధించబడిన క్షణంనుంచీ అది అతని దుస్తుల వెనుకే వున్నది. ఉపయోగించవలసిన అవసరం అంతవరకూ ఎదురుపడలేదు.

ఉన్నట్లుండి ముంగాళ్ళను గాలిలోకి ఎత్తింది కాలాశ్వం. భీకరంగా సకిలిస్తూ ఒక పొదను లాగిపెట్టి తన్నింది. బాధగా అరుస్తూ పొదచాటునుంచి లేచి మాధవుడికి కనిపించే విధంగా పడిపోయాడు ఒక ఆటవికుడు.

పులిచర్మాలను ధరించి వున్నాడతను. నెత్తిమీద కొంత చిలుక యీకెలను అలంకరించుకున్నాడు. మెడలో పూసల పేర్లు వ్రేలాడుతున్నాయి.

'కోయలు! మాధవా!! మనల్ని కోయవీరులు చుట్టుముట్టారు. ఎందుకైనా మంచిది ఒక పాదాన్ని వెనక్కితిప్పి వుంచు. వీలు కుదరకపోతే పిక్కబలం చూపించక తప్పదు' అంటూ లేచి తన ఎదుటవున్న పొదమీదికి లఘించాడు పింగళుడు.

అతని మాట పూర్తికాక ముందే ఆ పొదచాటునుంచి లేచి నిలబడ్డారు పాతికమంది కోయలు. ఏడుమూరల ఎత్తున్నాడు వారి నాయకుడు. మిలమిల మెరుస్తున్న



గండ్రగొడ్డలిని ఎత్తి, వికృతంగా అరుస్తూ పింగళుడిమీద కలబడ్డాడు.

అంతటితో అక్కడ అలుముకొని వున్న ప్రశాంతత దూరంగా పారిపోయింది. కోయదొరను అనుసరించి వచ్చిన వారిలో కొందరిని తన మొండికైజారుతో అడ్డుకున్నాడు మాధవుడు. కత్తుల మ్రోతలతో, వారి సింహనాదాలతో, కాలాశ్వపు సకిలింపులతో దద్దరిల్లిపోసాగింది ఆ ప్రదేశం.

సందుచూసుకొని నలుగురు కోయలను మట్టి తినిపించాడు పింగళుడు. కాలాశ్వం యిద్దరిని పరలోకాలకు పంపించి, వారి శరీరాలు గుర్తుపట్టటానికి వీలులేనట్లు గిట్టలతో మర్దించి వేసింది.

చుట్టుముట్టిన కోయలను విదిలించి కొట్టటానికి విపరీతమైన ప్రయత్నం చేస్తున్నాడు మాధవుడు. ఉన్నచోట వుండకుండా, నిలబడిన చోట కాలు ఆనించకుండా బొంగరం తిరిగినట్లు గిర్రున తిరుగుతూ వారి ఆయుధాలను ఎగరగొట్టటానికి చూస్తున్నాడు.

ఉన్నట్లుండి ఆకాశం బ్రద్దలైపోయేటట్లు సింహనాదం చేశాడు కోయదొర. గండ్రగొడ్డలిని రెండు చేతులతోను పైకి ఎత్తి పింగళుడి తలమీద కొట్టాడు. తన కత్తినిదానికి అడ్డువేశాడు పింగళుడు. ఖంగుమని శబ్దంచేస్తూ మధ్యకు విరిగిపోయిందది.

'హాహాహా! హోహోహో!!' అని వికృతంగా నవ్వుతూ కాలెత్తి పింగళుడి గుండెలమీద తన్నాడా కోయదొర. అతను తూలి వెనక్కి పడిపోయిన మరుక్షణం, గుండెల్ని

కుడిపాదంతో అదిమిపట్టి గాలిలోకి ఎత్తాడు తన గండ్ర గొడ్డలిని.

అడ్డు వచ్చిన కోయవీరుడి నొకడిని కైజారుతో పొడిచి అటు గెంతాడు మాధవుడు. వెనుక నుంచి దెబ్బతీయాలని ప్రయత్నించారు కోయలు. తన యజమాని ప్రమాదంలో చిక్కుపడ్డాడని గ్రహించిన కాలాశ్వం, చెవులు చిల్లులు పడేలా సకిలిస్తూ మాధవుడివైపు దూసుకువచ్చింది. అతన్ని వెనుకపాటు పొడవటానికి ప్రయత్నిస్తున్న వారందరూ ఖంగారుగా ప్రక్కలకు దూకారు.

అదేమీ పట్టించుకోకుండా, కుప్పించి గాలిలోకి ఎగిరాడు మాధవుడు. రెండు పల్టీలుకొట్టి సూటిగా కోయదొర భుజస్కంధాలమీద పడ్డాడు. వెంటనే పాదాలను అతని నడుము చుట్టూ పెనవేసి ఎడమచేత్తో అతని కంఠాన్ని ఒడిసి పట్టుకున్నాడు.

'కొట్టు మాధవా! కొట్టు!! బిగ్గరగా అరిచాడు కోయదొర పాదం క్రిందినుంచి తప్పించుకోవటానికి ప్రయత్నిస్తున్న పింగళుడు. హాహాకారాలు చేశారు ఆ దృశ్యాన్ని చూస్తున్న కోయలందరూ.

కంటికి కనిపించనంత వేగంతో కోయదొర గుండెల మీద దిగబడింది మాధవుడి పాతకైజారు. గండ్ర గొడ్డలితో అతని పాదాలను నరకాలని అనుకుంటున్న కోయదొర పెళ్లున అరిచి విరుచుకు పడిపోయాడు. మరో పోటుపొడిచి నేలమీద పడ్డాడు మాధవుడు. కోయదొర చేతిలోని గొడ్డల్ని లాక్కొని అతని అనుచరులవైపు తిరిగాడు పింగళుడు



తమ దొర పడిపోవటాన్ని చూసి చిత్తరువుల్లా నిలబడి వున్నారు వారందరూ. పింగళుడు గండ్రగొడ్డలితో లేచి నిలబడేసరికి గోలగోలగా అరుస్తూ పొదలలోకి పారిపోయారు.

మాధవా! ఇంత చిన్న వయసులోనే ఎలా అలవడిందయ్యా యింత నేర్పు!! కొండల్ని సైతం పట్టి చేతులతో పిండి చేయగల యీ కోయదొరను, ఉక్కిరిబిక్కిరి చేసి ఒకే ఒక దెబ్బతో కిక్కురుమనిపించావ్!' అంటూ క్రింద పడిన మాధవుడికి చేతిని అందించి లేపి నిలబెట్టబోయాడు పింగళుడు.

ఆనందంగా సకిలిస్తూ, మాధవుడి ముఖాన్ని స్పృశిస్తున్న కాలాశ్వం, గిర్రున వెనుతిరిగి పొదలకేసి చూసింది.

గండ్ర గొడ్డలిని గాలిలోకి ఎత్తబోతున్న పింగళుడు ఆఖరి క్షణంలో ఆగిపోయాడు.

'శత్రువును కాదు పింగళా! స్నేహితుణ్ణి!! కోయదొర భల్లూకరాయుణ్ణి స్వర్గానికి పంపించిన మీ గండుచీమ పరాక్రమాన్ని చూసేటందుకు వచ్చాను' అంటూ పొదలలో నుంచి యివతలకు వచ్చాడు నల్లరాతిలో మలిచినట్లున్న మరో ఆటవిక నాయకుడు.

'నల్లతాచు!!' ఆశ్చర్యంగా అన్నాడు పింగళుడు.

'అవును మిత్రమా! నీ పాతకాలపు స్నేహితుడైన భిల్లదొర నల్లతాచునే నేను. జ్ఞాపకమున్నానా?' అంటూ ముందుకు వచ్చి అతని కౌగలించుకున్నాడు ఆటవికుడు.

మాధవుడి చేతిలో మడిసిన కోయదొర పేరు వినగానే వులిక్కి పడ్డాడు పింగళుడు. దారి తప్పి అరణ్యంలోకి

వచ్చిన నాగరికులను ఎందరినో పొట్టనపెట్టుకున్న నరరూప రాక్షసుడు భల్లూకరాయుడు!

ఒక చిన్నపిల్లడి చేతిలో అతని చావు వ్రాసి పెట్టాడు బ్రహ్మదేవుడు !!!

'దొరా! పారిపోయిన కోయలు మిగిలినవారందర్నీ వెంట బెట్టుకుని రాకముందే మనం యిక్కడినుంచి వెళ్ళిపోవటం మంచిదికదా!' వున్నట్లుండి అన్నాడొక భిల్లవీరుడు.

'తెన్న పలికావ్....మన గూడెంపోయి మాటాడు కుందాం. పింగళా! నువ్వు నీ స్నేహితుడు మాకు అతిథులు' అంటూ పింగళుడి సమాధానం కోసం ఎదురుకూడా చూడ కుండా పొదల చాటున నిలబడివున్న తన అశ్వాన్ని అధిరో హించాడు నల్లతాచు.

ఆ మాటతో యీ లోకంలోకి వచ్చాడు పింగళుడు' పద మాధవా! పోదాం!!! అంటూ కాలాశ్వాన్ని ఎక్కి అతన్ని వెనుక కూర్చోపెట్టుకున్నాడు.

పొదలను దాటి ఒక యోజనపు దూరం పోగానే— వున్నట్లుండి తన అశ్వాన్ని ప్రక్కకు మరలించాడు నల్లతాచు. ప్రశ్నార్థకంగా చూసిన పింగళుడితో 'యిక్కడికి సమీపంలోనే ఒక స్నేహితుడు మనకోసం ఎదురు చూస్తు న్నాడు. అతన్ని కూడా మన గూడేనికి పిలుచుకుపోదాం' అన్నాడు.

మాటాడకుండా అతన్ని అనుసరించాడు పింగళుడు. ఒక చిన్న కొండ గుట్టముందు అశ్వాన్ని ఆపి 'భైరవా! భైరవా!! అని పెద్దగా పిలిచాడు నల్లతాచు.



అతని మాటలు విని గుట్టచాటునుంచి యివతలికి వచ్చాడు ఒక నాగరికుడు.

అతన్ని చూడగానే చెవులు చిల్లులుపడేటట్లు సకిలించింది కాలాశ్వం. ఆవేశంతో బుసలుకొడుతూ ఎగిరి గంతులు వేసింది.

కళ్ళేలను బిగించి పట్టుకొని అతి ప్రయత్నంమీద దాన్ని శాంతింప చేశాడు పింగళుడు. అదే సమయంలో క్రిందికి దూకబోయిన మాధవుడిని కూడా చేయి అడ్డంపెట్టి ఆపు చేశాడు.

'మిత్రమా పింగళా! నీ కాలాశ్వానికి కొంచెం కోపం ఎక్కువ అయినట్లు అనిపిస్తోంది. కనిపించిన వారందరి మీదా యిలా కత్తులు నూరితే భరించటం కష్టంసుమా!' అంటూ ఆ వ్యక్తిని అతనికి పరిచయం చేశాడు అసలు విషయం అర్థంకాని నల్లతాచు.

హద్దులు మీరుతున్న ఆవేశాన్ని బలవంతంగా అదిమి పట్టుకుంటూ చిరునవ్వు నవ్వాడు పింగళుడు. గుట్టచాటున నిలబడివున్న తన అశ్వాన్ని యివతలికి తీసుకువచ్చాడా వ్యక్తి. మాధవ పింగళుల వైపు కోరగా చూస్తూ బండరాళ్ళ మధ్య వుంచిన మహాభైరవుడి నగల మూటను ఎత్తి దాని జీనుకు బిగించాడు.

'పింగళా నన్ను వదులు....' అంటూ పింగళుడి చేతిని వదిలించుకోవాలని ప్రయత్నించాడు మాధవుడు.

'వద్దు మాధవా! పరిస్థితులు మన చేతుల్ని దాటి పోయాయి. నల్లతాచు చూస్తుండగా అతన్ని మనం ఏమీ

చేయటానికి వీలులేదు. ఏమైనా చేస్తే అది భిల్లులసందర్భ అవమానించినట్లు అవుతుంది. ప్రాణాలు కావాలన్నా సంతోషంగా యిస్తాడు నల్లతాచు. తమ గూడెపు కట్టుబాట్లకు అపచారం జరిగితే మాత్రం సహించడు....' అంటూ అతన్ని వారించి గాఢంగా నిట్టూర్చాడు పింగళుడు.

* * *

కోయదొర భల్లూకరాయుడు మరణించాడన్న వార్త విపరీతమైన సంచలాన్ని కలిగించింది భిల్ల గూడెంలో. కొండ దేవర విగ్రహం ముందు కూర్చుని వున్న భిల్లులందరూ సింహనాదాలు చేస్తూ పరుగెత్తారు పొలిమేరల వైపు. నల్లతాచుకు అతని స్నేహితులకు ఘన స్వాగతాన్ని యిచ్చి గూడెంలోకి తీసుకువచ్చారు.

కొండదేవర విగ్రహం ముందు అశ్వాన్ని దిగి—కుల పెద్దల పాదాలకు ప్రణమిల్లాడు నల్లతాచు. అనుచరుల అందించిన పూమాలలను కొండదేవర పాదాలముందు వుంచి ప్రణామం చేశాడు.

'మిత్రులారా! గూడెపు పెద్దలారా!!' అంటూ అతను భిల్లులను సంబోధించేసరికి చీమ చిటుక్కుమన్నా వినిపించేటంత నిశబ్దం ఆ ప్రదేశాన్ని ఆవరించుకున్నది.

'నాగరికుల్లో కూడా మనకు శ్రేయోభిలాషులు వున్నారని మీకు తెలుసు. గతంలో కోయలకు మనకు ఎన్నో యుద్ధాలు జరిగాయి. ఆ యుద్ధాల్లో పాల్గొని మనకు మన గూడేనికి బాసటగా నిలిచిన మహావీరుడు పింగళుడు. అతను ఇప్పుడు యింకొక వీరాధివీరుణ్ని మన మధ్యకు తీసుకువచ్చాడు.



అరణ్యంలో అడుగు పెట్టీ పెట్టకముందే భల్లూకరాయుణ్ని బలితీసుకున్న యీ సింహకిశోరమే పింగళుడు మనకు ప్రసాదించిన మరో నూతన స్నేహితుడు' అంటూ మాధవుడి వైపు చూపించాడు నల్లతాచు.

ఆశ్చర్యంతో ప్రమాన్పడిపోయారు భిల్లులందరూ. వారందరూ తనవంకే చూస్తూ వుండటాన్ని గమనించేసరికి ఎర్రగా కందిపోయింది మాధవుడి వదనం కొంచెం అవతలగా నిలబడివున్న భిల్లకాంతల గుసగుసలు చెవినపడేసరికి సిగ్గుతో మరింతగా కుంచించుకుపోయాడతను.

ముట్టుకుంటే కందిపోయేటట్లున్న పిల్లడు—ఎనబోతులాంటి భల్లూకరాయుణ్ని ఎలా వధించగలిగాడో! అన్నది ఒక పడుచు.

'నలుసుకంటె చిన్నదైన గండుచీమ పర్వతంకంటె పెద్దదైన ఏనుగును సైతం పిచ్చిగా పరుగులు తీయించటం లేదా? వీరత్వం అనేది పుట్టుకతో వస్తుంది. వయసుతోను, వంటి సొగసుతోనూ దానికి సంబంధం లేదు.' మాధవుడి వంక ఓరగా చూస్తూ తన స్నేహితురాలి చెవిలో గుసగుసలాడింది ఒక భిల్లకాంత.

పర్వతంలావున్న ఒక భిల్ల వీరుడు విన్నాడా మాటల్ని. వెంటనే దిక్కులు దదరిల్లిపోయేటట్లు సింహనాదంచేసి, మాధవుడి నడుమును పట్టుకొని అవలీలగా ఎత్తాడు గాలిలోకి.

'చూడండి....గండుచీమను చూడండి !'

మరు క్షణం 'గండు చీమ, గండుచీమ!!' అన్న అరుపులతో మార్మోగిపోయింది భిల్లగూడెం.

భిల్లవీరుడి చేతుల్లోనుంచి తప్పించుకొని పింగళుడి చాటుకు పరుగుతీశాడు మాధవుడు. కొండదేవర విగ్రహం వెనుక నిలబడివున్న భైరవుణ్ని చూడగానే జేగురు రంగుకు తిరిగాయి అతని నేత్రాలు. అంతలోనే అతని చేతిని పట్టుకొని అవతలికి లాక్కుపోయాడు పింగళుడు. భిల్లుాక రాయుడు మట్టిలో కలిసిపోయిన శుభ సందర్భాన్ని పురస్కరించుకొని జాతర చేస్తున్న భిల్లవీరు లెవరూ—తమ స్నేహితులైన నాగరికుల మధ్య వీస్తున్న ద్వేషవాయువులను గమనించలేదు.

* * *

'మాధవా! నిద్ర లేవవయ్యా! ఇంకా కొద్దిసేపు యిలాగే పడుకుంటే గండుచీమకు బద్ధకం ఎక్కువ అని ప్రచారం ప్రారంభిస్తారు యీ భిల్లులు.' అంటూ గాఢ నిద్రలోవున్న మాధవుడి భుజాన్ని తట్టాడు పింగళుడు.

ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు మాధవుడు. 'అప్పుడే తెల్లవారిందా? ఇప్పుడేగదా పడుకున్నది!'' అంటూ బద్ధకంగా ఆవలించి వళ్ళు విరుచుకున్నాడు.

నల్లతాచు భార్య తెచ్చి యిచ్చిన పాల ముంతను ఖాళీ చేస్తూ చిరునవ్వు నవ్వాడు పింగళుడు' నదికి వెళ్ళి నాలుగు మునకలు వేసిరా. అప్పుడుగాని నీకు ఏదీ సరిగా అర్థం కాదు' అన్నాడు ద్వారంవైపు చేయి చూపుతూ.

నిద్ర చాలక ఎర్రబడిన కనులను నులుముకుంటూ లేచి బయటికి వచ్చాడు మాధవుడు.

భిల్లగూడేన్ని ఆనుకొని ప్రవహిస్తూ వుంటుంది ఒక



నది. పర్వతాలమీదినుంచి పరుగులు తీస్తూ రావటంవల్ల మంచుకంటె చల్లగా వుంటాయి దాని నీళ్లు.

అక్కడ తోలు తిత్తులతో నీటిని ముంచుకుంటున్న భిల్ల కాంతలు కొందరు మాధవుడు అటుగా రావటాన్ని గమనించి నవ్వుతూ చేతులు వూపారు.

సిగ్గుపడి మరోప్రక్కకు పరుగుతీశాడు మాధవుడు. గూడేనికి దూరంగా పోయి, దట్టంగా పెరిగివున్న పొదల మధ్యనుంచి ఆ నదీ తీరాన్ని సమీపించాడు.

నిర్మానుష్యంగావున్నదా ప్రదేశం. ఆకాశంలో గిరికీలు కొడుతున్న పక్షుల అరుపులు తప్ప మరెట్టి శబ్దమూ వినిపించడం లేదు.

దుస్తుల్ని తొలగించి నీటి వద్దున పడేశాడు మాధవుడు. పాత కైజారును పదనుపెట్టాలనే కోరికతో మంచి రాతి కోసం వెతకటం ప్రారంభించాడు.

ఉన్నట్లుండి కదిలాయి వద్దుమీది పొదలు. ఎవరో వస్తున్నట్లు అడుగుల శబ్దం వినిపించింది. తాచు పాములా తల తిప్పిన మాధవుడి కనులకు — తళతళలాడుతున్న కత్తి నొక దాన్ని పట్టుకొని అటుగా వస్తున్న భైరవుడు కనిపించాడు.

ఎడమచేతిలోని కైజారును కుడిచేతిలోకి మార్చుకొని - ఏ పరిస్థితినైనా ఎదుర్కోవడానికి సిద్ధమైనాడు మాధవుడు.

'కాలాశ్వాన్ని నాకు కాకుండా చేసింది చాలక యిప్పుడు నగల మూటను కూడా అపహరిద్దామని ఆలోచిస్తున్నావా!! నరాల్లో సత్తువ లేనివాడు కాబట్టి ఆ శంభుడు నిన్ను చూసినప్పుడల్లా బెదిరి పరుగులు తీశాడు. నీపప్పులు యీ భైరవుడి దగ్గిర మాత్రం వుడకవ్....' మాధవుడి ముందుకు వస్తూ వికృతంగా అన్నాడతను.

'నల్లతాచుకు యీ విషయం తెలిస్తే నీతలను నరికి కొండదేవర విగ్రహం ముందు వ్రేలాడతీస్తాడు' బింకంగా అన్నాడు మాధవుడు. అతని కత్తిమీదినుంచి దృష్టిని మరలించకుండా.

'ఎనుబోతుల్ని నరుక్కుతినే ఆ అడవి మృగానికి అంత తేలికగా పట్టుబడతానా నేను!! నిన్ను చంపి యీ నదిలో పడవేస్తే, నల్లతాచుకు కాదుగదా, అతన్ని పుట్టించిన కొండదేవరకు కూడా తెలియవు నీ జాడలు' అంటూ ఒక్కసారిగా అతనిమీదికి లంఘించాడు భైరవుడు.

అతని కత్తి గాలిలోకి లేచిన మరుక్షణం—కైజారును ఎత్తి అతని వక్షస్థలంమీద పెద్ద గాటుపడేటట్లు దూశాడు మాధవుడు.

ఖంగారుగా వెనక్కి జరిగాడు భైరవుడు. వెంటనే ముందుకు దూకి కుడికాలితో అతని తొడలమీద తన్నాడు మాధవుడు. కైజారును చేతిక్రిందినుంచి తిప్పి భైరవుని కంఠం మీదికి పోనిచ్చాడు.

తడి తడిగా వున్నది నేల. కాలుపెడితే జారిపోతున్నది. భైరవుడి భరతం పట్టాలన్న ఆత్రుతలో ఆ విషయాన్ని మరిచిపోయాడు మాధవుడు. కైజారును ముందుకు పోనీయటంలో ప్రక్కకు వంగవలసి వచ్చింది. అలా వంగటంలో అనుకోకుండా జారింది కాలు. పట్టు చిక్కించుకునే వ్యవధి లేకపోయింది. చేతిలోని కైజారు ఎగిరి అవతలపడింది. దానితోపాటు నేలమీద పడిపోయాడు తనుగూడా.

వికృతంగా నవ్వి ఎగిరి అతని గుండెలమీద కూర్చున్నాడు భైరవుడు. 'గండుచీమవా నువ్వు? నల్లిని నలిపినట్లు



నలిపేస్తాను చూడు....' అంటూ కత్తిని గాలిలోకి ఎత్తి అతని గుండెల్లో దింపబోయాడు.

ఫటామని శబ్దంచేస్తూ అతని తలమీద పడిందొక పెద్ద చెట్టుకొమ్మ. అదిరిపడి పొదలవైపుచూశాడు భైరవుడు.

ముళ్ల పొదలు తన దుస్తుల్ని చించి పేలికలు చేస్తున్నా లక్ష్యపెట్టకుండా-పొదలను విరగదొక్కుతూ వస్తున్నాడు పింగళుడు. భైరవుడు తనవంక చూడటాన్ని గమనించి, ఆ నదీతీరం దద్దరిల్లిపోయేటట్లు సింహనాదం చేశాడు.

చటుక్కున లేచి నిలబడ్డాడు భైరవుడు. రివ్వుమంటూ వచ్చి అతని ముఖంమీద తగిలింది పింగళుడు విసిరిన వలుకురాయి.

'నీ రోజులు గతించాయి. నీకీ భూమిమీద నూకలు చెల్లిపోయాయి' అంటూ తన ఖడ్గాన్ని బయటకి లాగి అతని మీదికి విసిరాడు పింగళుడు.

ఒక్క గంతులో పోయి నదిలో పడ్డాడు భైరవుడు. పింగళుడి కత్తి అతని భుజాల్ని రాచుకుంటూ వెళ్ళి నదిలో మునిగిపోయింది.

మరో ఆయుధం కోసం అటూ యిటూ చూశాడు పింగళుడు. నీటి అంచున పడివున్న మాధవుడి కైజారు కనిపించిందతనికి. దాన్ని అందుకొని తను గూడా నదిలో దిగబోయాడు.

వంటికి అంటిన బురదను విదిలించుకుంటూ, లేచి నిలబడుతున్న మాధవుడు 'పింగళా! నల్లతాచు వస్తున్నాడు!!' అన్నాడు అదుర్దాగా.

చేతిలోని కైజారును దట్టీలో దోపుకొని ఏమీ ఎరుగని వాడిలా, తాపీగా వెనక్కి తిరిగాడు పింగళుడు.

'హో! పింగళా!! ఏం చేస్తున్నారు యీ పొదలమధ్య?' ఆవలి ఒడ్డును చేరుకోవాలని ప్రయత్నిస్తున్న భైరవుడి వంక విచిత్రంగా చూస్తూ అడిగాడు అక్కడికి వచ్చిన నల్లతాచు.

'గండుచీమకు యీత నేర్పుతున్నాం. నదిని వేగంగా అధిగమించటం ఎలాగో చూపిస్తున్నాడు భైరవుడు' నవ్వుతూ అన్నాడు పింగళుడు.

'మరి గండు చీమ శరీరమంతా బురదతో నిండి వున్న దేమిటి ?' అనుమానంగా అడిగాడు నల్లతాచు

'బురద పూసుకొని సూర్యరశ్మిలో నిలబడితే గట్టిపడు తుందిట శరీరం. మా నాగరికుల నమ్మకం అది' నేర్పుగా సమాధానం యిచ్చాడు పింగళుడు.

'అలాగా! అయితే నేను పోతాను. మీరుకూడా త్వరగా రండి. వేటకు పోవాలని అనుకుంటున్నారు మన వీరులందరూ. మీరుకూడా మాతో రావాలని నా ఆకాంక్ష' అంటూ వడి వడిగా గూడెంవైపు వెళ్ళిపోయాడు నల్లతాచు.

గుండెలమీది నుంచి పెద్ద బరువేదో తొలగిపోయినట్లు తేలికగా నిట్టూరుస్తూ నదివైపు తిరిగాడు పింగళుడు. ఎవరున్నారని అక్కడ ?

నల్లతాచు వెళ్ళిపోయిన మరుక్షణం ఒడ్డెక్కి పొదల చాటుకు పారిపోయాడు భైరవుడు.

*   *   *

కొండదేవర విగ్రహంముందు గుమికూడి వున్నారు



భిల్లవీరులందరూ. అశ్వాలను సిద్ధం చేసుకొని నల్లతాచు ఆజ్ఞలకోసం ఎదురుచూస్తున్నారు.

వారిని చూడగానే మాధవుడి చేతిని పట్టుకుని ఒక ఇంటి చాటుకు లాగాడు పింగళుడు. 'మాధవా! భిల్లవీరులందరూ వేటకు సిద్ధం అవుతున్నారు. మనం భైరవుడి అంతుచూసి ఆ నగలను వశపరుచుకోవటానికి యిదే మంచి అవకాశం' అన్నాడు రహస్యంగా.

వేటకు పోదామని వువ్విళ్ళూరుతున్న మాధవుడు ఆ మాటను వినగానే వేటమాటను మరిచిపోయాడు.

'ఈతను అభ్యసిస్తున్న సమయంలో నీ పాదానికి దెబ్బ తగిలిందని నల్లతాచుకు చెపుతాను. ఆ సాకును అడ్డం పెట్టుకొని నువ్వు గూడెంలోనే వుండిపోతావ్. మాతో పాటు వేటకు వస్తాడు భైరవుడు. నగల మూటను నల్లతాచు యింట్లోనే దాచాడతను. అదనుచూసి దాన్ని చేజిక్కించుకో' తన పథకాన్ని వివరించాడు పింగళుడు.

'మరి ఆ భైరవుడు వేటకు రాకుండా యిక్కడే వుంటే?' ఆలోచించాడు పింగళుడు. మాధవుడి మాటలోని యదార్థం అతనికి అవగతమైంది.

"నిజమే మాధవా! వాడు వట్టిజలగ. పట్టుకోక ముందే పది అడుగుల దూరం పారిపోతాడు. నువ్వు అన్నట్లుగానే వేటకు రాకుండా దుమ్మా కొట్టవచ్చు. అలా జరిగే పక్షంలో మన పథకాన్ని కొంచెం మార్చుకోవాలి' అంటూ తీవ్రంగా ఆలోచించటం ప్రారంభించాడు.

అతని ఆలోచనలు ఒక కొలిక్కి రాకముందే అటుగా వచ్చాడు నల్లతాచు. అతన్ని గమనించగానే బాధగా

నొసలు విరిచి కుడిపాదాన్ని ఎత్తి ఎత్తి వేయటం ప్రారంభించాడు మాధవుడు.

'పింగళా! ఏమయింది గండుచీమకు ?' ఆందోళనగా అడిగాడు నల్లతాచు.

నదిలో జరిగిన ప్రమాదాన్ని నేర్పుగా వివరించాడు పింగళుడు. అతని కథ అంతం కాకముందే చప్పట్లు చరిచి తన అనుచరులను పిలిచాడు నల్లతాచు. మంత్రగాడు భూతాలరాయుణ్ని పిలుచుకు రమ్మని ఆజ్ఞ యిచ్చి మాధవుణ్ని ఎత్తి భుజాలమీద వేసుకున్నాడు.

కబురు అందిన మరుక్షణం పరుగు పరుగున వచ్చాడు భూతాలరాయుడు. 'మరేం ఫరవాలేదు. వేడినీటితో కాపడం పెట్టండి. రక్కెస పూవుల్ని నలిపి పాదాలకేసి అంటగట్టండి. నేను నా మంత్రశక్తులకు బలులు యిచ్చి ఈ దెబ్బ తగలటానికి కారణభూతాలయిన క్షుద్రశక్తుల పీచమణుస్తాను' అంటూ నల్లతాచువైపు తిరిగాడు.

ఒకరివంక ఒకరు చూసుకొని వస్తున్న నవ్వును అతి ప్రయత్నంమీద బిగపట్టుకున్నారు మాధవ పింగళులు.

'నల్లతాచూ! ఈ రోజు మన అతిథులందరికీ యిటువంటి దెబ్బలే తగులుతున్నాయి. మన స్నేహితుడు భైరవుడు కూడా గాయపడిన పాదంతో నా చెంతకు వచ్చి మంత్రం వేయించుకున్నాడు' గంభీరంగా అన్నాడు భూతాలరాయుడు.

మాధవుడి ముఖంమీద మందహాసం మటుమాయమైపోయింది. పింగళుడి వదనం ఆలోచనలతో మరింత గంభీరంగా తయారైంది.

అనుకున్నంతా జరిగింది. భైరవుడు తమకంటే రెండు అడుగులు ముందే వున్నాడు!



ఆలోచించుకొని ఒక నిర్ణయానికి వచ్చే అవకాశం మాధవ పింగళులకు లభించలేదు. భూతాలరాయుడు చెప్పిన మాటలను అక్షరాలా ఆచరణలో పెట్టమని భార్యకు ఆదేశాలు యిచ్చి బయలుదేరాడు నల్లతాచు. అతనితోపాటు కదలక తప్పలేదు పింగళుడికి.

భిల్లవీరులు పొలిమేరలు దాటిన మరుక్షణం గండుచీమను పరామర్శించటానికి వచ్చారు గూడెపు స్త్రీ జనం. అనునయ వాక్యాలతో అతన్ని విసిగించి వేధిస్తూ సూర్యుడు పడమటి దిక్కుకు మరలేదాకా అక్కడే గడిపారు.

క్షణం ఒక యుగంగా గడుపుతున్నాడు మాధవుడు. నగలమూటను దాచిన ప్రదేశం అతను పడుకొనివున్న చోటుకి నాలుగు అంగల దూరంలోనే వుంది.

చీకటి పడబోతున్న సమయంలోగాని అతను ఎదురుచూస్తున్న అవకాశం లభించలేదు. ఒకరొకరుగా వెళ్ళిపోయారు భిల్లకాంతలందరూ. ప్రక్కయింటి పడుచుతో కబుర్లు చెబుతూ బయటికి వెళ్ళింది నల్లతాచు భార్య.

వెంటనే లేచి నిలబడ్డాడు మాధవుడు.

వేగంగా కొట్టుకోవటం ప్రారంభించాయి అతని గుండెలు. కరచరణాలు కంపించటం మొదలుపెట్టాయి. నగలను తీస్తుండగా నల్లతాచు భార్య వస్తుందేమో!!!

జారిపోతున్న ధైర్యాన్ని కూడగట్టుకుంటూ రెండు అడుగులు ముందుకు వేశాడు. మూడవ అడుగు వేయబోతుండగా యింటి బయట అలికిడి అయింది.

చటుక్కున వెనుతిరిగి తన పడకమీదికి దుమికాడు

మాధవుడు. కళ్ళకు చేతులు అడ్డం పెట్టుకొని గాఢ నిద్రను అభినయించటం మొదలుపెట్టాడు.

అడుగులో అడుగువేస్తూ ద్వారం దగ్గరికి వచ్చిన భైరవుడిని చూడగానే అతని శరీరం జలదరించింది: ఎటువంటి ప్రమాదంనుంచి బయటపడటం జరిగిందో గ్రహించేసరికి శరీరమంతా స్వేదంతో తడిసిపోయింది.

రెండుక్షణాలపాటు మాధవుడివంకే చూసి వెళ్ళిపోయాడు భైరవుడు. మరో రెండుక్షణాలు ఆగి పడకమీదినుంచి లేచి నిలబడ్డాడు మాధవుడు. రెండు అంగల్లోపోయి నగల మూటను నేలమీదికి లాగాడు. మరో వస్త్రాన్ని అందుకుని వాటన్నిటినీ యింకో మూట కడదామనే ఆలోచన కలిగింది అతనికి. కాని ఆపని చేస్తుండగా మరెవ్వరైనా రావచ్చు. చేసే పని ఏదో గూడేనికి దూరంలోనే చేయటం మంచిది.

క్షణం కూడా ఆలస్యం చేయకుండా మూటను భుజాన వేసుకొని వీధిలోకి వచ్చాడు. ఇళ్ళను చాటుచేసుకొని ఎవరి కంటా పడకుండా, నది వడ్డున వున్న పొదలవైపు పరుగు తీశాడు. దట్టంగా పెరిగివున్న ఒక రక్కిస పొదచాటున మూటను నేలకు దించి, బొడ్లోవున్న కైజారును బయటికి తీస్తుండగా—

తెరలు తెరలుగా వినవచ్చింది ఒక నవ్వు.

జల్లుమన్నది మాధవుడి శరీరం.

భైరవుడి కంఠం అది. ఎక్కడినుంచి వినిపించినా తేలికగా గుర్తుపట్టవచ్చు ఆ వికృత శబ్దాన్ని!

మాధవుడి వులికిపాటును పసికట్టినట్లు మరోసారి వినవచ్చిందా వికృతహాసం. గగుర్పొడిచింది మాధవుడి దేహం.



కైజారును బిగించి పట్టుకుంటూ వెనుతిరిగి చూశాడు. భైరవుడు కనిపించలేదుగాని, రక్కిస పొదకు ఆవలి ప్రక్కన ఎవరో నిలబడివున్నట్లు అనిపించింది.

నిశబ్దంగా ముందుకు జరిగి, కళ్ళు చిట్లించుకు చూశాడు మాధవుడు.

'నవ్వకు భైరవా ఇది నవ్వులాటలకు సమయం కాదు. గండు చీమను చంపందే మా దొర భల్లూకరాయుడి ఆత్మ శాంతిని పొందదు. మా సైన్యాలన్నీ సిద్ధంగా వున్నాయి. నువ్వు సైగచేసిన మరుక్షణం వచ్చి భిల్లగూడేన్ని నేలమట్టం చేస్తాయి' పొద ప్రక్కన నిలబడివున్న భైరవుడితో అంటున్నాడు ఒక కోయవీరుడు.

'భిల్ల వీరులందరూ వేటకుపోయారు. వేటాడిన జంతువుల్ని తీసుకొని వారు గూడేనికి వచ్చేసరికి తెల్లవారుతుంది. కదలలేని వృద్ధులు, ఎందుకూ పనికిరాని భిల్లకాంతలు తప్ప వీరుడనేవాడు యిప్పుడు గూడెంలో లేడు. ఇంతకంటే మంచి అవకాశం మీకు మరొకటి లభించటం అసంభవం' వినోదంగా నవ్వుతూ చెప్పాడు భైరవుడు.

'మరి గండుచీమ! గండుచీమ ఎక్కడ వున్నాడు?'

'నల్లతాచు యింట్లో నిద్రపోతున్నాడు.'

'అయితే యిక ఆలస్యం అనవసరం. మావాళ్ళని పిలుచుకొస్తాను' అంటూ మెరుపులా వెనుతిరిగి పొదలలోకి పరుగు తీశాడు ఆ కోయవీరుడు.

కొరడాపెట్టి కొట్టబడినట్లు వులిక్కిపడ్డాడు మాధవుడు. తను విన్న మాటలను మననం చేసుకునేసరికి అతనిగొంతు

ఎండుకుపోయింది. కోయ సైన్యం గూడెంమీదికి వచ్చేస్తోంది! అడ్డుకోవటానికి భిల్లవీరులెవరూ అక్కడ లేరు.

నగల మూటను దాచిపెట్టాలనే విషయాన్ని మరిచిపోయి మూటతో సహా గూడెంలోకి పరుగు తీశాడు. కొండ దేవర విగ్రహం ముందువున్నది ఒక పెద్ద యుద్ధభేరీ. దాని ప్రక్కనే నిలబెట్టివున్న బరిశెను అందుకొని బలంకొద్దీ ఆ భేరీమీద చరిచాడు.

ఉరుము వురిమినట్లు అయింది. దిక్కులు పిక్కటిల్లుతున్నట్లు అనిపించింది.

'ఏమిటి? ఏమయింది?' అంటూ గుడిశెలలోనుంచి బయటికి పరిగెత్తుకు వచ్చారు వేటకు పోలేక యిళ్ళల్లోనే వుండిపోయిన వృద్ధ భిల్లులందరూ.

'కోయలు గూడెంమీదికి వస్తున్నారు! అందుకోండి మీ ఆయుధాల్ని!!' భేరీని మ్రోగించటం మానకుండా బిగ్గరిగా అరిచాడు మాధవుడు.

నివ్వెరబోయి ఒకరి ముఖాలు ఒకరు చూచుకున్నారు వారందరూ. వారిని ఆవరించుకున్న స్తబ్దత తొలగిపోక ముందే పొలిమేరల్లో ప్రత్యక్షమయింది కోయ సైన్యం.

*　　　*　　　*

తళ తళ మెరుస్తున్న గండ్ర గొడ్డళ్ళను గాలిలో వూపుతూ, అశ్వాలను అతివేగంగా పరుగులు తీయిస్తూ కన్నుమూసి కన్ను తెరిచేటంతలో వచ్చి గూడెంమీదపడ్డారు కోయలు.

వెంట తెచ్చిన కాగడాలను గుడిశెలమీదికి విసరటం ప్రారంభించారు కొందరు. కనిపించిన భిల్ల కాంతలను



కొప్పులు పట్టుకొని అశ్వాలమీదికి లాగటం మొదలుపెట్టారు మరికొందరు. ముందున్న వీరులు ముక్కుకు సూటిగా వచ్చి నిశ్చేష్టులై నిలబడివున్న వృద్ధ భిల్లులమీద కలబడ్డారు.

చూస్తుండగానే తెగి నేలనపడ్డాయి పది తలలు. భిల్లుల ఆక్రందనాలు ఆకాశాన్ని అంటుకోవటం ప్రారంభించాయి.

మాధవుడి కళ్ళముందు ఎర్రటి మెరుపులు ప్రత్యక్షం అయ్యాయి. పళ్ళుకొరుకుతూ చేతిలోని బరిశెను ఎత్తి ఒక కోయవీరుడి గుండెలకేసి విసిరాడు.

కెవ్వున అరిచి అశ్వంమీదినుంచి క్రిందికి దొర్లాడా వీరుడు.

'అడుగడుగో గండుచీమ! అతనే మన దొరను పట్టుబెట్టిన బుడతడు' బిగ్గరిగా అరిచాడు మాధవుడిని గుర్తించిన కోయవీరుడొకడు.

గిర్రున వెనుతిరిగి కొండదేవర పాదాలచెంతకు పరుగు తీశాడు మాధవుడు. ఎత్తుగా కట్టివున్న బలిపీఠంమీద నిలబెట్టివుంది పదునైన ఒక వేటకత్తి. పవిత్రమైన ఆ ఖడ్గాన్ని కొండదేవరకు ప్రతిరూపంగా భావిస్తారు భిల్లులు.

వళ్ళుతెలియని ఆవేశంతో దాన్ని అందుకొని, తనను చుట్టుముడుతున్న కోయలమీద విరుచుకుపడ్డాడు మాధవుడు.

తాటిపళ్ళు పడినట్లు తెగి నేలమీద పడసాగాయి తలలు. తెగించి ముందుకు వచ్చిన కోయలు ఎవరూ ప్రాణాలతో తిరిగి పోవటంలేదు వెనక్కు.

'వేలెడుకూడా లేని ఒక కుర్రవాడిని చంపటానికి ఇంత మంది మరణించటమా? చూస్తారేం? కోయలుకాదా మీరు?' వెర్రిగా అరిచాడు ఒక కోయదొర.

అడ్డువచ్చిన యిద్దర్ని నిలువునా నరికి అతనిమీదికి లంఘించాడు మాధవుడు. మొదటి వ్రేటుకు కోయదొర అశ్వం తలను కోల్పోయింది. రెండవ దెబ్బకు అతని చేతిలోని గండ్రగొడ్డలి ఎగిరి అవల పడిపోయింది.

గుడిసెల్ని తగలబెడుతున్నవారు, భిల్ల కాంతల్ని చెరబట్టి గూడేన్ని కొల్లగొడుతున్నవారు అందరూ అది గమనించి, ఒకేసారి వచ్చిపడారు మాధవుడిమీదికి.

ప్రాణాలమీద ఆశను వదలుకున్నాడు మాధవుడు. మహా భైరవుడి నగలను తిరిగి తీసుకుపోగలననే నమ్మకం అతని హృదయంనుంచి తొలగిపోయింది. అన్నంపెట్టి ఆశ్రయం యిచ్చిన భిల్లులకు అన్యాయం జరుగుతున్నది. తనకంఠంలో ప్రాణాలు వున్నంతవరకూ ఆ అన్యాయాన్ని ఎదుర్కోవాలి.

మెరుపుకంటె వేగంగా కదులుతున్నది అతని చేతిలోని వేటకత్తి. విసురుకు నలుగురు చొప్పున నేలకూలుతున్నారు కోయలు.

అరుపులతో, ఆర్తనాదాలతో అశ్వాల సకిలింతలలో, గుడిసెల్ని కబళిస్తున్న అగ్నిదేవుడి పెటపెటార్భాటాలతో దద్దరిల్లిపోతున్నాయి దిక్కులు.

'చంపండి! చంపండి!!' అని అరుస్తున్న ఒక కోయ వీరుడు ఎందుకో అనుమానం వచ్చి పొలిమేరల వైపు చూశాడు.

అశ్వమేఘాల మీద వస్తున్నది భిల్లసైన్యం. వారి అశ్వాల పదఘట్టనలతో దడదడ లాడిపోతున్నది భూమి.

'భిల్ల వీరులు వస్తున్నారోయ్!!' అని అరిచి తన అశ్వాన్ని మరో దిశకు పరుగులు తీయించాడా వీరుడు.



పది అడుగుల దూరంకూడా పోకముందే, పాశుపతాస్త్రంలా వచ్చి అతని వెన్నులో దిగబడింది మూడుమూరల పొడుగున్న భిల్లుల యుద్ధబాణం ఒకటి.

ఆ బాణాన్ని అనుసరించి వచ్చేశారు భిల్లులు. కోయలను చుట్టుముట్టి కత్తతీరా వూచకోత కోయటం ప్రారంభించారు.

గండ్ర గొడ్డలిని గిరగిరా తిప్పుతూ కోయల మధ్య చిందులు వేస్తున్న నల్లతాచును వదిలి మాధవుడికోసం అన్వేషించసాగాడు పింగళుడు. కదం తొక్కుతున్నది అతని కాలాశ్వం. అడ్డుపడిన కోయల శిరస్సులను ముంగాళ్ళతో వ్రయ్యలు చేస్తూ దాట్లు కొడుతోంది.

గుడిసెల్ని చల్లార్చాలనే కోరికతో ప్రక్కకు తిరిగిన కొందరు భిల్ల వీరులు-చేతికి అందిన రాళ్లు రప్పలను తీసుకొని కోయలమీదికి విసురుతున్న తమ కులకాంతలను చూసి నిర్విణ్ణులై పోయారు.

తగలబడుతున్న యిళ్ళలోని తట్టాబుట్టల్ని భద్రబరుచుకునే ప్రయత్నం వారెవరూ చేయటం లేదు.

'ఇళ్లుపోతే మళ్ళీ కట్టుకోవచ్చు....ముందు గండుచీమను యివతలకు లాగండి..కోయలతన్ని కబళించ చూస్తున్నారు..' గురి తప్పకుండా రాళ్ళను విసురుతున్న నల్లతాచు భార్య భిల్ల వీరుల్ని హెచ్చరించింది.

ఆ మాటతో భిల్లుల ఆవేశం మరోమెట్టు పైకి ఎక్కింది. వారి ధాటికి తట్టుకోవటం కోయలకు అసాధ్యం అయిపోయింది. ఉన్నట్టుండి మాయమై పోయారు వారందరూ.

'మాధవా! మాధవా!!' అని పిలుస్తూ గూడెమంతా కలియ తిరుగుతున్నాడు పింగళుడు. క్రిందపడిన కోయలను కాళ్ళతో మర్దిస్తూ గండుచీమను అన్వేషిస్తున్నాడు నల్లతాచు.

కొండదేవర విగ్రహం వెనుక వారికి కనిపించింది పెద్ద శవాలగుట్ట. అదురుతున్న గుండెలను చిక్కపట్టుకొని కాలాశ్వం మీదినుంచి క్రిందికి దూకాడు పింగళుడు. అతని కంటే ముందుపోయి ఆ శవాలను చెల్లాచెదరు చేశాడు నల్ల తాచు.

అట్టఅడుగున వారికి కనిపించాడు మాధవుడు. అతని చేతిలోని వేటకత్తి కోయదొర భల్లూకరాయుడికి తమ్ముడైన 'చురకత్తి' గుండెల్లో దిగబడి వున్నది.

*　　*　　*

చటుక్కున ముందుకు వంగి అతన్ని చేతుల్లోకి ఎత్తుకున్నాడు నల్ల తాచు.

'భూతాలరాయుణ్ని తీసుకురండి! అతను ఎక్కడున్నాడో వెతకండి' అని అరుస్తూ కొండదేవర విగ్రహం ముందుకు పరిగెత్తుకు వచ్చాడు.

నాలుగ్గా దూసుకుపోయారు భిల్లవీరులు. గూడెమంతా గాలించటం ప్రారంభించారు భూతాలరాయుడి కోసం.

పొలిమేరల్లో వున్న మర్రిచెట్టు క్రింద అగుపించాడతను. వారి అడుగుల చప్పుళ్ళను వినగానే 'రండిరోయ్....ముందు వీడి అంతు చూడండిరోయ్!!' అని అరిచాడు అతి బిగ్గరిగా.

కోయలు ఎవరైనా అతన్ని హతమార్చటానికి ప్రయత్నిస్తున్నారేమో నన్న అనుమానంతో పరుగు పరుగున అతన్ని సమీపించారు భిల్లవీరులు. కనిపించిన దృశ్యాన్ని చూడగానే వారి ఆశ్చర్యానికి హద్దులేకపోయింది.

మర్రిచెట్టు క్రింద ఒక బురదగుంట వున్నది. ఆ బురద గుంటలో పడి వున్నాడు భూతాలరాయుడు. అతనితోపాటు మరో వ్యక్తికూడా అందులో వున్నాడు.



అతన్ని బయటికి లాగి కాగడాల వెలుగులో ముఖాన్ని చూసిన భిల్లులు తమ కళ్ళను తామే నమ్మలేకపోయారు. తమకు స్నేహితుడని భిల్లులు భావిస్తున్న భైరవుడు అతను.

"వీడు గూడెంలోకి వచ్చినప్పుడే నాకు అనుమానం వచ్చింది. నల్ల తాచుకు చెప్పినా అతను వినిపించుకోలేదు... ఈరోజు మనకు పట్టబోయిన దుర్గతికి మూలకారకుడు వీడే. మన గండుచీమను చంపించటానికి కోయలను పిలిపించాడు....' అంటూ తలవంచుకొని నిలబడిన భైరవుడి పిర్రలమీద బలంగా తన్నాడు భూతాలరాయుడు.

*　　*　　*

భిల్లవీరుల మధ్య వస్తున్న భైరవుణ్ని చూడగానే పళ్ళు కొరుకుతూ తన గండ్రగొడ్డలిని అందుకున్నాడు నల్ల తాచు.

'నల్ల తాచూ....ఆగు....మా మాటను కొంచెం ఆలకించు....' అంటూ అతని దారికి అడ్డం వచ్చారు భిల్లకులపు పెద్దలు. రోష కషాయిత నేత్రుడైన నల్లతాచు ఆగలేదు. వారిని విదిలించికొట్టి గండ్రగొడ్డలిని బలంగా విసిరాడు భైరవుడి వైపు.

కీచుగా అరిచి వెనక్కు పడ్డాడు భైరవుడు. గండ్రగొడ్డలి వెంట్రుకవాసిలో అతని తలను తప్పించుకునిపోయి భూమిలో దిగబడింది.

ఒక్కగంతులో లేచి పరుగు అందుకున్నాడు భైరవుడు. 'పట్టుకోండి! ఆ కట్లపురుగును వదిలిపెట్టకండి....' భిల్ల గూడెం దద్దరిల్లిపోయేటట్లు అరిచాడు నల్లతాచు.

గొల్లుమంటూ లేచారు భిల్లులు. వారు భైరవుడిని సమీపించక ముందే ఎదురుచూడని విచిత్ర దృశ్యం ఒకటి వారికి ఎదురయింది.

నల్లతాచు యింటిముందు నిలబడివుంది పింగళుడి కాలాశ్వం. పిచ్చిగా అరుస్తూ పరుగులు తీస్తున్న భైరవుణ్ని చూసేసరికి పెద్దపులికంటె భీకరంగా బుసలుకొట్టిందది. రెక్కలు వచ్చినట్లు అమాంతం గాలిలోకి ఎగిరి, భైరవుడి మీద పడింది ఒక్క దుముకులో.

అలనాడు చెంగలువపుర్రి సత్రంలో అతను మత్తును కలిగించే ఆకుల్ని వాసన చూపించినప్పటినుంచీ పగబట్టి వున్నదది. పింగళుడు అడ్డుపడుతూ వుండటంవల్ల దానికి సరియైన అవకాశం లభించలేదు.

మృత్యుదేవత వాహనంలా మీదికి వస్తున్న కాలాశ్వాన్ని గమనించి మరింత భయభ్రాంతుడైనాడు భైరవుడు. వజ్రాయుధాలవంటి దాని గిట్టలు అతని తలమీద తగిలాయి. కళ్ళముందు నక్షత్రాలు ప్రత్యక్షం అవుతుండగా విరుచుకు పడిపోయాడతను. వెంటనే అతని శరీరం మీదికి లంఘించి విపరీతమైన ఆవేశంతో చిందులు త్రొక్కటం ప్రారంభించింది కాలాశ్వం. రెండు క్షణాల్లో అయిపోయింది భైరవుడి పని. మాంసపు ముద్దగా మారినా అతన్ని వదిలిపెట్టని కాలాశ్వపు కోపాన్ని గమనించి నిశ్చేష్టులైపోయారు భిల్లులు.

'పింగళుణ్ని పిలవండి....అతను తప్ప మరెవ్వడూ దాన్ని శాంతింప చేయలేరు. చూడండి అతనెక్కడున్నాడో' అరిచాడు ఒక భిల్లగూడెపు కులపెద్ద.

'పింగళా!' అని పిలుస్తూ అన్వేషణ ప్రారంభించారు కొందరు భిల్లులు. గూడెమంతా వెతికినా అతను కనిపించలేదు వారికి.



అతనే కాదు—యుద్ధంలో స్వల్పంగా గాయపడిన మాధవుడు—ఆతని గాయాలకు కట్లు కట్టటానికి వచ్చిన భూతాలరాయుడు కూడా ఆ భిల్లవీరులకు అగుపించలేదు.

గప్పుమని గూడెమంతా వ్యాపించిందా వార్త.

'వెళ్ళండి....పొలిమేరల నన్నింటినీ గాలించండి....' అని అజ్ఞలు జారీచేశాడు నల్లతాచు.

మహాభైరవుడి ఆభరణాల మూటను మాధవుడు యుద్ధభేరీవద్ద వదిలేశాడనీ, యుద్ధం తీవ్రరూపాన్ని ధరిస్తున్న సమయంలో ఒక కోయవీరుడు ఆ నగలమూటను చేజిక్కించుకోవటం భూతాలరాయుడి కంటపడిందనీ, కోయవీరులతో పాటు వారి గూడేన్ని చేరుకున్న నగల మూట కోసం మాధవ పింగళులు భూతాలరాయుడిని తోడు తీసుకొని కోయగూడెం వైపు ప్రయాణిస్తున్నారనీ—భిల్లవీరుల కెవర్కీ తెలియదు. అసలు విషయాన్ని అర్థంచేసుకోకుండా, పొలిమేరలను గాలించి, అరణ్యాన్ని తిరగదోడి—ప్రయోజనం ఏముంది??

* * *

'అదే పింగళా! కోయల గూడెం!! కాపలా ఎంత కట్టుదిట్టంగా వున్నదో చూశావా?' చెట్ల చాటునుంచి కనిపిస్తున్న గూడేన్ని చూపిస్తూ అన్నాడు భూతాలరాయుడు.

ఎత్తైన పర్వతాల మధ్యవున్నదది. లోపలకు పోవటానికి ఒకే ఒక మార్గం వుంది. దాని ముందు నలుగురు కోయవీరులు కాపలా నిలబడి వున్నారు. నలుగురే కదా అని ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా—కొండ శిఖరాలమీద కూర్చుని వున్న కోయవీరులందరూ కట్టకట్టుకొని వచ్చిపడతారు.

'చీకటిపడేదాకా మనం ఏమీ చేయటానికి వీలులేదు.

అంతవరకూ విశ్రాంతి తీసుకోవటంలో తప్పులేదు' అంటూ తమ అశ్వాన్ని ఒక పొదచాటున వదిలి, చిన్న చెట్టుక్రింద చతికిలపడ్డారు భూతాలరాయుడు.

మాధవ పింగళులు-కోయగూడేన్ని మరికొంచెం జాగ్రత్తగా పరిశీలించాలని ముందుకు పోబోతుండగా — వాళ్ళని చూశాయి రెండు తోడేళ్ళు.

సామాన్యమైనవి కావవి. ఒక్కొక్కటీ నాలుగుమూరల ఎత్తున్నాయి.

'పింగళా! కొట్టండి!! పడగొట్టండి వాటిని!! ఆందోళనాపూరితమైన భూతాలరాయుడి కంఠం - మాధవ పింగళుల వెన్నుతట్టి హెచ్చరించింది.

మెరుపుల్లా భుజాలకు వ్రేలాడుతున్న బరిశెల్ని బలంగా విసిరారు వారిద్దరూ. పొదలను దాటి, గూడెం ముందున్న ఖాళీ స్థలంలో అడుగు పెట్టబోతున్న తోడేళ్ళు కీచుగా అరిచి తలక్రిందులైనాయి.

వాటి అరుపును వినగానే పింగళుడి అనుమానం మరింత బలపడింది. తోడేళ్ళ తోకల్ని పట్టుకొని గుంజగానే అది యదార్థమయింది.

తోడేళ్ళ తోళ్ళు కప్పుకొని జంతువుల మాదిరి సంచరిస్తున్నారు యిద్దరు కోయ యువకులు. శత్రువులు ఎవరైనా వచ్చి గూడేన్ని ముట్టడించకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

'పింగళా! కొండదేవరకు మనమీద అనుగ్రహం కలిగినట్లుంది....గూడెంలో ప్రవేశించటానికి మంచి మార్గం



దొరికింది....' తోడేలుతోలు నొకదాన్ని మీద కప్పుకుంటూ అన్నాడు భూతాలరాయుడు.

అప్పటికి చీకట్లు ఆ ప్రదేశాన్ని చుట్టుముట్టాయి. రెండవ తోడేలుగా మారిన పింగళుడు. మాధవుడిని తన వెనుకగా రమ్మని చెప్పి, ముందుపోతున్న భూతాలరాయుడిని అనుసరించాడు.

'ఏరా! యింత ఆలస్యం అయిందేమిటి?' భూతాలరాయుణ్ని తమ మనిషిగా భావించి ప్రశ్నించాడు గూడెం ముందు కాపలావున్న కోయవీరుడొకడు.

సమాధానంగా ఏదో గొణిగి మరికొంచెం ముందుకు పోయాడు భూతాలరాయుడు. 'ఆగరా! చెప్పేదేదో గట్టిగా చెప్పక, అలా గొణుగుతావేమిటి!!' అంటూ అతని దారికి అడ్డుపోయాడా వీరుడు. మరుక్షణం సర్రున తన కత్తిని దూసి ఆ కోయవీరుడి తలను ఛేదించాడు పింగళుడు. మరో వీరుడిమీదికి లంఘించాడు, మాధవుడు. మిగిలిన యిద్దరినీ భూతాలరాయుడు-పింగళుడు చెరిసగంగా పంచుకున్నారు.

కన్నుమూసి కన్ను తెరిచేటంతలో జరిగిపోయిన ఆ విధ్వంసకాండ, కొండలమీది కోయలకు కనిపించటంగాని-వినిపించటంగాని జరగనేలేదు. చీకటిని చాటు చేసుకొని గూడెం మధ్యలోకిపోయిన భూతాలరాయుడు-కొండదేవర విగ్రహం ముందు గుమికూడివున్న కోయలను చూసి ఒక గుడిశె చాటున ఆగాడు.

'భిల్లులమీద పగ తీర్చుకోవటానికి పథకం వేస్తున్నారు. వాళ్ళ ఆలోచనలు పూర్తికాకముందే మనపని పూర్తికావాలి' అంటూ అక్కడ సమావేశమైన కోయవీరుల వందర్నీ

జాగ్రత్తగా పరిశీలించాడు. ముందు వరుసలో వున్నకోయ వీరుడిని చూడగానే చిన్న మందహాసం ప్రత్యక్షమయింది- అతని ముఖంమీద.

'పింగళా! మా మంత్ర ప్రయోగాలను నువ్వు ఎప్పుడైనా చూశావా? చూడకపోతే యిప్పుడు చూడు....' అంటూ నేలమీది మట్టిని తీసి మంత్రించి గాలిలోకి వూదాడు. వింతగా చూశారు మాధవ పింగళులు. మూడుక్షణాల తరువాత రెండు చేతులతో పొట్టను నొక్కుకొంటూ లేచి నిలబడిన కోయవీరుడు వారికి కనిపించాడు.

కడుపునొప్పితో మెలికలు తిరిగిపోతున్నాడతను. అక్కడ వుండలేక పెద్దల అనుమతి తీసుకొని తన గుడిశె వైపు పరుగుతీశాడు.

'పింగళా! చూస్తావేం?' భూతాలరాయుడు గద్దించేసరికి వులిక్కిపడి ఆ వీరుడిని అనుసరించాడు పింగళుడు.

గూడెం చివరగావున్న ఒక గుడిసెలోకి పోయాడతను. ఒక మూలగావున్న చర్మపు దొంతరలమీది మహాభైరవుడి నగలమూటను చూడగానే వుప్పొంగింది పింగళుడి వెనుకగా ఆ గుడిశెలోకి తొంగి చూసిన మాధవుడి శరీరం.

'ఎవరు? ఎవరు మీరు?' బాధగా మూలుగుతూ వెను తిరిగాడా కోయవీరుడు. ద్వారంలో కనిపించిన ఆకారాలను చూసి కెవ్వున అరిచాడు. అరుపు అతని నోటినుంచి బయటికి వెలువడకముందే శాశ్వతంగా అతని నోటిని మూసేశాడు పింగళుడు. రెండు అంగల్లోపోయి నగలమూటను అందుకున్నాడు మాధవుడు. అంతే!



ఆ మరుక్షణం-అంతవరకూ వారికి తోడుగా నిలిచిన అదృష్టదేవత ఆఖరి నిమిషంలో ముఖం చాటుచేసింది.

"పింగళా! మనం త్వరగా వెళ్ళిపోవాలి....కోయలు మన ఆగమనాన్ని పసికట్టినట్లు అనుమానంగా వుంది" అన్నాడు భూతాలరాయుడు. అంటుండగానే అక్కడ ప్రత్యక్షమయ్యారు పదిమంది కోయలు.

'గండుచీమ! రేయ్!! గండు చీమ మన గూడెంలో జొరబడ్డాడు....' మాధవుడిని చూడగానే గుర్తించి తమ ఆయుధాలను ఎత్తారు.

గాలికంటె వేగంగా పోయి ఒక వీరుడి గుండెల్లో దిగబడింది పింగళుడి చేతిలోని కత్తి. గొల్లున అరిచారు మిగతావారందరూ. ఒక్కసారిగా వచ్చి పింగళుడిమీద కలబడ్డారు.

'గండుచీమ!' అన్న అరుపులు గూడెంనిండా అలుముకున్నాయి. ఆదే సమయంలో గూడెపు ముందు భాగంలో జరిగిన ఘోరం అందరికీ తెలిసింది. చీమలదండులా కదిలారు కోయలు.

మీదికి దూకిన పదిమంది కోయలను తృటిలో మట్టుబెట్టి - చీకట్లలోకి పరుగుతీశారు మాధవ పింగళులు....అంతలోనే వారికి ఎదురైనారు మరికొంతమంది కోయలు.

"పింగళా! యిటురండి....యిటు....' అంటూ మరొక దిశకు దారితీశాడు భూతాలరాయుడు. శత్రువులు ఎంతోమంది లేరని కోయలకు తెలిసిపోయింది. వారి సింహనాదాలతో ప్రతిధ్వనించసాగాయి గూడెం చుట్టూవున్న పర్వతాలు....

సూటిగా గూడెం చివరి భాగానికి దారితీశాడు భూతాల రాయుడు.... పెద్ద మట్టి వేదిక ఒకటి కట్టబడివున్నదక్కడ. పెద్ద పెద్ద కాగడాలు దేదీప్యమానంగా వెలుగుతున్నాయి దాని ముందు. ఆ వేదికమీద బంధించబడివున్నాడు మహాకాయుడైన ఒక నాగరికుడు.

పత్తుగా పెరిగిన గడ్డం.... చిత్తుగా పెరబోసుకున్న తల —చింతనిప్పుల్లాంటి కళ్ళు, కండలు తిరిగిన శరీరంతో— చూడగానే భయం కలిగించేటట్లుంది అతని ఆకారం.

పది వరుసలు వేసిన చర్మపు త్రాళ్ళతో బంధించా రతన్ని. అతని బలం ముందు అవి ఎందుకూ పనికిరావనే అనిపిస్తోంది—

'పింగళా! మనం యిక్కడినుంచి బయటపడటానికి యిదొక్కటే మార్గం. కోయలు ముందుదారినీ మూశారు. వారిని చెల్లాచెదరు చేయాలంటే గుంటనక్క మంత్రశక్తికి బందీ అయిన యీ నాగరిక రాక్షసుణ్ని విడుదలచేసి తీరాలి.' తమను చుట్టుముడుతున్న కోయలను చూస్తూ ఆందోళనగా అన్నాడు భూతాలరాయుడు.

'ఎవరితను?' ఆశ్చర్యంగా అడిగాడు పింగళుడు.

'పది సంవత్సరాల క్రితం కొంతమంది అనుచరులతో అరణ్యంలోకి వచ్చాడితను. వేటకు వెళ్ళిన కోయలు వీరిని చూసి యుద్ధం చేశారు. ఇతని అనుచరులందరూ యుద్ధంలో సమసి పోయారు. ఇతన్ని మాత్రం ఏమీ చేయలేకపోయారుకోయలు. కక్షకట్టిన బ్రహ్మ రాక్షసుడిలా కోయగూడేల మీద విరుచుకు పడి నాలుగు గూడేలను నేలమట్టం చేసి యిక్కడికి వచ్చాడు యితను. ఈ గూడెపు మంత్రవాది అయిన గుంటనక్క



తెలివితేటల్లోనే కాదు—మంత్ర ప్రయోగాలలో కూడా మహా నేర్పరి. ఏనుగుల్ని పట్టుకునే పద్ధతులను అవలంబించి యితన్ని బంధింపించాడు. తన మంత్ర శక్తితో నిర్వీర్యుణ్ని చేసి యిక్కడ వుంచాడు. పన్నెండు సంవత్సరాల కొకసారి వచ్చే కొండదేవర కొలుపుల్లో యితన్ని బలి యిచ్చి మరిన్ని మంత్ర సిద్ధులను పొందాలని అతని సంకల్పం....' అంటూ కత్తిని ఎత్తి ఆ మహాశయుడి వైపు పరిగెత్తాడు భూతాల రాయుడు.

ఆ మరుక్షణమే మాధవ పింగళులమీద విరుచుకుపడ్డారు కోయలు. కత్తుల మోతలతో, వీరుల సింహనాదాలతో దద్దరిల్లసాగాయి గూడెం చుట్టూ వున్న పర్వతాలు.

మహాకాయుణ్ని సమీపించి, ఒక్క వేటుతో అతని బంధనాలను తెగకొట్టాడు భూతాలరాయుడు. నిర్జీవంగా నిలబడివున్న మహాకాయుడిలో చలనం వచ్చింది. 'హుం!' అని హుంకరించి కాళ్ళను పట్టి వుంచిన త్రాళ్ళను తెంచుకున్నాడు.

'బ్రహ్మరాక్షసుడు తప్పించుకున్నాడు. మంత్రవాది గుంటనక్కను పిలవండిరోయ్!' పెద్దగా అరిచారు కొందరు కోయలు. వారి అరుపులు మిగిలిన వారందరికీ అర్థంకాక ముందే—సుడిగాలిలా వారి మధ్యకు దూకాడా మహాకాయుడు. చేతికి దొరికినవారిని దొరికినట్లే ఎత్తి నేలకేసి కొడుతూ విజృంభించాడు.

అతని ముందుకు పోయిన కోయ ఎవరూ ప్రాణాలతో వెను తిరగటం లేదు. భూతాలరాయుడు అతన్ని గురించి చెప్పిన

విషయాలన్నీ అక్షర సత్యాలని గ్రహించటానికి మాధవ పింగళులకు ఎంతో సమయం అవసరం లేకపోయింది.

బిరుదుకు తగినట్లే బ్రహ్మరాక్షసుడిలా కోయలను పూచకోత కోస్తున్నాడా మహాకాయుడు.

'గుంటనక్కను....పిలవండి....గుంటనక్క....' అని అరుస్తూ చెల్లాచెదరై పోతున్న కోయలను చూసి పర్వతాలు పగిలిపోయేలా సింహనాదం చేశాడా మహాకాయుడు.

'మిత్రులారా! మీరు చేసిన సహాయం నేను నా జన్మలో మరిచి పోలేను....' అంటూ భూతాలరాయుడివంకా, మాధవ పింగళులవంకా చూశాడు.

ఒక్క క్షణం—ఒక్క క్షణం పాటు మాధవుడిమీదనే నిలిచాయి అతని చూపులు. ఏదో అనబోతుండగా—పెద్ద మంత్రదండాన్ని పట్టుకొని అక్కడ ప్రత్యక్షమయ్యాడు కోయల మంత్రవాది గుంటనక్క.

అతన్ని చూడగానే ఆవేశంతో వణికిపోయాడా మహాకాయుడు. బొబ్బలుపెడుతూ పోయి అతని గుండెలమీద తన్నాడు. కెవ్వున అరిచి గాలిలోకి ఎగిరాడు గుంటనక్క. గింగిరాలు తిరుగుతూపోయి పాతిక ధనువులు అవతలగా పడ్డాడు. కక్షతీరక మరోసారి అతనిమీదికి లంఘించాడు మహాకాయుడు.

ఆదరాబాదరాగా లేచి—ఒక్కసారిగా పరుగు అందుకున్నాడు గుంటనక్క. 'ఆగు....ఆగరా!!' అని అరుస్తూ అతన్ని వెంబడించాడు మహాకాయుడు.

అంతవరకే చూడగలిగారు మాధవ పింగళులు. వారిని చుట్టుముట్టివున్న కోయలు రెట్టించిన పట్టుదలతో



పోరాటం ప్రారంభించేసరికి, కన్ను కదిలించే అవకాశం కూడా వారికి లభించలేదు. క్షణ క్షణానికి కోయల బలగం ఎక్కువ అవుతున్నది....మాధవ పింగళుల పరిస్థితి ప్రమాద స్థాయిని చేరుకోబోతున్నది....

* * *

కోయగూడెం ముందు నిలబడి పెద్దగా సకిలించింది కాలాశ్వం. పింగళుడి జాడలను అనుసరించి వస్తున్నదది. గూడెంలో జరుగుతున్న ఘోర యుద్ధాన్ని గమనించి క్షణ కాలం—ఎక్కడిదక్కడే ఆగిపోయింది.

అదే సమయంలో దాని చెవికి చేరింది ఒక సింహనాదం. ఎంతదూరంనుంచి వినిపించినా పింగళుడి కంఠాన్ని గుర్తు పట్టగలదా జాతి గుర్రం. విన్న మరుక్షణం—గూడెంలో జొరబడింది.

అంతవరకూ దాన్ని దూరదూరంగా అనుసరించి వస్తున్న భిల్ల సైన్యాలు సందిగ్ధ పరిస్థితిలో చిక్కుపడ్డాయి. 'చూస్తారేం? పదండి' .. గర్జించాడు నల్లతాచు. వెంటనే ముందుకు దూకారు భిల్లవీరులు. కనిపించిన కోయను కనిపించినట్లే నరికి ముక్కలు చేస్తూ—గూడెపు మధ్యభాగంలోకి వెళ్ళారు.

ప్రాణాలమీద ఆశలను వదులుకుని పోరాటం సాగిస్తున్నారు భూతాలరాయుడు-మాధవ పింగళులు....సింహనాదాలు చేస్తూ వచ్చి పడిన భిల్ల వీరులను చూడగానే మరింతగా విజృంభించారు.

'పింగళా! గండుచీమ చేయి పట్టుకో!! అరణ్యంలోవున్న కోయ గూడేలన్నీ యిక్కడికి రాకముందే మనం దాటు

కోవటం చాలా మంచిది....' కాలాశ్వాన్ని అధిరోహిస్తున్న పింగళుణ్ని హెచ్చరించాడు నల్లతాచు.

వెంటనే అతని మాటల్ని ఆచరణలో పెట్టాడు పింగళుడు....జరుగుతున్నదేమిటో కోయలకు తెలిసేలోపు గానే గూడెం దాటి అరణ్యంలోకి పరుగు తీశారు—భిల్ల వీరులు. భూతాలరాయుడు విడిపించిన మహాకాయుడు ఏమైనాడో వారికి తెలియలేదు.

* * *

ప్రకీర్తి పట్టణంలో బుద్ధదరాయుడి భవంతి అది—

సూర్యోదయమై రెండు ఘడియలు గతించినా శయన మందిరంనుంచి బయటకు రాలేదు రాజప్రతినిధి బుద్ధద రాయుడు. అమాత్య పదవిని స్వీకరించిన వీరవర్మ—మరి కొందరు పుర ప్రముఖులతో అతని దర్శనం కోసం వేచి యున్నాడు.

'వీరవర్మా! ఇంకెంతసేపు యిలా పడిగాపులు పడి వుండాలి?' విసుగ్గా అన్నాడొక పురప్రముఖుడు.

కోరగా చూశాడు వీరవర్మ. 'మొదటిసారి కాబట్టి మీ తప్పును మన్నిస్తున్నాం. ఇకముందు రాజోద్యోగులను తక్కువచేసి మాటాడారంటే శిక్షార్హులు అవుతారు' అన్నాడు అధికారపూర్వకమైన కంఠస్వరంతో.

సిగ్గుతో కమిలిపోయింది ఆ ప్రముఖుని ముఖం.

అదే సమయంలో హడావుడిగా అక్కడకు పరిగెత్తుకు వచ్చాడొక రాజభటుడు.

'ప్రభూ! ప్రమాదం ముంచుకు వస్తోంది. వెంటనే జాగ్రత్త పడకపోతే ప్రాణాలే కోల్పోవాల్సి వస్తుంది' అన్నాడు వీర వర్మకు మాత్రమే వినిపించేటట్లు.



తన పులికిపాటును నేర్పుగా కప్పిపుచ్చుకొని అతన్ని మరో మందిరంలోకి తీసుకుపోయాడు వీరవర్మ.

'కార్తికేయుడి కుటుంబానికి వాటిల్లిన దురవస్థ ప్రపంచాని కంతటికీ తెలిసిపోయింది. కాంచనదేశపు సర్వ సైన్యాధిపతి సింహకేతుడు తన దళపతుల నందర్నీ వెంటబెట్టుకొని వస్తున్నాడు. అభిరామపురి వణిక్ సార్వభౌములు, కార్తి కేయుల వారికి ఆప్తమిత్రులు అయిన రఘురామ వినయ దత్తులు తమ అంగరక్షక దళాలన్నిటితోను తరలి వస్తు న్నారు. కళింగదేశపు వీరుడు నభూతవర్మ కార్తికేయులవారి శిష్యుడు. తన బంధు మిత్రులనందర్నీ తీసుకొని వేగవంతము లైన అశ్వాలమీద ప్రయాణిస్తూ వస్తున్నాడు. ప్రభూ! వీరందర్నీ మించినవారు కార్తికేయులవారి బావమరుదులు. తమ చెల్లెలికి జరిగిన అన్యాయాన్ని విని రోషకషాయిత నేత్రులై మధ్యందిన మార్తాండ మూర్తులవలె నిప్పుల్ని క్రక్కుతూ బయలుదేరారట: రాజ్య తంత్రాలను కుడిఎడమ లకు మెలిపెట్టటంలో వారిని మించినవారు ఎవరూ లేరని వదంతి. వారు వేలెత్తి చూపిస్తే కాదని అనే ధైర్యం కాంచనపుర ప్రధాన మంత్రికి కూడా లేదని అంటారు ...' తాను సేకరించుకొని వచ్చిన వార్తలను వీరవర్మకు వినిపిం చాడు ఆ రాజభటుడు.

రక్తం లేనట్లు పాలిపోయింది వీరవర్మ ముఖం. తను వేసిన పథకం చినికి చినికి గాలివానకు దారితీసిందని గ్రహించేసరికి అతనికి మాటలు రాలేదు. కార్తికేయులవారి కుమారుడు దోషి అని నిర్ణయింపబడిన తరువాత నోరెత్తి

అడిగేవారుండరని భావించాడతను. ప్రకీర్తిపట్టణ న్యాయాధికారుల నిర్ణయానికి ఎవరూ అడ్డు చెప్పరని అనుకున్నాడు. కార్తికేయుడి బంధువులు స్నేహితులు అందరూ యిలా దండెత్తి వస్తారని వూహించలేకపోవటం పెద్ద పొరపాటు అయిందని అప్పుడుగాని అతనికి తెలిసిరాలేదు.

అప్పుడే మరొక భటుడు అక్కడికి వచ్చి ప్రణామం చేశాడు. 'ప్రభూ! కాంచన చక్రవర్తి ప్రకీర్తి పట్టణానికి తరలివద్దామని అనుకుంటున్నారట! విడిది ఏర్పాట్లు చేయమని కబురు వచ్చింది' అని మనవి చేశాడు వినయంగా వంగి నిలబడుతూ.

వీరవర్మ కరచరణాలు కంపించటం ప్రారంభించాయి. ఇక అక్కడే వుంటే బ్రతికి బయటపడటం దుర్లభమేమో అన్న సంశయం అతని హృదయంలో అడుగుపెట్టింది. 'కొన్ని ముఖ్యమైన పత్రాలను నా మందిరంలోనే మరిచి వచ్చాను. రాజప్రతినిధి అడిగితే ఒక అర్ధ ఘడియలో తిరిగి వస్తానని చెప్పండి' అని వారిద్దరికీ సూచనలిచ్చి, వేగంగా బయలుదేరాడు. భవనం ముందున్న తన అశ్వాన్ని అధివసించి మరింత వేగంగా పరుగులు తీయించాడు తన మందిరం వైపు.

*　　*　　*

ప్రకీర్తి పట్టణ రాజవీధిని ఆనుకొని వుంటుంది ఒక పెద్ద వేపచెట్టు. దానిక్రింద వేదిక—అక్కడి బ్రాహ్మణ సముదాయానికి రచ్చబండగా వుపయోగపడుతూ వుంటుంది.

సుష్టుగా భోజనం చేసి, తాంబూలాన్ని నములుతూ ఆ రచ్చబండ వైపు బయలుదేరాడు వినుత శర్మ. వీర



వర్మకు సహకరించి మాధవుడికి వ్యతిరేకంగా సాక్ష్యంచెప్పినందుకు ప్రతిఫలంగా అతను రాజప్రతినిధికి పురోహితుడైనాడు. ప్రకీర్తి పట్టణ బ్రాహ్మణ సముదాయంలో అతని మాటకు ఎదురులేకుండా వుంది.

రచ్చబండమీద ఆశీనులైవున్న బ్రాహ్మణులందరూ అతన్నిచూడగానే వినయంగా లేచి నిలబడ్డారు. 'కూర్చోండి

మీకంటె చిన్నవాణ్ని. నేను మీకు యివ్వాలిగాని మీరు నాకు యివ్వకూడదు గౌరవం....అంటూ తనకు ప్రత్యేకంగా కేటాయించబడిన చలువరాతిమీద ఆశీనుడైనాడతను.

'వినుతశర్మా! పట్టణం బయటవున్న దొమ్మరివాళ్లు యీమధ్య మరీ బరితెగించారురా....బ్రాహ్మణులెవరైనా వంటరిగా అటు ప్రక్కకుపోతే అవమానించి పంపందే వూరుకోవటంలేదు' అన్నాడు వృద్ధుడైన బ్రాహ్మణుడొకడు.

'ఇది ఆ కార్తికేయుడి కుటుంబంవల్లనే వచ్చిన తంటా. దొమ్మరి రాక్షసులకు మనమీద ద్వేష భావాన్ని కలిగిస్తున్నాడు కార్తికేయుడి తండ్రి. ఆ కుటుంబాన్ని వెలివేద్దామని అంటే మీరు వినిపించుకోవటం లేదు. ఆ కుటుంబాన్ని పట్టణంనుంచి తరిమేస్తేగాని మనకు శాంతి లేదు' గంభీరంగా అన్నాడు వినుత శర్మ.

"మాటలు చెప్పినంత తేలిక కాదురా వెలివేయటం అంటే. రాజధానిలో వున్న మన కులపెద్దలకు అందుకు సరియైన కారణాన్ని వివరించాలి. చక్రవర్తికి అంగీకారం అయితే తప్ప ఆపని చేయటానికి వీలులేదు' అన్నాడు మరొక వృద్ధ బ్రాహ్మణుడు.

'మనమందరం ఒకే మాటమీద నిలబడితే వాళ్ళందరూ కాదనగలరా! మీరు వూఁ అనండి. మిగిలిన పనులన్నీ నేను చేస్తాను' వేడిగా అన్నాడు వినుత శర్మ.

అదే సమయంలో సురుగులు క్రక్కుతూ అక్కడికి వచ్చిందొక అశ్వం. అది ఆగకముందె క్రిందికిదూకి అక్కడి వారందరికీ నమస్కరించాడు ఒక రాజభటుడు. చక్రవర్తి అంగరక్షక దళానికి చెందినవాడని-అతను ధరించిన దుస్తులు తెలుపుతున్నాయి.

'ఈ బ్రాహ్మణ కులానికి పెద్ద ఎవరు స్వామీ మీలో?' వారందర్నీ చూస్తూ ప్రశ్నించాడతను.

'నేనే' గర్వంగా రొమ్ము విరుచుకుంటూ సమాధానం యిచ్చాడు వినుత శర్మ

'మహామంత్రులవారు పంపించారు నన్ను. కార్తికేయుల వారి బిడ్డడి మీద జరిగిన నేరారోపణను తిరిగి విచారణ చేయటానికి చక్రవర్తి స్వయంగా బయలుదేరుతున్నారట ఇంతకు మునుపు జరిగిన విచారణలో. కాని విషయాలను మీరెవరైనా చెప్పివుంటే వెంటనే ఆ విషయాన్ని న్యాయాధికారులకు చెప్పుకొని మన్నింపు కోరుకోమని అన్నారు. విచారణ అంటూ ప్రారంభం అయితే—బ్రాహ్మణులా—శూద్రులా అనే వ్యత్యాసం లేకుండా శిక్షలు విధించబడతాయట' అని చెప్పి సమాధానంకోసం ఎదురుచూడకుండా అశ్వాన్ని అధిరోహించి వచ్చినదారినే వెళ్ళిపోయాడా రాజభటుడు.

'ఏరా వినుత శర్మా! ఏమిటిరా యిది?' ఆశ్చర్యంగా అన్నాడు అంతకు ముందు వినుతశర్మ మాటలకు ఎదురు చెప్పిన వృద్ధ బ్రాహ్మణుడు.



వెలవెలబోతున్న వదనంతో ఆ భటుడు పోయిన దిక్కుకే చూస్తున్నాడు వినుత శర్మ. ఆమాటలు వినగానే వులిక్కిపడి యీ లోకంలోకి వచ్చాడు.

'ఏరా! మాట్లాడవేమిటిరా?' రెట్టించి అడిగాడా బ్రాహ్మణుడు.

'ఏం మాట్లాడమంటావ్? నాకు అవతల అనేకమైన పనులున్నాయి. వస్తాను' అంటూ వడివడిగా వీరవర్మ భవంతి వైపుబయలుదేరాడు వినుత శర్మ.

మూసివున్నాయి ఆ భవన ద్వారాలు. ఒకే ఒక సేవకుడు అక్కడ కూర్చుని కునికిపాట్లు పడుతున్నాడు.

'వీరవర్మగారు వున్నారా?' అడిగాడు వినుతశర్మ.

'పోపోవయ్యా ఈపాటికి కాంచన దేశపు సరిహద్దుల్ని దాటివుంటాడాయన. పోయి కలుసుకో' చిరాకుగా అంటూ మరో ప్రక్కకు తిరిగి గురకలు తీయటం ప్రారంభించాడు ఆ సేవకుడు.

ఆ మాటలు వినుతశర్మకు అర్థం కాలేదు. అక్కడినుంచి వెనుతిరిగి బుద్ధదరాయుడి భవనంవైపు అడుగులు వేశాడు.

'రాజప్రతినిధికి శిరోవేదన అధికంగా వున్నదట. ఇప్పుడు ఎవర్నీ చూడరు' అంటూ అతన్ని ముఖద్వారంవద్దనే అడ్డుకున్నారు సైనికులు.

'నన్ను చూస్తారు. వెంటనే మాట్లాడాల్సిన పని ఒకటి పడింది' బ్రతిమాలుకున్నాడు వినుత శర్మ

'అదేమిటో మాకు తెలియదు. మీరు రేపు రండి, ఈలోపుగా అడిగి అనుమతి తీసుకుంటాం' నిక్కచ్చిగా అన్నాడు ఆ సైనికులకు అధికారి.

అప్పుడే అక్కడికి వచ్చారు నలుగురు సైనికులు.

'ఏమయింది ? వీరవర్మ వస్తున్నాడా ?' అడిగాడు సైనికాధికారి.

'ఇంకెక్కడి వీరవర్మ! తన సంపదసంతా అశ్వాలమీద వేయించుకొని, అనుచరులతో సహా పట్టణాన్ని వదిలిపెట్టి వెళ్ళిపోయాట్ట. ఎందుకో ఎవరికీ తెలియటం లేదు అన్నారు సైనికులు.

'అది మనకు అనవసరం. పోయి రాజప్రతినిధికి చెప్పండి. రెండు ఘడియలనుంచీ ఎదురుచూస్తున్నాడు. ఇప్పటికి, కనీసం వందసార్లయినా అడిగివుంటాడు' అంటూ ఆ సైనికులను భవనంలోకి పంపించి తలుపులు మూశాడు సైనికాధికారి.

ఒక ప్రక్కగా నిలబడి ఆమాటల్ని వింటున్న వినుత శర్మ గుండెలు గుభిల్లుమన్నాయి. ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా పట్టణ న్యాయాధికారి భవనంవైపు పరుగుతీశాడు.

* * *

'అరవింద నగరానికి దారి' అని వ్రాయబడి వున్న శిలా ఫలకం ముందు నిలబడి, దూరంలో కనిపిస్తున్న పటణ ద్వారాలను పరిశీలనగా చూశాడు దొమ్మరి నాగేశు.

అలసటగా అడుగులు వేస్తూ వచ్చి అతన్ని కలుసుకున్నాడు అతని బావమరిది. అతని వెనుకగా అరుగుదెంచారు మరో పదిమంది దొమ్మరి యువకులు.

'అరేయ్ బావా....నువ్వు పొలిమేరల్లో తిరుగుతున్న పశువుల కాపర్లను విచారించు. నేను రాజవీధిలో వుండే



వర్తక ప్రముఖులను కలుసుకుంటాను.'' మిగిలిన పట్టణ భాగాన్ని కలియ తిరిగి ప్రశ్నలు వేస్తారు మనవాళ్లు. మాధవయ్య జాడలు మనకు యిక్కడ కనిపించి తీరతాయి. ఇందాకటినుంచీ నా కుడికన్ను అదేపనిగా అదురుతోంది. అంటూ వారందరినీ తలా ఒకవైపుకు పంపించాడు నాగేశు. తను సూటిగాపోయి పట్టణద్వారాన్ని అధిగమించి, రాజవీధి లోకి అడుగుపెట్టాడు.

మాధవుడు మాయమైనాడని తెలిసిన మరుక్షణం తన వారిని వెంటబెట్టుకుని బయలుదేరాడతను. కనిపించిన వారందర్నీ ప్రశ్నలతో వేధిస్తూ అన్వేషణ సాగిస్తున్నాడు.

అరవింద నగరంలోవున్న వ్యాపార కేంద్రాలన్నిటిలోకి అతి పెద్దదిగా కనిపిస్తున్న ఒక వస్త్రాలయం దగ్గిరికి పోయాడు నాగేశు. అక్కడ కాపలా వున్నవారిని ప్రశ్నించాలని అనుకుంటుండగానే వెనుకనుంచి పరుగెత్తుకు వచ్చాడు అతని బావమరిది.

'బావా! త్వరగా రావాలి...ఆలస్యం అయితే లాభంలేదు' అంటూ వచ్చి అతని చేతిని పట్టుకున్నాడతను.

ఎదురు ప్రశ్నలు వేయకుండా అతన్ని అనుసరించాడు నాగేశు.

పట్టణ ద్వారాలను ఆనుకునివున్న ధర్మసత్రం దగ్గిరికి తీసుకుపోయి-చూడమన్నట్లు సైగచేశాడు అతని బావమరిది.

అక్కడ ఆగివున్న అశ్వాలను, వాటిమీదవున్న పెద్ద పెద్ద మూటలను చూసి ప్రశ్నార్థకంగా అతనివైపు తిరిగాడు నాగేశు.

'బావా! నీది పట్టి మట్టిబుర్ర అని కార్తికేయులవారు అంటూ వుంటే విని ఏమో అనుకునేవాణ్ని. అని మన

వీరవర్మ అశ్వాలు. ప్రకీర్తి పట్టణంలో వుండాల్సిన మనిషి యీ అరవింద నగరంలోకి ఎలా వచ్చాడు?'

బావమరిది ఎత్తిపొడుపు మాటలు కోపాన్ని తెప్పించక పోగా నాగేశును ఆశ్చర్యాంబుధిలో ముంచి వేశాయి. వీరవర్మ అరవింద నగరానికి రావటమా!!!

అతని ఆశ్చర్యం అంతం కాకముందే సత్రంలో నుంచి బయటికి వచ్చాడు వీరవర్మ. అతని అనుచరులు అశ్వాలను తీసుకొని పట్టణ ద్వారాలను దాటారు. పచ్చల పల్లకీలో ఎక్కి వారిని అనుసరిస్తున్న వీరవర్మను చూడగానే, పట పటలాడుతూ పైకి వుబికాయి నాగేశు కండలు.

'బావా! పిలవరా మనవాళ్ళని. వీడి వ్యవహారం ఏమిటో తేల్చుకున్న తరువాతనే మాధవయ్యను వెతుకుదాం అన్నాడు. పళ్ళు కొరుకుతూ.

రివ్వున పోయాడు అతని బావమరిది....పావుఘడియలో తమ వారందర్నీ వెంటబెట్టుకు వచ్చాడు.

* * *

అరవింద నగరానికి ఆరుక్రోసుల దూరంలో వుంది సప్తగిరి అనబడే పర్వతం. సప్తగిరి నాధుడనే దేవతా మూర్తికి ఒక పెద్ద ఆలయం నిర్మించబడి వున్నది ఆ పర్వతంమీద.

పచ్చల పల్లకీని పర్వతపాదంలో దింపించి, కాలినడకన ఆ ఆలయంవైపు బయలుదేరాడు వీరవర్మ. అప్పటికి సంధ్యచీకట్లు ఆ ప్రదేశాన్ని అలుముకొని వున్నాయి. పూజలు పునస్కారాలు లేక పాడుపడిపోయిన సప్తగిరి నాధుడి ఆలయం-భూతాల నిలయం మాదిరి భయంకరంగా కనిపిస్తోంది ఆ మసక వెలుగుల్లో.



ఆలయ ప్రాకారాలను సమీపించగానే, పాడుపడిన కల్యాణ మండపంలో కూర్చునివున్న యిద్దరు భృత కాయులు అతని పాదాలకు ప్రణమిల్లారు- మీకోసమే ఎదురు చూస్తున్నాం దొరా!' అంటూ.

'కుశలంగా వున్నారా?' భావగర్భితంగా ప్రశ్నించాడు వీరవర్మ.

'మీరు పథకం వేసిన తర్వాత తిరుగు అనేది ఉంటుందా? రండి మీరే చూద్దురుగాని....' అంటూ గర్భగుడివైపు దారి తీశారు వారిద్దరూ.

అక్కడికి కొద్దిదూరంలో వున్న ఒక చెట్టుమీదికి ప్రసరించింది వీరవర్మ దృష్టి.

దానిక్రింద కట్టబడివున్న వేదికమీద పడుకొని వున్నా డొక మహాకాయుడు. దుమ్ముధూళి పడి అసహ్యంగా కనిపిస్తోంది అతని శరీరం. ఎత్తుగా పెరిగిన తల, బవిరి గడ్డం, భయంకొలిపే విధంగా వున్నది అతని ఆకారం.

'ఎవరతను ?' ప్రశ్నించాడు వీరవర్మ.

'ఎవరో పిచ్చివాడు. ఈ రోజు మధాహ్న సమయంలో, వచ్చి అక్కడ పడుకున్నాడు.''

''అతన్ని వెంటనే పంపించేయండి....'' అంటూ మూసి వున్న గర్భగుడి తలుపుల్ని కాలితో తన్నాడు వీరవర్మ.

సగం విరిగిపోయిన సప్తగిరి నాధుడి విగ్రహాన్ని ఆనుకొని కూర్చునివున్న ఒక స్త్రీమూర్తి అదిరిపడి తల ఎత్తింది.

''హ్హహ్హహ్హ వందనా! కుశలంగా వున్నావా? నీ ప్రభువు కార్తికేయుడు వచ్చి నిన్ను రక్షిస్తాడనే యింకా కలలు

కంటున్నావా?" అంటూ లోపలికిపోయి తలుపులు మూశాడు వీరవర్మ.

కెవ్వున అరిచిందా స్త్రీమూర్తి. బయట నిలబడివున్న ఆ దృఢకాయులిద్దరూ ఒకరివంక ఒకరు చూసుకొని పెద్దగా నవ్వుకున్నారు.

ఆ శబ్దానికి నిద్రాభంగమై కాబోలు-గట్టిగా ఆవలిస్తూ లేచి కూర్చున్నాడు చెట్టుక్రింద నిదురబోతున్న మహాకాయుడు.

'ఇక్కడ ఎవరూ వుండకూడదు. ఇక నువ్వు వెంటనే వెళ్ళిపోవటం మంచిది' అంటూ అతని దగ్గిరికి వెళ్లారు దృఢకాయులు యిద్దరూ.

అదే సమయంలో మరోసారి వినవచ్చిందా స్త్రీమూర్తి ఆర్తనాదం. చటుక్కున లేచి అటు అడుగు వేయబోయిన మహాకాయుడి మార్గానికి అడ్డం నిలబడ్డారు దృఢకాయులు.

'నీకు సంబంధించని వ్యవహారం అది నీ దారిన నువ్వు పోకపోతే ప్రాణాలు పోగొట్టుకుంటావ్' అన్నారు నడుముకు వ్రేలాడుతున్న ఖడ్గాలమీద చేతులువేస్తూ.

మెరుపుకంటె వేగంగా లేచాయి ఆ మహాకాయుడి పిడికిళ్ళు. దృఢకాయుల శిరస్సులమీద వింధ్య పర్వతాలు పడినట్లు అయింది. నాశికా రంధ్రాలలోనుంచి రక్తపుధారలు వెలువడుతుండగా నేల కూలిపోయారు.

చేతుల్ని తన కటివస్త్రానికి తుడుచుకుంటూ గర్భగుడిని సమీపించాడా మహాకాయుడు. 'రక్షించండి....నన్ను రక్షించండి!!' అంటూ ఆక్రోశిస్తున్నది లోపలవున్న స్త్రీమూర్తి.

కుడి పిడికిలిని తలమీదినుంచి తిప్పి గర్భగుడి తలుపులకేసి గుద్దాడా మహాకాయుడు. ఇనుపగుదియ ఏదో గుద్దు



కున్నట్లు కిర్రుమంటూ ఎగిరి ఆవల పడిపోయింది ఆ తలుపుల్ని బిగపట్టి వుంచిన గడియ.

ముడివీడిన కురులతో, జారిపోతున్న వలువలతో-శరీరంలోవున్న శక్తినంతా కూడగట్టుకొని వీరవర్మకు లొంగకుండా తప్పించుకుంటున్నది లోపలవున్న స్త్రీమూర్తి. తలుపుల్ని విరగగొట్టి ద్వారంలో ప్రత్యక్షమైన భీకరాకారుడిని చూడగానే ఒక్క దుముకులో అతన్ని సమీపించి చేతులు జోడించింది.

'వందనా! నువ్వా!!' ఆశ్చర్యంగా అన్నాడు ఆ మహాకాయుడు.

అదిరిపడి అతని ముఖంలోకి చూసిందామె.

'గుర్తుపట్టలేదా వందనా?' ఆమె చుబుకాన్ని స్పృశిస్తూ అన్నాడతను.

ఆ మాట అతని నోటివెంట వెలువడిన మరుక్షణం అతని పాదాలమీద వాలిపోయింది ఆమె.

'ఎవడ్రా నువ్వు?' అంటూ రెండు అడుగులు ముందుకువేసి కరవాలాన్ని పైకి ఎత్తాడు వీరవర్మ.

ఉన్నట్లుండి కదిలాయి మహాకాయుడి హస్తాలు. ఎలుగుబంటి పంజాలమధ్య చిక్కుపడినట్లయింది వీరవర్మ పరిస్థితి. బాధను భరించలేక బిగ్గరగా అరిచాడు. ఆ అరుపుల్ని లక్ష్యపెట్టకుండా అతన్ని గాలిలోకి ఎత్తాడు మహాకాయుడు.

* * *

పర్వతపాదం దగ్గిర ఆగిన అశ్వాలను, వాటికి కొంచెం యివతలగా కూర్చుని వున్న వీరవర్మ అనుచరులను చూడగానే చేతిని ఎత్తి సైగ చేశాడు నాగేశు. అతని వెనుకగా వస్తున్న యువకులందరూ ఎక్కడివారక్కడ ఆగిపోయారు.

'బావా! వేసేద్దామా?' దట్టీలో వున్న కత్తిని బయటికి లాగుతూ అడిగాడు నాగేశు బావమరిది.

'ఒక్కడు కూడా పారిపోకూడదు....' హెచ్చరించాడు నాగేశు.

'మన చేతికి చిక్కటమంటూ జరగదు. చిక్కిన తర్వాత పారిపోవటమా!!' అంటూ వేగంగాపోయి వారిమీదవిరుచుకు పడ్డాడు అతని బావమరిది.

'కొట్టండి .... చంపండి....' అని అరుస్తూ లేచారు వీరవర్మ అనుచరులు.

రాళ్ళను పగలగొట్టి కొట్టి యినుప ముక్కల్లా బండ బారిన దొమ్మరి యువకుల చేతుల ముందు వారి శక్తి యుక్తులు ఎందుకూ కొరగాకుండా పోయాయి. ఒకరి తర్వాత ఒకరినిగా గాలిలోకి ఎత్తి నేలకేసి బాదాడు నాగేశు. పడినవాళ్ళు తిరిగి లేవకుండా తన కత్తి పిడితో శిరస్సులను మర్దించాడు అతని బావమరిది. పది నిమేషాలలో కళ్ళు త్రిప్పటానికి కూడా వీలులేనంత దృఢంగా బంధితులైనారు వీరవర్మ అనుచరులు.

'పదండి పర్వతంమీదికి. వీరవర్మను ప్రాణాలతో పట్టు కోవాలన్న మాటను మాత్రం మరిచిపోకండి....' అంటూ శిథిలమైన సోపానాల మీదుగా ఆలయం వైపు పరుగు తీశాడు నాగేశు.

ఆలయాన్ని సమీపిస్తుండగా—పక్షిలా గాలిలో ఎగురుతూ వచ్చి అతని పాదాలముందు పడ్డాడు వీరవర్మ.

మొదట అతన్ని గుర్తించలేదు నాగేశు. గుర్తించిన మరుక్షణం తొలి చరిచి, అతన్ని చేతుల్లోకి ఎత్తుకున్నాడు.



'విసురు బావా! పోయిగర్భగుడిలో పడాలి!' వెనుకనుంచి పురి ఎక్కించాడు అతని బావమరిది.

గుండెలనిండా గాలిని పీల్చుకొని వీరవర్మను విసిరాడు నాగేశు. అతను గింగిరాలు తిరుగుతూపోయి గర్భగుడి ముందు పడగానే పెద్దగా నవ్వుతూ మీసాలు మెలివేశాడు. మెలివేస్తుండగానే మళ్ళీ వచ్చి అతని పాదాల ముందు పడ్డాడు వీరవర్మ.

ఆశ్చర్యంతో తలఎత్తిన నాగేశుకు గర్భగుడి ద్వారంలో ప్రత్యక్షం అయిన మహాకాయుడు—అతని కౌగిల్లో వదిగి వున్న వందన కనిపించారు.

మతి భ్రమించిన వాడిలా నోరు తెరుచుకొని చూస్తున్న నాగేశును గమనించి మందహాసం చేశాడా మహాకాయుడు.

'బాగున్నావా నాగేశూ?' అని ప్రశ్నించాడు ముందుకు వస్తూ.

తను చూస్తున్నది కలో, నిజమో అర్థంకాక వెర్రిగా అతని దగ్గరకు పరిగెత్తాడు నాగేశు. చేతిని జాచి అతని శరీరాన్ని తడిమి చూశాడు.

'అప్పటికీ యిప్పటికీ ఫీది మట్టి బుర్రేరా నాగేశూ. తెలివి తేటలు తప్ప నీకు మిగిలినవన్నీ వున్నాయి.' వురుము వురిమినట్లు అన్నాడా మహాకాయుడు.

అతన్ని గుర్తుపట్టాడు నాగేశు. ఆనంద భాష్పాలు వెలువరిస్తూ 'దొరా' అని అరిచి, ఎగిరి అతని పాదాలమీద పడ్డాడు.

* * *

"ఏ ధర్మశాస్త్రాన్ని ఆధారంగా తీసుకొని మా మేనల్లుణ్ని దోషిగా నిర్ణయించారు? ఏ ధర్మసూత్రాన్ని అనుసరించి

మా కుటుంబాన్ని యీ భైరవాలయపు గాలిగోపురాన్ని సైతం చూడకుండా ఆంక్ష విధించారు!'' సమావేశమైన ప్రకీర్తి పట్టణ పురప్రముఖుల వంక చూస్తూ ఆవేశంగా అడిగాడు కార్తికేయుడు బావమరుదుల్లో కడసారివాడైన దామోదరుడు.

'దామోదరా! చక్రవర్తి వచ్చేవేళ అయింది. కొంచెం నిదానించితే బాగుంటుందని నా అభిప్రాయం' అంటూ అతని మాటలకు అడ్డువచ్చాడు ప్రధానమంత్రి.

'నిదానించినంతవరకూ నిదానించాం. మా ప్రమేయం లేకుండానే మీరు న్యాయం చేకూరుస్తారని ఆశించాం. అది జరగనే లేదు.' కోపంగా అన్నాడు దామోదరుడి అన్న హరిహరుడు.

'హరిహరా! నామాట వినండి! అన్నీ తెలిసిన మీరే యిలా ఆవేశపడితే యిక మిగిలినవారు చూస్తూ వూరుకుంటారా?' అంటూ అతని చేతులు పట్టుకున్నాడు ప్రధాన మంత్రి.

కత్తులమీద చేతులువేసి నిలబడివున్న కళింగవీరుడు నభూతవర్మను, అభిరామపుర వణిక్ సార్వభౌములను, వారి అనుచరులను చూసేసరికి మరింత ఆశ్రుతకు గురి అయింది మహామంత్రి అంతరంగం. వారుమాత్రమే కాదు ....సర్వ సైన్యాధ్యక్షుడు సింహకేతుడు కూడా అలాగే ప్రవర్తిస్తున్నాడు. మహామంత్రి తల ప్రక్కకు తిప్పిన మరుక్షణం రక్తపుటేరులు ప్రవహించేటట్లున్నాయి ప్రకీర్తి పట్టణంలో.

'సింహకేతూ ...రెండు సైనిక దళాలను పంపించి,



చక్రవర్తిని త్వరితంగా రమ్మనమని నామాటగా విన్నవించు' అంటూ అతని వైపు తిరిగాడు మహామంత్రి.

ఆయన ఆమాట అంటూండగానే రాజవీధిలో చెలరేగింది పెద్ద కలకలం. నురుగులు క్రక్కుతున్న అశ్వాలమీద వాయువుకంటె వేగంగా అక్కడికి వచ్చారు నలుగురు దొమ్మరి యువకులు.

'కార్తికేయులవారు వస్తున్నారు. ప్రకీర్తి పట్టణ వాసుల్లారా మీ పాపం పండింది. అని అశ్వాలమీదినుంచి క్రిందికి దూకి మాధవుడి తాతగారికి నమస్కరించారు.

వారిని, వారిలో ఒకడైన నాగేశు బావమరిదిని గుర్తు పట్టా డాయన.

'ఈ వృద్ధ ప్రాణాన్ని మరికొంచెం బాధకు గురిచేయాలని వున్నదా? ఏమంటున్నార్రా? నా బిడ్డడు వస్తున్నాడా?' గద్గదస్వరంతో అడిగాడు వారిని లేవనెత్తుతూ.

'దొరా! ఇంకెందుకు బాధ? రెండు క్షణాలు ఓపిక పట్టండి....' అన్నాడు నాగేశు బావమరిది. అతని మాటలు ముగియక ముందే—అక్కడ ప్రత్యక్షం అయ్యాడు కార్తికేయుడు.

వందన నాగేశులు చెరొక ప్రక్క నడుస్తుండగా, బంధితులైన నీరవర్మను అతని అనుచరులను దొమ్మరి యువకులు తీసుకొని వస్తుండగా—మత్తగజంలా అడుగులువేస్తూవచ్చి తండ్రిపాదాలకు ప్రణమిల్లాడు. బావమరదుల భుజాలు తట్టి, వారి ప్రక్కనే నిలబడివున్న సింహకేతుణ్ని అభిరామపురి నుంచి వచ్చిన రఘురామ, వినయదత్తుల్ని కౌగలించుకున్నాడు. తన పాదాలు తాకిన కళింగ వీరుడు నభూతవర్మ

చేతిని పట్టుకొని లేవనెత్తుతూ—అక్కడ సమావేశమైవున్న ప్రకీర్తిపుర ప్రముఖుల వైపు తిర్గాడు.

వెలవెలబోయాయి వారి వదనాలు. కార్తికేయుడి కనుల లోకి చూడలేక తలలు వంచుకున్నారు. మిన్నువిరిగి మీద పడటానికి మరెంతో వ్యవధిలేదని గ్రహించి గబగబాపోయి కార్తికేయుడి భుజంమీద చెయ్యివేశాడు మహామంత్రి.

'వీరవర్మ పన్నిన కుతంత్రాన్ని అర్థం చేసుకోకుండా రాజప్రతినిధి చేసిన ద్రోహం ఏమిటో తెలుసుకోకుండా, దోషం జర్గిందన్న వార్తను విన్న మరుక్షణం వీరాధివీరుల మంటూ నేర విచారణ చేసి శిక్షలు విధిస్తారా? మేము కట్టించిన ఆలయంలో, మేము చేయించిన నగల్ని, మేమే అపహరించామని అనటంతో ఆగకుండా, మా భూముల్నే వేలంవేసి, నగల్ని మీరు చేయిస్తారా? మా ఆలయాన్ని మేము చూడగూడదని ఆంక్షలు విధిస్తారా? మీ తలల్ని నరికి ఆలయ ప్రాకారానికి అలంకరిస్తే నన్ను అడ్డుకునేది ఎవరు?' మహామంత్రి చేతిని ఆవలికి త్రోసి, మత్తగజంలా ఘీంకరిస్తూ ముందుకు అడుగువేశాడు కార్తికేయుడు.

చటుక్కున అతన్ని అడ్డుకున్నారు దామోదర హరిహరులు. "బావా కొంచెం శాంతించు....నీ చేయిపడితే ఆ అర్భక ప్రాణాలు నిలుస్తాయా?" అంటూ.

వారి మాటలను ఆలకించలేదు కార్తికేయుడు. పుర ప్రముఖుల ప్రక్కనే నిలబడివున్న రాజప్రతినిధి బుద్పద రాయుడిమీద పడింది అతని చూపు. భూనభోంతరాలు బ్రద్దలయ్యేలా సింహనాదం చేస్తూ అతన్ని సమీపించి. గుడ్డ బొమ్మను ఎత్తినట్లు గాలిలోకి ఎత్తి శక్తికొద్దీ అవతలకు విసిరేశాడు.



గొల్లుమన్నారు అక్కడివారందరూ....అంతవరకూ ఎంతో ప్రయాసపడి మహామంత్రి నెలకొల్పిన ప్రశాంతత అక్కడినుంచి పారిపోయింది. ప్రకీర్తిపురపట్టణం ద్వారాలు ప్రకంపించేలా అరుస్తూ తమ ఖడ్గాలను వరలలోనుంచి బయటికి లాగారు కార్తికేయుడి అనుయాయులందరూ.

'కార్తికేయులవారి కుటుంబాన్ని గురించి తప్పుగా మాట్లాడింది ఎవరు? వారిని వుప్పు పాత్రలో వూర వెయ్యాలని అరిచిన పౌరులు ఎవరు? ఇప్పుడు అరవండిరా' అంటూ అక్కడ గుమికూడిన పౌర సమూహం మీదికి దుమికారు కళింగ వీరుడైన నభూతవర్మ అనుచరులు.

సింహపు గుంపును చూసిన లేళ్ళలా నలుదిక్కులకు చెల్లాచెదరైనారు ప్రకీర్తిపుర వాసులందరూ. ప్రాణాల్ని అరిచేతుల్లో దాచుకొని తమ యిళ్ళల్లో దూరి తలుపులు బిడాయించుకున్నారు.

బుద్పదరాయుణ్ణి అవతలికి విసిరేసి, పురప్రముఖుల మీదికి పోయాడు కార్తికేయుడు. ఉక్కుముక్కలవంటి అతని బాహువుల మధ్య చిక్కుపడ్డారు నలుగురు ప్రముఖులు.

'కార్తికేయా! దయచేసి నా పలుకుల్ని ఆలకించు—కార్తికేయా!!" అంటూ అతన్ని శాంతింపచేయటానికి విశ్వప్రయత్నం చేశాడు మహామంత్రి. అంతలోనే ఆయన చూపులు దొమ్మరి నాగేశుమీదికి మరలాయి.

కార్తికేయులవారి యింటిముందు వుండే పెద్ద కొండరాతిని ఎత్తి ఎవరిమీదికో విసరబోతున్నాడతను.

'నాగేశూ!' అనీ అరిచి అటు పరుగుతీశాడాయన.

అదే సమయంలో చెవులు చిల్లులు పడేటట్లు వినవచ్చాయి తూర్యానాదాలు. 'చక్రవర్తి. చక్రవర్తి వస్తున్నారు....' అన్న అరుపులు వినిపించాయి దూరంనుంచి.

పంచకల్యాణి గుర్రాన్ని పరుగులు తీయిస్తూ, మెరుపులా అక్కడ ప్రత్యక్షమైనాడు కాంచన చక్రవర్తి. 'ఆగండి!' అని కేకవేసి, ఒక్క గంతులోపోయి కార్తికేయుడి దారికి అడ్డం నిలబడ్డాడాయన.

ఆయన్ను చూడగానే కార్తికేయుడి ఆవేశం కొంచెంగా దిగింది క్రిందికి.

'ప్రభూ! నాదారికి అడ్డు రాకండి. నా బిడ్డడ్ని నాకు కాకుండా చేసిన యీ నికృష్టులను నాశనం చేయందే ఉపశమించదు నా బాధ' అన్నాడు ఉరుములాంటి కంఠంతో.

'కార్తికేయా! నీ అభీష్టానికి ఎదురుచెప్పడు నీచక్రవర్తి. కానీ నా పరిపాలనలో జరిగిన యీ తప్పును నా చేతుల మీదుగానే సరిచేయకపోతే, ప్రపంచం నన్ను పరిహసిస్తుంది. నీ చక్రవర్తి నవ్వులపాలైతే అది నీకు బాగుంటుందా?'

చక్రవర్తి మాటలు కార్తికేయుడి ఆవేశాన్ని పూర్తిగా అణిచివేశాయి. పురప్రముఖులను వదిలి దూరంగా జరిగాడు. అదే సమయంలో-చక్రవర్తితోపాటు వచ్చిన భైరవాలయ పూజారిమీద ప్రసరించాయి అతని చూపులు.

వంటిచేత్తో పెద్ద బర్రిశెను పట్టుకొనివున్న భైరవాలయ పూజారి, ఆనందభాష్పాలు విడుస్తూ వచ్చి అతని పాదాల మీద వాలిపోయాడు. చటుక్కున అతని చేతిని పట్టుకొని గాఢంగా కౌగలించుకున్నాడు కార్తికేయుడు.

'బుద్ధుదరాయుడిని తీసుకురండి-భైరవాలయ పూజారి



మాకు సంగతులన్నిటినీ వివరించి చెప్పాడు....' గంభీర కంఠంతో ఆజ్ఞ యిచ్చాడు కాంచన చక్రవర్తి.

శిలావిగ్రహంలా నిలబడివున్న సర్వసైన్యాధ్యక్షుడు సింహకేతుడిలో చలనం వచ్చింది. 'చూపండిరా ఎక్కడున్నాడో....' అంటూ రాజప్రతినిధికోసం వెతకటం ప్రారంభించాడు.

ఎక్కడున్నాడతను? కార్తికేయుడు విసిరిన విసురుకు పోయి గుమికూడివున్న ప్రజావాహిని మధ్య పడ్డా. తనను ఎవరూ గమనించటం లేదని గ్రహించిన మరుక్షణం లేచి కాళ్ళకు బుద్ధి చెప్పారు.

* * *

ప్రకీర్తిపుర పట్టణద్వారాలను చూడగానే ఏదో తెలియని ఆత్రుత మాధవుడి అంతరంగాన్ని ఆక్రమించుకున్నది. తను అధివసించివున్న గుర్రాన్ని అదిలించి వేగంగా పరుగులు తీయించటం ప్రారంభించాడు.

అది గమనించి పింగళుడి హెచ్చరికలతో నిమిత్తం లేకుండానే గమ్యవేగాన్ని హెచ్చించింది కాలాశ్వం.

వెనుకవస్తున్న భిల్లులు-దూరంలో కనిపిస్తున్న పట్టణాన్ని చూసి బిగ్గరిగా అరిచి తమ గండ్రగొడ్డళ్ళను గాలిలోకి ఎత్తారు.

''మిత్రులారా! వచ్చేశాం!! మన గండు చీమకు ద్రోహం చేసిన వారి సమీపాల్లోకి చేరుకున్నాం. పరుగెత్తించండి మీ అశ్వాలను....' అని తన వారిని రెచ్చగొడుతూ తన అశ్వాన్ని ముందుకు దూకించాడు నల్లతాచు.

సముద్రం వుప్పొంగినట్లు వురకులు వేస్తూ వస్తున్న ఆటవికులను చూడగానే-కవీ విపీ ఎరుగని కల్లోలం

చెలరేగింది ప్రకీర్తి పట్టణంలో. క్షణంలో నిర్మానుష్యమైంది రాజవీధి.

శరవేగంతో వచ్చి పట్టణద్వారాన్ని అధిగమించాడు మాధవుడు. ప్రక్కకు తిరిగి పింగళుడితో ఏదో అనబోతుండగా అతనికి కనిపించాడు ఒక అశ్వికుడు. అతన్ని చూడగానే కోపంతో కందిపోయింది మాధవుడి ముఖం.

'బుద్ధదరాయా!!' అని అరిచి తన అశ్వాన్ని అటు దూకించాడు.

అదిరిపడి చూశాడు బుద్ధదరాయుడు. అశ్వంమీదినుంచి క్రిందికి దూకి పారిపోవటానికి ప్రయత్నించాడు.

'మాధవా! ముందు నగలను మీ తాతగారికి అందించాలి. ఆ తర్వాత వీడి వ్యవహారం ఆలోచించాలి!!' నల్లతాచు చేతిలోని వేటకత్తిని అందుకొని బుద్ధదరాయుడిమీదికి దుముకబోతున్న మాధవుణ్ని వారించాడు పింగళుడు.

పెద్దపెట్టున అరిచి అందుకు తమ వత్తాసును తెలియచేశారు భిల్లులు. తమ అశ్వ పదఘట్టనలతో భూమిని కంపింపచేస్తూ మాధవుడి యింటివైపు బయలుదేరారు.

* * *

బుద్ధదరాయుడి కోసం వెతుకుతున్న వీరులకు—భిల్ల సైన్యాలు కనిపించేసరికి మతులుపోయాయి. చూస్తుండగానే సుడిగాలిలా వారి దగ్గిరికి వచ్చేశాయి నాలుగు అశ్వాలు.

ఒక అశ్వంమీదినుంచి క్రిందికి దూకుతున్న మాధవుణ్ని చూసి 'మాధవయ్యా!' అని అరుస్తూ ముందుకు పరిగెత్తుకొచ్చాడు దొమ్మరి నాగేశు.

మహాభైరవుడి నగల మూటను క్రిందికి వదిలి తాతగారి పాదాలకు నమస్కరించాడు మాధవుడు. ఆయనకు వెనుకగా



నిలబడివున్న తల్లి ముందు ప్రణమిల్లబోతుండగా కనిపించాడు అతనికి—కార్తికేయుడు.

'బ్రహ్మ రాక్షసుడు!!' ఆశ్చర్యంగా అంటున్న మాధవుడిని మృదువుగా మందలించింది అక్కడే వున్న వందన.

కలకంటున్నట్లు చూస్తున్నాడు కార్తికేయుడు. మహావీరుడని పేరుపొందిన తననే బంధించారు కోయలు. అటువంటి కోయల్ని వూచకోత కోయగలిగిన వీరాధివీరుడు 'గండుచీమ'—తనకు కుమారుడు!!!

మాధవుడు మహాభైరవుడి నగలను తీసుకొచ్చాడన్న వార్త కార్చిచ్చులా వ్యాపించింది పట్టణంలో. గుంపులు గుంపులుగా ఆ ప్రదేశానికి తిరిగిరావటం ప్రారంభించారు కార్తికేయుణ్ని చూసి దూరంగా పారిపోయిన పౌరులందరూ.

'కార్తికేయా! నీకొడుకు తిరిగి వచ్చాడు. పోయాయనుకున్న నగలు మళ్ళీ లభించాయి. కక్షలతో కత్తులు నూరటం కంటె, ఈ ఆనంద సమయాన్ని సంతోషంగా గడపటం బాగుంటుందని నా అభిప్రాయం ఏమంటావ్?' మళ్ళీ ఎక్కడ ఆవేశాలు రగుల్కొంటాయో అన్న భయంతో గబగబా అన్నాడు ప్రధానమంత్రి.

మాధవుడి మేనమామలతో కలిసి పింగళ నల్లతాచులతో మాట్లాడుతున్నాడు చక్రవర్తి. 'వీరవర్మ బుద్ధదరాయులకు యావజ్జీవిత కారాగార శిక్షను విధిస్తున్నాం. మహాభైరవుడి నగలను ఆలయానికి చేర్పించి, జరిగిన అపచారానికి పరిహారంగా అర్చన చేయించబోతున్నాం. ప్రకీర్తి పట్టణ పరిపాలనా బాధ్యతను స్వీకరించేది ఎవరో నిర్ణయించుకోవల

సిందిగా పుర ప్రముఖులను ఆదేశిస్తున్నాం' అని ప్రకటించాడాయన.

ఈసారి ఎంతోసేపు ఆలోచించలేదు ఎవరూ. 'ఇంకెవరు? కార్తికేయులవారే అందుకు సమర్థులు' అన్నారు ముక్తకంఠాలతో.

వందన మాధవులతో, సహధర్మచారిణి, స్నేహితులతో, ఆప్తులతో, అనుయాయులతో నిలబడివున్న కార్తికేయుడు తల విదిలించాడు గంభీరంగా.

అయితే మాధవుడి స్నేహితుడు పింగళుడే యీ బాధ్యత తను శిరస్సున ధరించాలి. మహావీరులైన భిల్లులతో కలిసి అతను మన కాంచన దేశానికి పెట్టని కోటగా నిలబడాలి. కార్తికేయులవారు మాతోపాటు రాజధానీ నగరానికి విచ్చేసి రాచ కార్యాలను నిర్వర్తించటంలో తోడుపడాలి' అన్నాడు మహామంత్రి.

కార్తికేయుడివైపు చూశారందరూ. అతను మాధవుడి వైపు తిరిగాడు. తాతగారితో కలిసి మహాభైరవుడిఆలయం వైపు పోతున్నాడు మాధవుడు.

'హరహర మహాభైరవ!' అని అరిచాడు భైరవాలయ పూజారి.

ఒక్కసారిగా అందుకున్నారందరూ—ఆ జయ జయ ధ్వానాలను. వీరవర్మ, బుద్బుదరాయులను చెరసాలవైపు తీసుకుపోతున్న సైనికులు కూడా ఆ పలుకుల్లో పాలుపంచుకున్నారు. పోటెత్తిన సముద్రంలా తనముందుకు వస్తున్న ప్రజాసమూహాన్ని చూసి చిరునవ్వులు చిందించాడు—ఆలయంలోని మహాభైరవుడు.

శుభం.